
ంధ్ర
చిత్రవార
త్రిక

40 పై
3-4-70



57





మీ కోసము - అపూర్వమైన సౌందర్యము రోజంతా తాజాదనము రెండు విధములుగా పనిచేసే సింథాల్ సబ్బుతో

సింథాల్ లో ప్రపంచములో కెల్ల ఎంతో బాగుగా పనిచేసే క్రిమినాశిని జి-11 (హెక్సాక్లోరోఫీన్) ఉంది

జి-11 గల సింథాల్ మాత్రమే మిమ్మల్ని అందముగా తాజాగా ఉంచగలదు

సింథాల్ నిజంగా దుర్గంధ నివారిణి సబ్బు

Interpub/GS/20 Tel


సుందర్‌లాల్ నహతా సమర్పించు
శ్రీ ప్రొడక్షన్స్ వారి
పెళ్లికూతురు
నిర్మాత: పి బాబ్జీ దర్శకత్వం: వి. రామ చంద్రరావు B.A. (Hons)

MOULIS

ఉత్తరాలు

అనివార్య కారణాలవల్ల ఈ వారం న్యూఢిల్లీ లేఖ ప్రచురించలేక పోతున్నాము.

—సం॥

కథలు

ఆత్మార్పణ చాలా బాగుంది. 'విలువ' కథ చిన్నదైనా దానిలో మున్న విషయంలో కొంతైనా విలువుంది. చిన్నపిల్లవానిపై సాధారణంగా తల్లికి ప్రేమాభిమానాలు ఎక్కువగా వుండటం సహజం. కాని యీ కథలో రచయిత తల్లి పాత్ర మరీ హీనంగా చిత్రీకరించారు. తల్లి తన సుఖం మాని తన సంతానాన్ని సుఖపెడుతుంది. అది ఆమె ధర్మం, మరి యిందులో అతివేలు లాంటి వాళ్ళ సినిమా కోసమని కాని పెంట కుప్పపై విసిరి వెయ్యటం బాగాలేదు. అది ఆమె సినిమాపై మోజును రుజువు చేసింది. నేటి సినిమాల ప్రభావం కూడ రచయిత యిందులో చిత్రించారు.

—కుమారి వి. లక్ష్మి, [శ్రీకాకుళం]

వ్యాసాలు

తెలంగాణా ఉద్యమానికి మరో కారణం వివరిస్తున్నాను. ఈ ఉద్యమానికి పూర్వం తెనుగు [ఆంధ్రప్రాంతము వారు] రచయితలు, తమ రచనలలో 'తెలంగాణా ప్రాంతీయులను కించపరిచే సంభాషణలు, వాక్యాలను ఉదహరించారు. ఇట్టి విషయాలను ఆత్మగౌరవం ఉన్న ఏవ్యక్తి యైనను సహించదు.

సినీనటి సాహిత్య అకాడమీ బహుమతి పొందిన కథారచయిత్రి భానుమతి రామకృష్ణ. 'అత్తగారి కథలు' నెంబర్ టూలో ఒక కథలో తెలంగాణా వ్యక్తి వ్యక్తిత్వాన్ని కించపరిచే వాక్యాన్ని వ్రాసారు. వారిలోని సంకుచితత్వం ఇంతని చెప్పలేము. ఉద్యమానికి పూర్వమే తెలంగాణా వ్యక్తిత్వాన్ని కించపరిచితే, తెలంగాణాకు విముక్తి రాక తప్పదు.., ఆంధ్ర రచయితల హృదయాలలో సోదరభావము ప్రగాఢంగా ఉంటేనే అది సాధ్యం..

దయచేసి ఈ ఉత్తరం ప్రచురించండి..

—ఎస్. వెంకటరంగారెడ్డి [కొల్లాపూర్]

ముఖచిత్రం

'భానురేఖ' ముఖచిత్రం చూడ ముచ్చటగా యుంది. సి. రవిశర్మగారి ఉత్తరంలో తలా—పెళ్ళామా గురించి విమర్శ చేయడం బాగులేదు. ఎందుకంటే ఇది ఉత్తరాల శీర్షిక, పత్రిక గురించి అభిప్రాయాలు తెలియజేయటానికి ఈ ఉత్తరాల శీర్షిక ప్రత్యేకించబడింది, గాని, ఒక సినిమా గురించి, ఆ చిత్ర దర్శకుడు ఆచిత్రం తీయడంలో ఫెయిలయ్యాడో లేదో తెలపడానికి కాదు.

వి. వి. ఆర్. శర్మ, విజయనగరం.

వ్యాసాలు

సోదర సత్యనారాయణ నీ మనసులో రేగుతున్న మంట చల్లారుటకు పత్రికలో ఇలాగ ప్రచురించవలయున హైదరాబాదు గోడల నిండ వ్రాసిలను గుర్తించి వ్రాసినది కరెక్టే. స్వతంత్ర భారతవనిలో యెక్కడికైన బ్రతుకుతెరువుకు పోవచ్చుగాని, తెలంగాణాలోకి పోకూడదు. అది ఒక ప్రత్యేకమైన దేశం. భారతావనిలో కట్టుబడి లేదు. ఆంధ్రుల దేశం. భారతావనిలో కట్టుబడి లేదు. ఆంధ్రులు అనేవారు తెలుగువారు కాదు. వారు తెలంగాణాలోకి పోతే పట్నుకు తప్పవచ్చు. వారు దొంగలు ఇంకో ఇంకో...

వీం. వెంకటశేషయ్య, [సుదూరు]

13—3—70 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సత్యన్నారాయణగారు ఆయన బాధను వ్యక్తపరిచారు. నిజానికి పత్రికవారు తెలంగాణావారి ఉత్తరాలే ఎక్కువ ప్రచురించారు ఆయన వ్రాసిన నిందాపూరిత వాక్యాలు ఒకరు వ్రాసేదేమిటి, అప్పటి రోజులలో ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదు గోడలపై వ్రాసిన వ్రాతలే చాలు. ప్రాణాని కన్న మానానికి ఎక్కువ విలువ యిస్తారు. ఆంధ్ర

ఉత్తరాలు

—సర్కార్ ప్రాంతంవారికి జరిగిన మానభంగాలు ఆయనకు తెలియవా?

రెండు ప్రాంతాలకు చెందని 'రాశి' గారు వ్రాసినది, ఆయనిచ్చిన వివరాలు తెలంగాణావారి కెంతో కోపాన్ని కల్గించాయి. చాలమంది వాటి దురుసుతనాన్ని వుత్తరాల ద్వారా చూపించారు. వాస్తవానికి ఆయన మాకు దగ్గర లేదు, వారికి దూరము కాదు. పత్రికవారు పత్రిక ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ లాంటిది జరిపి తెలంగాణా వారి అభిప్రాయాలను తెలియపరిచారు. అంతటితో యీ ఉత్తరాలు [తెలంగాణా సమస్యపై] ప్రచురించటం ఆగిపోతుందనుకున్నాము. మరల ప్రారంభించారు. పత్రికవారు ప్రచురించే యీ ఉత్తరాల వల్ల సమైక్యతనుగాని వేర్పాటు ధోరణికిగాని ఉపయోగ ముండదు. 13—3—70 పత్రికలోనే శ్రీనివాసాచార్యులు గారు వ్రాసినట్లు యీ వుత్తరాల వల్ల మనం బయటివారికి ఎంతో చులకనవుతున్నాము. ఇప్పటి నుండైనా యీ వుత్తరాలు ప్రచురించటం ఆపేస్తే బాగుంటుంది.

కాకపోతే తెలంగాణా నాయకులకు కావలసినది పదవులు కాని ప్రజాక్షేమం కాదు. ఇప్పటికే వారలు తలోకరు తలోక పదవి స్వీకరించారు.

డి. జగన్నాథరావు [వీరవరం]

* బహాలు

తెలంగాణా సమస్యకి సంబంధించిన ఉత్తరాలు వెయ్యవద్దంటున్నారు కొందరు చదవరులు. ఈ పత్రికలో వెయ్యకపోతే జరిగేదేమిటో ఎవరికీ తెలియదా? ఆంధ్రేతర [లేక తెలంగాణా, ఆంధ్ర— వీటి రెండింటికీ ఇతరమయిన] ప్రాంతాల పత్రికలలో వార్తల, చర్చల సంగతేమిటి? నిప్పు—కోడిని గురించి చెప్పుకునే కథ గుర్తుకి వస్తోంది.

—ఒక చదువరి [మదరాసు] ●

రచయితలకి మనవి

ప్రచురణకి స్వీకరింపబడని తమ రచనలు తిప్పిపంపగోరే వారు వ్రాతప్రతులతోబాటు తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లు పంపాలి. స్టాంపులు మాత్రం పంపిన రచనలు తిప్పిపంపటం సాధ్యం కాదు కనుక రచయితలు పై నిబంధనని గమనించ ప్రార్థన. (విడిగా స్టాంపులు అతికించిన, స్వంత చిరునామా కవరు పంపించినప్పటికీ రచనలు తిప్పిపంపటానికి వీలు కాదు.)

సం॥

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 3—4—'70
శ్రీసాధారణనామ సం॥ చైత్ర బహుళ॥ త్రయో॥

సంపుటము : 63 సంచిక : 29

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్


సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టు ద్వారా

సంవత్సర చందా	26·00
6 మాసముల చందా	13·00
3 మాసముల చందా	6·50

విషయానుక్రమణిక



పశ్చిమబెంగాల్
రాష్ట్రపతి పాలన
ఒరిస్సాలో
నువ్వు రెండు వైపులా ఆడుతున్నావు
గుజరాత్ లో
రాజకీయ రెఫ్యూజీల సంఘం
కూర్చోండి ... నేను కూడా కమ్యూనిస్టు ఆటలాడినవాడినే
గుడుగుడు గుంచం
మధ్యంతర ఎన్నికలు
రాష్ట్రపతి పరిపాలన
కేరళ రాజకీయాలు
అస్థిర మంత్రివర్గం
OOMMEN

సత్యజిత్ రాయ్ చిత్రోత్సవం - ఒక సమీక్ష

ఇటీవలే ఇక్కడ సత్యజిత్‌రాయ్ చలన చిత్రోత్సవం ఒకటి జరిగింది. 18రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవంలో మొత్తం 17 పూర్తి చిత్రాలు. ప్రస్తుతం శ్రీ రాయ్ తయారు చేస్తున్న 'సిక్కిమ్' అనే డాక్యుమెంటరీలో 3 రీళ్లు వేసి చూపించారు.

బుకింగ్ మొదలయిన రెండు రోజుల లోపలే టిక్కెట్లు అన్నీ అమ్ముడు పోయాయి. వేసిన చిత్రాలలో ఎన్నో అంతకి ముందే ఎన్నోసార్లు ఇక్కడ ఆడినవే. 'అరణ్యేర్‌దిన్ రాత్రి' అనే చిత్రం చివరికి వేశారు; దీనిని 'సప్రూ హౌస్'లో 4సార్లు వెయ్యవలసి వచ్చింది.

ఇంతదాకా తన చిత్రాలకి శ్రీ రాయ్ 14 ఎవార్డులు గెలిచాడు. వీటిలో 7 భారతదేశంలో వచ్చినవి (ఒక పద్మశ్రీ, ఒక పద్మభూషణ్‌తో సహా) మిగతావన్నీ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో గెలుచుకున్నవే.

సత్యజిత్‌రాయ్ చిత్రాలలోని గొప్పదనం ఏమిటి, అని ఆలోచించి చూస్తే — ఆయన చిత్రాలకి ప్రత్యేకమయిన గుణాలు కొన్ని కనిపిస్తాయి. ఆయన సెల్యులాయిడ్‌తో కవిత్వం చెప్పగలడు. బెంగాలులో పేదరికం కానివ్వండి, ప్రేమ కానివ్వండి, నిరాశ కానివ్వండి, మృత్యువు కానివ్వండి, మరే వస్తువయినా కానివ్వండి — శ్రీ రాయ్ తను తీసే చిత్రంలో మునిగిపోతాడు. దర్శకత్వం, ఛాయాగ్రహణం, సంగీతం, వీటన్నిటినీ స్వయంగా చూసుకుంటాడు. ఇంతదాకా 10 సినిమాలకి అతను సంగీతం ఇచ్చాడు. మొదటి చిత్రాలలో నాలుగింటికి రవిశంకర్ సంగీతం కూర్చాడు.

శ్రీ రాయ్ సినిమాలలోని వస్తువుని పరిశీలించి చూస్తే అవి సుమారుగా రెండు రకాలవని తెలుస్తుంది. 1. 19 శతాబ్దం, 20వ శతాబ్దం ప్రారంభం — వీటికి సంబంధించిన కథా వస్తువు కలవి; 2. సమకాలీన జీవితానికి సంబంధించిన కథా వస్తువు కలవి.

మొదటి తెగకి చెందిన సినిమా కోసం శ్రీ రాయ్ రవీంద్రనాథ్ టాగూర్, విభూతి భూషణ్ బెనర్జీవంటి పెద్ద రచయితల కథలని వాడుకున్నాడు. 'గోపీ గైనె, బాఘబైనె' (లేక పాటల గోపీ, మద్దెల బాఘ) అనే చిన్నపిల్లల కాల్పనిక చిత్రానికి అతను తన తాత 1920 ప్రాంతంలో రాసిన కథని వాడుకున్నాడు.


'మహానగర్', 'నాయక్' అనే చిత్రాల కథలని మాత్రం తనే రాసుకున్నాడు.

* * *

సత్యజిత్‌రాయ్ సినిమాలు చూస్తే నాకొకటి అనిపిస్తుంది. ఆయన సృష్టించే మనుష్యులందరూ మంచివారు, కరుణ ఉట్టిపడేవారు, స్నేహశీలురు — కాని వారందరూ దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఉంటారు. బెర్నార్డ్‌షా సృష్టించిన పాత్రలకి పేదరికం అంటే అసహ్యం. శ్రీ రాయ్ పాత్రల సంగతి వేరు; వారు దారిద్ర్యాన్ని సహిస్తారు, మౌనంగా బాధపడతారు, అనాథలుగా మరణిస్తారు.

'అపూ' కథలని తీసుకోండి. అపూ తల్లిదండ్రులు, అవ్వ, తోబుట్టువు — వీరందరూ నిరాశకి బలి కావలసినవారే కాని ఎవరితోనూ మొరపెట్టుకోరు, తమ బాధలని నిస్సహాయంగా భరిస్తారు. మనకి వారిమీద జాలి కలుగుతుంది, వారిని చూస్తే ఏడుపు వస్తుంది, వారంటే వాత్సల్యం పుట్టుకొస్తుంది.

'పరాశ్ పథర్'లోని మధ్యవయస్కుడయిన బాంకు గుమాస్తాకి 'స్పర్శవేది' దొరుకుతుంది. అతనికి దారిద్ర్యం అంటే ఇష్టం అని కాదు కాని రాయిని వాడి బంగారు చెయ్యటానికి అతని మనస్సు ఒప్పదు. అతనికి నిజాయితీ ఎక్కువ. చివరికి ఆశకి లొంగిపోయినప్పుడు తన సంపదని నిలుపుకోలేక పోతాడు. ఎన్నో తిప్పలుపడి జైలులోకి కూడా వెడతాడు.



ఆఖరుకి ఆ రాయిని ఎవరో మింగి అది కరిగిపోయినప్పుడు కాని అతనికి శాంతి లభించదు.

'జల్సాఘర్' (సంగీత మందిరం) అనే అనువాదం చెయ్యవచ్చు) చిత్రం నాయకుడు వయస్సు మళ్ళుతున్న ఒక మాజీ పెద్ద మనిషి. అతని ఆస్తి అంతా వరదల్లో కొట్టుకుపోతోంది. భార్య, బిడ్డ మునిగిపోతారు. తను ఒక పనిమనిషితో మాత్రం మిగులుతాడు. అతని గుర్రం, ఏనుగ— వీటికి తిండి ఉండదు. కాని, అతనికి విస్కీ కావాలి, సంగీతం కావాలి. అంతా తన పాడుబడిపోతున్న సంగీత మందిరంలోనే ... కాలంతోబాటు మారటానికి ఒప్పుకోని ఇతను చివరికి గుర్రపు స్వారీ చేస్తూ చనిపోతాడు కాని తన ఠీవిని పోగొట్టుకోడు.

'అభిజన్' లోని టాక్సీ డ్రయివరుని తీసుకోండి. అతను పేదవాడు. కాని ఎంతో ఆత్మాభిమానం కలవాడు. ఎంత దూరం కారు నడిపినా, తిరిగి ఇంటికి వచ్చేప్పటికి ఎంతగా ఆలస్యం అయినా, ఎంత అలసటగా ఉన్నా, ఎంత తాగి మత్తుగా ఉన్నా—తన పరిస్థితి మెరుగు పరుచుకొనటానికి ప్రయత్నిస్తాడు. అంత రాత్రిపూటా ఇంగ్లీషు చదువుకుంటాడు. అయితే, అనుకోకుండా ఒక మోసగాడి వలలో పడ్తాడు. పడటం పడినా వకాలంలో తన పొరబాటు తెలుసుకుని మోసగాడి బారినుంచి తప్పించుకుని తన పాత వృత్తిలోకి వెడతాడు. అతని బాధలు తగ్గవు. కొత్త భార్య అందకత్తె (వహీదారెహమాన్: ఆమె వేసిన బెంగాలీ చిత్రం ఇదొక్కటే) తగిన పోషణ కావాలి. కాని, అతను లెక్కపెట్టడు. అతనికి డబ్బుకన్నా నిజాయితీయే ముఖ్యం.

శ్రీ రాయ్ సృష్టించే పేదవారిపట్ల మనకి జాలి కలుగుతుంది. వారి నిజాయితీ మనల్ని కదిల్చివేస్తుంది. వారిపట్ల మనకి సానుభూతి కలుగుతుంది. అంతే...

నాకు శ్రీరాయ్అంటే ఎంతోఅభిమానం. నాకు అతని సినిమాలన్నీ చూడగలిగానని గర్వంగా ఉంది. మొన్న ఢిల్లీలో చూపించిన అంతర్జాతీయ చలన చిత్రాలన్నిటికన్నా వీటిని చూస్తేనే బాగా ఉంది నాకు. పేదవాళ్ళనిగురించి ఇన్నిసినిమాలని అతను తీశాడని నాకు సంతోషంగా ఉంది. కాని— ఎందుకో నాకు తెలియ దనుకోండి. శ్రీ రాయ్చేతుల్లో దారిద్ర్యాని కొకరకమయిన 'గ్లామర్', అర్థం లేని వింత వస్తుంది. ఇందుకేనేమో, శ్రీ రాయ్



'అరణ్యేర్ దిన్ రాత్రి'లో శౌమిత్ర్, సమిత్ భాంజా.

సత్యజిత్ రాయ్...

తేన్నాయితే సాధించటానికి ప్రయత్నిస్తా న్నాడనిపిస్తుందో అదే — భారతదేశాన్ని పీడించే 'సంబర్పన్' సమస్య — అది సాధించలేకపోతున్నాడనిపిస్తుంది. వీందు చేతనంటే అతని సినిమాలని చూసిన తర్వాత మనం పేదరికాన్ని ద్వేషించటముకటా ప్రేమించటం మొదలుపెడ్తాము. ఇది ఎవరి తప్పు? పేదరికాన్ని అంత అందంగా చిత్రించి దానికొక కాల్పనిక గుణాన్ని ప్రసాదించినందుకు శ్రీ రాయ్ తప్పా? లేక మన తప్పేనా?

సంఘం వారికి చేస్తున్న అన్యాయాలకి బీదవారు ఎదురు తిరగనక్కరలేదా? తన యజమానిని ఎదిరించే బీద మనిషిని ఒక్కరినయినా శ్రీ రాయ్ తన సినిమాలలో చూపించడెందుకు? బీదవారు ఎల్ల కాలం ఇలాగ నిస్సహాయంగా యాతనలు పడవలసిందేనా? శ్రీ రాయ్ చిత్రాలలో ఇదొక పెద్ద లోపం అని నా అభిప్రాయం— అంతా విధి వ్రాత అని వదిలి వెయ్యడం. అయితే కథా వస్తువుని వాడటంలో, పాత్రలని చిత్రించటంలో, ఇంపయిన సంగీతాన్ని కూర్చటంలో, ఉత్తమమైన ఛాయాగ్రహణాన్ని సాధించటంలో వీటిలో ఈ లోపం మునిగిపోతుంది. అసలు ఫోటోగ్రఫీ, సత్యజిత్ రాయ్ చిత్రాలు అవినాభావ సంబంధం కలవి.

'దరిద్ర—చిత్రాల' తర్వాత శ్రీ రాయ్ తన ధ్యేయం గురించి అంతగా పట్టించుకున్నట్లు కనిపించదు. 'అభిజన్' ముందు మూఢనమ్మకాలని ఖండిస్తూ 'దేవి' అనే చిత్రం తీశాడు. టాగూరు శతజయంతి ఉత్సవం (1961) కోసం రెండు సినిమాలు తీసి 'కాంచన గంగ' అనే సినిమాలో మధ్యతరగతి సమస్యలని ప్రధాన వస్తువుగా తీసుకున్నాడు.


భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చెయ్యటం మంచిదా కాదా? ఈ ప్రశ్న 'మహానగర్' చిత్రం కథా వస్తువు. ఒక బాంకు ఉద్యోగి భార్య 'సేల్స్‌గర్ల్' ఉద్యోగం మొదలు పెట్టటం వల్ల వారి సంసారం ఏ విధంగా తల్లడిల్లిపోతుందో 'మహానగర్' చెప్తుంది. ఈ చిత్రంలో భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు పోగొట్టుకుంటారు కాని వారి జీవితాలలో అసంతృప్తి, అయోమయం తగ్గి ఇద్దరూ భవిష్యత్తుని నమ్మకంతో ఎదురు చూస్తారు. ఇదంతా బాగానే ఉంది కాని అసలు ప్రశ్నకి శ్రీ రాయ్ సమాధానం ఏమిటి? భార్య ఉద్యోగం చెయ్యవచ్చునా లేదా? శ్రీ రాయ్ సమాధానం ఏమిటి? ఏమో!

ఒక పత్రికా విలేఖరులు సమావేశంలో సత్యజిత్‌రాయ్ ఈ విధంగా సమాధానం చెప్పాడు—'ఈ సమస్యలకి పరిష్కారాలు ఏమిటో నాకు తెలీదు. అవి ముఖ్యమయిన ప్రశ్నలు కాబట్టి వాటిని గురించి సినిమాలు తీస్తాను. కాని పరిష్కారాలు ఏమిటో నాకు నిజంగా తెలీదు.'

ఇది చాలా ముఖ్యమయిన విషయం అని నేను అనుకుంటాను. ఒక పెద్ద కళాకారుని ప్రతిభ రాణించాలంటే అతను 'వర్ణించే' సమస్యలకి సమాధానం ఏమిటో అతను సూచించాలి, అనుకుంటాను.

'కాపురుష్—ఓ—మహాపురుష్' చిత్రంలో శ్రీ రాయ్ పిరికివాళ్లని వెక్కిరించటమే కాక దొంగ సన్యాసుల గుట్టుని బయట పెట్టటానికి ప్రయత్నిస్తాడు. ధ్యేయం లేని జీవితం కలవారికి విజయం వచ్చి కూడా లాభం లేదని 'నాయక్' సినిమా సూచిస్తుంది.

'చారులత' టాగూరు నవల ఆధారంగా



ఉంది. భర్త అశ్రద్ధ చేస్తే భార్యమానసిక స్థితి ఏవిధంగా పరిణామాలు చెందుతుందో సత్యజిత్‌రాయ్ ఈ చిత్రంలో చూపిస్తాడు.

సత్యజిత్‌రాయ్ సినిమాలన్నీ చక్కగా ఉంటాయి. వాటి సందేశం ఏమిటో మాత్రం అర్థం కాదు. అతన్ని గురించి నా ఫిర్యాదు ఇదే.

'అరణ్యేర్ దిన్ రాత్రి' మాత్రం సత్యజిత్‌రాయ్ ధోరణి మారుతున్నదనే ఆశ కలిగిస్తుంది. ఈ సినిమా నేడు భారత దేశంలో అందరినీ పీడించే సమస్యకి సంబంధించినది — యువతరం వారిని గురించిన సినిమా ఇది. (అతని తర్వాతి చిత్రం కూడా ఇటువంటిదేనని తెలుసుకుంటాము. అది కలకత్తాలో నిరుద్యోగ సమస్యకి సంబంధించినదిట.) కలకత్తాలో ఉండే ముగ్గురు యువకులు బీహారు అడవులలో వేటకి వెళ్లి ఎన్నోరకాలుగా ఆడవారితో చిక్కుకుని చివరికి తాము ఉండే పెద్ద నగరానికి తిరిగి వచ్చేసి తమ యాంత్రికమయిన దైనందిన జీవితంలో మళ్లీ మునిగిపోతారు...

ఒక పాట పాడేవాడు, డోలు వాయించేవాడు ఉంటారు. ఇద్దరికీ పెద్ద 'కళాకారులు' కావాలని ఆశ. వారి సంగీతం అంత బాగా లేకపోవటంచేత రాజాగారు వారిని ఊరినుంచి తరిమించి వేయిస్తాడు. కాని, వారి సంగీతం భూతాలకి నచ్చుతుంది. ఒక భూతం వారికి తిండీ, గుడ్డా మాత్రమే కాక మంత్రించిన చెప్పులు కూడా ఇప్పిస్తుంది. ఇద్దరూ ఇద్దరు రాజుల మధ్య యుద్ధం జరగకుండా చూస్తారు, చివరికి వారి కూతుర్లని ఇద్దరినీ పెళ్లి చేసుకుంటారు. ఇది 'గూపీ గైనె బాఘా బైనె' చిత్రం కథ. దీనిని గురించి కొంత ముందే చెప్పాను. ఇది రాష్ట్రపతి ఎవార్డుని పొందిన చిత్రం.

సత్యజిత్‌రాయ్ తీసిన సినిమాలన్నిటికీ ఇంచుమించు ఒకే జట్టు సాంకేతిక నిపుణులని వాడుతూ వచ్చాడు. ఇది అతనికి సహాయపడి ఉండాలి.

వేషాలు వేసే వారిని అతిజాగ్రత్తలో ఎన్నుకుంటాడుకూడా శ్రీ రాయ్. (శర్మిళా టాకూర్, సౌమిత్రాఛటర్జీ, అపర్ణా

సేన్ —వీరందరూ అతనువెయికి తీసుకు వచ్చినవారే.)

'నేనెవరి ఆజ్ఞనీ శిరసావహించ పూనుకోలేదు, నా భావాలనే ఇతరులమీద రుద్ద గలిగాను. అందుకనే, నేను తీసిన చిత్రాలలోని మంచి చెడులకి రెండిటికీ బాధ్యత నాదే అనగలను,' అంటాడు శ్రీ రాయ్. చెడుకన్నా మంచే అధికం కాబట్టి పెద్ద చిక్కు లేదు.

'శైలి'ని తరచు మారుస్తాడనే ఆరోపణకి అతను ఈవిధంగా సమాధానం చెప్తాడు — ''దర్శకుడు గొప్పవాడయితే ఒకేరకం శైలిని ఏకాగ్రతతో అనుసరించటం గొప్ప అనుకుంటారేమో వారు (విమర్శకులు) అనిపిస్తుంది. మనదేశంలో చలనచిత్రం చరిత్ర దీర్ఘమయినదే అయినప్పటికీ, భారతదేశాన్ని సాహిత్య సాధనం ద్వారా పరిశీలించటం అనేది తగినంతగా జరగ లేదు— సాంఘికంగా, చారిత్రికంగా, విస్తృతంగా కూడా. అందుకనే, ఈ గొప్ప సదవకాశాన్ని వినియోగించుకొని దర్శకుడుకి సరయిన దృష్టి, సృష్టించాలనే కౌతుకం లేవు, అనవలసి వస్తుంది.' బొంబాయి, మద్రాసులలో ఉండే సినీ—చక్రవర్తులు దీనినేమంటారు!

ఇన్ని చిత్రాలు తీసినందుకు సత్యజిత్ రాయ్‌కి విసుగు పుడ్తుందా? లేదు—ఇంకా ఎన్నో తియ్యాలని ఉంది.

మన దేశంలో కోట్లమంది జనానికి రాయ్ సినిమాలు చూసే అవకాశం లేకపోవటం దురదృష్టమే. ఎందుకు డబ్ చెయ్యరు, అని అతనిని అడిగాను.

'నాకిష్టం లేదు.' అన్నాడు శ్రీ రాయ్. 'డబ్ చేస్తే భాషలోని సున్నితమయిన అర్థాలు కొన్ని నాశనం అవుతాయి. ఇంగ్లీషుతో స్థూలమయిన అనువాదాలు చేసి తెరమీద కనిపించేలాగ చెయ్యటమే మంచిది, అనిపిస్తుంది నాకు.' భారతదేశంలో ఇంగ్లీషు ఎందరికి వచ్చు?

'హిందీలో సినిమాలు తీస్తారా?' తీస్తే తియ్యవచ్చుకూడా. ఎప్పుడోసారి హిందీ సినిమాలు తియ్యకపోను. మృణాల్ సేన్ లాగే,' (శ్రీ సేన్ తీసిన 'భువన్ షోమ్' ఇక్కడ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో చూపించారు, బాగా పోయింది.)

ఇంగ్లీషురాకనో, ఇంగ్లీషు అనువాదాలులేకనో సత్యజిత్‌రాయ్ సినిమాలనిచూసే అవకాశం లేనివారికి ఇది శుభవార్త. అతను త్వరలో హిందీసినిమాలు తీస్తాడని ఆశించాలి. సత్యజిత్‌రాయ్ చిత్రాలని చూసేదాకా వాటి గొప్పదనం తెలుసుకొనటం కష్టం.

—తిరుమల్ల వెంకటనారాయణ ●



'గూపీ గైనె బాఘా బైనె'లో రాబీఘోష్, సంతోష్‌దత్, తరుణ్ ఛటర్జీ.

ఒక వారం విపరీతం

ఫాలాక్షుడు

విషం తాగి ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులు

వమ్మనపుత్తూరులో 17 ఏళ్ళ నాగమ్మ అనే అమ్మాయి రంగనాథన్ అనే దర్జీవానిని ప్రేమించిందట. ఈ విషయం తెలిసిన ఆమె తలిదండ్రులు టట్ వీల్లేదు అని, కృష్ణగిరి తాలూకా నక్కలపట్టి గ్రామవాసి అయిన రాజామణి అనే అతనితో నాగమ్మ వివాహం జరిపించేశారట. పెళ్ళయ్యాక అంతా వమ్మన పుత్తూరు తరలి వచ్చారట. పెళ్ళయిన మూడో నాడు శోభనం నాటి రాత్రి నాగమ్మ భర్తతో పోట్లాడిందట. దాంతో విసుగెత్తిన రాజామణి ఏం చెయ్యాలో తోచక నిద్రపోయాడట. నాగమ్మ అర్ధరాత్రికి రాత్రే బయలుదేరి రంగనాథన్ యింటికి వెళ్ళిపోయిందట. అక్కడ వారిరువురూ పాలిటాల్ అనే విషంతాగి, ఒకే మంచం మీద పడుకుని, చనిపోయారట. 'మా చావుకు ఎవరూ కారణం కాదు. మేమిద్దరం మనసారా ప్రేమించుకున్నాము. మా ప్రేమను అయినవాళ్ళు అంగీకరించలేదు. అందుకు విషం తిని మరీ చనిపోతున్నాము' అని పక్కనే ఓ ఉత్తరం రాసి పెట్టి మరీ చనిపోయారట.


* * *

తన ఏణ్ణర్థం కొడుకును పక్కన కూర్చోపెట్టుకుని 18 ఏళ్ళ సాళమ్మ అనే ఆమె నూతి గట్టున బట్టలు వుతుక్కుంటోందట. ఆడుకుంటున్న కొడుకు గభిల్లున నూతిలో పడిపోయాడట. వెంటనే సాళమ్మాల్ కెవ్వున కేకవేసి, తనూ నూతిలో దూకేసిందట. ఈ దృశ్యం చూసిన చుట్టుపక్కలవాళ్ళు నూతిలో దిగి వారిద్దర్నీ బయటకు తీశారట. కాని ఆలోగానే తల్లీ కొడుకూ చనిపోయారట. ఇది కోతిగుడ్ల పల్లెలో జరిగింది.

మామగారికి విషం పెట్టిన కోడలు

వేడందవాడి అనే గ్రామంలో 60 ఏళ్ళ అయ్యాకణ్ణుగవుండర్ అనే అతనికి అతని కోడలు విరుద్ధాంబ కూ ఒక్కక్షణం పడేది కాదుట. అతని కొడుకు నారాయణస్వామికూడా భార్యపక్షాన చేరి తండ్రితో పోట్లాడేవాడుట. రానురానూ యీరగడు ఎక్కువై విరుద్ధాంబ మామగారికి అన్నం వండిపెట్టడం మానేసిందట. అయ్యాకణ్ణు తనవంట తనే వండుకునే వాడట. ఒనాటి వుదయం లేచి, కాలకృత్యాలు తీర్చుకుని రాత్రి వండుకున్న అన్నం తిన్నాడట. అన్నం ఏదో మాదిరిగా వుండడంవల్ల కాస్త కాకులకు వేశాడట. ఆ అన్నంతిన్న ఐదు కాకులు గిర్రున తిరిగి చచ్చివూరుకున్నాయట. మరి కాస్సేపటికి అయ్యాకణ్ణు కూడా కుప్పగా కూలి చనిపోయాడట. ఆయన తిన్న అన్నంలో విషం కలిపిన నేరానికి ఆయనకోడలు విరుద్ధాంబను కొడుకు నారాయణస్వామిని పోలీసు అరెస్టు చేసింది.

* * *



ఆత్మాభిమానం ప్రాణత్యాగం

ఆత్మాభిమానం చచ్చిపోయాక, మనిషి బ్రతికేందుకు అనుకునే వాళ్ళు కొందరుంటారు. తన భర్త జోసఫ్ తనను కొట్టినందుకు జపమాల అనే 27 ఏళ్ళ అమ్మాయి వురిపోసుకుని, నిండు ప్రాణాన్ని పుటుక్కున తీసేసుకుందిట. ఇది మేల్ పుదుప్పాకమ్‌లో జరిగింది.

కేళకొడుంగలూరు అనే వూళ్లో అణ్ణామలై అనే అతని భార్య తన భర్త పోరు పడలేక మీద కిరసనాయిలు పోసుకుని నిప్పంటించుకుందట. కానీ విధి వక్రించి, చావుతప్పి వందివాసి ఆసుపత్రిలో చికిత్స పొందుతోందట. చికిత్స పూర్తయ్యాక ఆత్మహత్య నేరం క్రింద ఆమెమీద కేసుపెట్ట



డానికి పోలీసు సిద్ధంగా వుంది. పెట్టరా మరి! టెన్‌దైర్యాటీ! యా!

పబ్లిసిటీ ప్రేమ

నటి జీనాలోలాబ్రిగడా ప్రఖ్యాత గుండెమార్పిడి డాక్టరు క్రిస్టియన్ బెర్నార్డ్‌ను చెప్పుచ్చుకొక్కొడ్తానందట. ఆయన్నే గాక, ఆయన మొదటి భార్యను కూడా చెప్పు తీసుకుని కొడ్తానందట. రెండేళ్ళక్రితం తను డాక్టర్ ప్రేమలో పడినట్లు, ఆనక 'ఆయన ప్రేమ సరియైనది కాదని, కేవలం మోహాన్నీ కోసం ప్రేమిస్తున్నాడనీ, ఆయనకు కావలసినది యీరకమైన పబ్లిసిటీయేననీ' తను గ్రహించాననీ చెప్పి, ఆ సందర్భంలో తనురాసిన ప్రేమలేఖలను ఆయనిప్పుడు కొన్ని పత్రికల్లో ప్రచురించి తన మర్యాదకు భంగం కలగజేస్తున్నాడని, కనుక తను చెప్పుతో కొట్టాననీ ప్రకటించిందట— దిస్ఫ్లీజ్ ంహాఇ పబ్లిసిటీ..........

* * *

ఆవేశంలో కొడుకుని హత్యచేసిన తండ్రి

'మరుగు దొడ్డిలో నీళ్ళు పోయకుండా వస్తావేం? ఎన్నిసార్లు చెప్పాలి నీకు' అని ధన్వంత్‌సింగ్ అనే అతను తనతండ్రి చరణసింగ్‌ని నిలదీశాడట. దాంతో తండ్రి ఆత్మాభిమానం దెబ్బతిని పర్రున కత్తితీసి కొడుకును పొడిచి చంపేశాడట. అప్పుడు కాలం అంత చిన్నదే! యస్సార్ ..... ఇది ఢిల్లీలో జరిగింది.

అతిచదువు అనర్థాలు


అయినవాళ్ళూ ఎగనేస్తాం. అనకేమో దిగనేస్తాం అనే ఆచారం విద్యార్థి లోకంలో అనాదిగా వస్తోంది. అన్నిరోజులూ అశ్రద్ధ చేసి, పరీక్షల ముందు టీలు త్రాగి, మాత్రలు వేసుకుని పూహా రాత్రి పగలూ చదువుతారు విద్యార్థులు. ఢిల్లీలో ఐ. ఐ. టి. కాలేజి విద్యార్థి రాదేష్యాం అనే అతను తనరూములో చనిపోయి వున్నాడట. పోస్



ట్మార్టమ్ వల్ల అతను సెరిబ్రల్ (మెదడుకు సంబంధించిన) హెమరేజితో చనిపోయాడని ఇది, నిర్విరామంగా మెదడుకు అధిక శ్రమ యివ్వడమే కారణమని తేలిందట.

* * *

ఆర్కాటు పంచాయతీ యూనియన్‌లో వ్యవసాయశాఖకు మేస్త్రీగా పని చేస్తున్న వ్యయ్యా ఫరి అనే 27 ఏళ్ళ యువకుడు కణ్ణప్ప అనే అతని పొలంలో మందు చల్లి (పురుగులు, పీడా చావడానికి) ఆనకోస్తానుడు చెరకు రసం త్రాగి ఆఫీసుకువచ్చి పడుకున్నాడట. మధ్య రాత్రిలో లేచి ఒక వాంతి చేసుకున్నాడట. తెల్లారినా లేవనిఅతని పరిస్థితిచూసి ఆసుపత్రిలో చేరిస్తే అక్కడ చనిపోయాడట [illegible].



ఎ(సె)క్స్‌రే చిత్రకారుడు

లివర్‌పూల్‌లో వో ఎగ్జిబిషన్‌లో బర్కెన్ అనే చిత్రకారుడు తను వేసిన వో నగ్నసుందరి చిత్రాన్ని విపరీతమైన ధరకు అమ్మజూపుతున్నాడట. జనం కూడా ఆ బొమ్మ అందానికి వెర్రెత్తిపోతున్నారట. ఆసమయంలో 25 ఏళ్ళ మిస్ సరిటా అనే ఆమె. రివ్వున వచ్చి బర్కెన్ చొక్కా పుచ్చుకుని సాచి ఓ లెంపకాయ కొట్టిందట. ఆ నగ్నచిత్రం ఆమెదట. కుటుంబస్త్రీ అయిన యీమె 'నేను నగ్నంగా యితనికిగాని, మరెవ్వరికీ [బయటవారికే] గాని పోజ యివ్వనేలేదు. అందట. ఆర్టిస్టు బర్కెన్ తల వెళ్ళాడేసి 'యస్. కానీ, ఆమె అందమైన ఒంపు సొంపులను చూసి, ఆమె ఫోటో సహాయంతో నా నేర్పరితనంతో నగ్నంగా చిత్రించాను' అన్నాడట


—ఆహా: హి యీజ్ యాన్ ఎక్స్‌రే ఆర్టిస్ట్:

గడ్డితిని జీవిస్తున్న జైసాల్‌మర్ జిల్లా ప్రజలు

రాజస్థాన్‌లోని జైసాల్‌మర్‌జిల్లాలో ప్రజ తినడానికి ఆహారంగాని, తినే మరి ఏ యితర వస్తువులు గాని లేక, కేవలం గడ్డి తింటున్నారనీ, యిది జోకు కాదనీ, అలా గడ్డి తింటున్న వారికి తీసిన ఫోటో కాపీలను చూపి, స్వతంత్ర అభ్యర్థి ధారిసింగ్ సోధా అన్నారట.


* * *

11 ఏళ్ళ మాల్కా అనే ఆమె పోయిన అక్టోబరు నెలలో దుర్గాపూజలు చూడడానికి అజయ్ కుమార్ అనే చుట్టం యింటికి వెళ్ళిందట. అతనికి భార్యా ఏడునెలల కూతురు వున్నారట. ఇంటికి వచ్చిన ఆమెను అజయ్ రహస్యంగా కలుసుకునే వాడట. దుర్గాపూజలయి యింటికి వెళ్ళిన నాలుగు నెలలకు మాల్కా గర్భవతి అయ్యిందట. దాంతో ఆమె తల్లి నెత్తీనోరూ బాదుకుని తమ కుటుంబడాక్టరు ఆర్. కె. దేకాతో యీ విషయమంతా చెప్పి సహాయాన్ని కోరిందట. డాక్టరు గారు మొన్న మార్చి పదో తేదీన ఆమెకు ఓ స్ప్రికాప్సూల్స్ యిచ్చి, ఇంజక్షన్ చేశాడట. రాత్రంతా మాల్కా బాధపడిందట. రాత్రింతా ఆమెకు రక్తం కారుతూనే వుందట. దాంతో ఆమె స్పృహ కోల్పోయిందట. పళ్ళు గట్టి కరుచుకుపోతుంటే ఒక చెమ్చాతో ఆమె దవడలను విడదీయడానికి ప్రయత్నం చేసరికి ఆచెమ్చా విరిగి ఆమె నోట్లో వుండి పోయిందట. 11వ తేది సాయంత్రం ఆమెను సఫ్దర్‌గంజ్ ఆసుపత్రికి తీసుకు వెళ్ళేసరికి ఆమె చనిపోయిందట. ఇది ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంలో నిర్లక్ష్యంగా వైద్యం చేసిన నేరానికి ఆ డాక్టరుగారిని మాల్కాను చెరచిన అజయ్‌ను చట్టం అరెస్టు చేసిందట.



పరమాన్నంలో పాము విషం పడిన కథ

(క్షేమేంద్రుని బృహత్కథామంజరి కథలు)



అనువాదం: తిరుమల రామచంద్ర

భయంకరుడయిన బేతాళుడు మళ్ళీ కథ మొదలు పెట్టాడు: 'రాజా ఒక కథ చెబుతాను విను. దానిలో నాకొక సంశయం వుంది.'

వారణాసిలో శివస్వామి అనే బ్రాహ్మడుండేవాడు. అష్టైశ్వర్యాలలో తుల తూగే అతనికి హరిస్వామి అనే కుమారుడుండేవాడు. అతని భార్యపేరు లావణ్యవతి. ఆమె మనస్సౌందర్యశాలిని. త్రిలోకాలలోను వున్న లలనలకే అలంకారం వంటి లలితాకృతి గలది ఆమె.

హరిస్వామి ఒకమారు కాంతి నదివంటి తన ప్రియురాలితోపాటు సౌధోపరితలంలో కేళి మందిరంలో శయనించాడు; మన్మథోత్సవంతో ఇద్దరూ అలసిపోయారు. ఆమె అలసిసొలసి శయ్యమీద పడుకుంది.

అప్పుడొక నభశ్చరుడు మదనవేగుడనే వాడు, ఎక్కడికో ఆ దారిని ఆకాశ మార్గాన వెళుతూ, ఆమెను చూశాడు. ఆమె శరీరంమీది వస్త్రాలూ తొలగి వున్నాయి. ఏనుగు దంతంలాగ తెల్లగా, మెరిసిపోయే పాలిండ్లు, జఘన భాగం కనిపించాయి. మన్మథునికి గురిఅయ్యాడు. ఆ ఆయతేక్షణను ఎవరికీ కనిపించకుండా ఎత్తుకొని పోయాడు. ఆమె ఆ అనాహతానికి అదరిపడి పోయింది. ఆమెఅంగాలు భయంతో కంపించసాగాయి. వాడు మనో వేగంతో ఎత్తుకొని పోయాడు.

హరిస్వామికి ఉదయం మెలకువ వచ్చింది. ప్రియురాలు పక్కమీద లేదు. ఎక్కడా లేదు. చాల దుఃఖపడ్డాడు. విషం తల కెక్కినట్టుగా వియోగం తలకెక్కి మూర్ఛపోయాడు. 'హా! సుందరి, అమృతానికి ఆటపట్టు, కోపంతోను చిరునవ్వు నవ్వుతూ చంద్రునివలె ఆనంద బంధువయిన నీముఖం ఎలా చూస్తాను?' అంటూ ప్రలపిస్తూ, పిచ్చివాడిలాగ అయి పోయాడు. వియోగ వేదనతో వూరంతా తిరిగాడు. మిత్రులు, బంధువులు అతని దురవస్థకు శోకించారు. ఇలా అతడు ఉన్మత్తుడై కృష్ణపక్ష చంద్రునిలాగ నాడు నాటికి చిక్కిపోతూ, దేహేశ్వరుడు దేహాన్ని వదలి వెళ్ళిపోయినట్టు ఆ నగరం వదలి వెళ్ళిపోయాడు.

వియోగం మనస్సులో వ్యాపించినవారికి భోగం రోగమవుతుంది, ఇల్లు విషమవుతుంది. బంధువులు నానా బంధంలాగ కనిపిస్తారు. జగత్తు కాలిన అడవి అవుతుంది.

అతడు ఎండకు మాడిపోతూ, ఎవరో లాక్కుపోయినట్టు వూరూరా తిరుగుతూ, దుమ్ము కొట్టుకుని, ఆకలితో సకల తీర్థాలూ దర్శించాడు.

ఇలా వెళ్ళుతూ, పద్మనాభుడనే బ్రాహ్మణుడు పెట్టిన అన్నసత్రం చేరాడు. అక్కడ ఆ సత్రం యజమాని భార్య అతనికి పరమాన్నం పెట్టింది. దానిని తీసుకొని ఒక కమల పుష్కరిణి తీరంలో ఒక మర్రిచెట్టుకింద కూర్చు

న్నాడు. ఆకలిలో అతనికి పగలు, రాత్రి, దిక్కు కనిపించలేదు.

ఇలా వుండగా ఒక డేగ ఒక నాగుబామును కాళ్లతో పట్టుకొని ఆకాశంలో ఎగురుతూ వుంది. మూర్ఛపోయిన ఆ పాము నోటినుంచి, విషంతో నల్లనైన ఎంగిలి నురగ కిందవున్న పరమాన్నంలో పడింది. హరిస్వామికి ఈ సంగతి తెలియక, పరమాన్నం భుజించాడు. మరణించాడు విధి విపరీతమయినప్పుడు, అంతా విపరీతమవుతుంది.

అతని మరణ వార్త విని సత్రాధిపతి తన భార్యను తిట్టాడు; ఇంటి నుంచి వెళ్లగొట్టాడు.

బేతాళుడు ఈ కథ చెప్పి, 'రాజా, ఈ బ్రహ్మ హత్య ఎవరికి అంటుకుందో చెప్పు' అన్నాడు.

రాజా ఇలా అన్నాడు ... 'పాము పరతంత్రం, డేగ కాళ్లలో చిక్కుకున్నట్టిది. డేగ పీడకు గురి అయినట్టిది. అందువల్ల అది విషం కక్కింది. దానిలో దాని అపరాధం ఏముంది? డేగకు పాము దైవనిర్మితమయిన ఆహారం. కనుక దానిని తినడానికి అది పూనుకొన్నది. ఆకలిగొన్న వాడికి వివేకం వుండదు. కనుక వాడు పాపి కాడు. అన్నదానం చేసే సత్ర యజమానికి, అతని భార్యకు పాపం అంటదు. విషం పడిందని తెలిసి కూడా ఆకలిగొన్న వానికి చెప్పనివాడే పాపభాజనుడు. ఇది నా అభిప్రాయం. బేతాళుడా, నీ అభిప్రాయమేమిటో నాకు తెలియదు.'

విక్రమసేనుని సమాధానం వినగానే బేతాళుడు భుజం మీద నుండి ఎగిరిపోయి, చెట్టుకొమ్మపై మళ్లీ వేలాడసాగినాడు.

విక్రమసేన వసుధాధిపతి మళ్లీ అతనిని చెట్టుమీద నుంచి దింపి, భుజం మీద వేసుకొని నడిచాడు. బేతాళుడు మళ్లీ కథ ప్రారంభించాడు:

దొంగను వలచిన కన్య కథ

రాజా, - విను. పూర్వం వీరకేతువనే రాజు అయోధ్యను ఏలేవాడు. అతడు మహదైశ్వర్యసంపన్నుడు. అదేమి ఆశ్చర్యమో, ఆయన ప్రతాపానలం ఇతర రాజుల మనస్సులో మండేది.

ఆ నగరంలో రత్నదత్తుడనే వ్యాపారి వుండేవాడు. అతనికి రత్నవతి అనే కుమార్తె వుండేది. ఆమె, మనస్సును సంతోషపెట్టే రూపలావణ్య విదిత, నవయౌవనశాలిని. ఆమెకు పురుషులంటే ద్వేషం కలిగి, వివాహమే వద్దన్నది.

ఇలా వుండగా ఆ నగరంలో దొంగల బాధ ఎక్కువయింది. జనం దొంగల బారిబడి చాల బాధపడ్డారు. రాజు వీరుడు. దొంగలను పట్టుకొందామని, జనం పట్టణంలో ఏమి చెప్పుకొంటున్నారో విందామని, నగరచేష్టితం స్వయంగా చూద్దామని ఒకనాటి రాత్రి మారువేషంతో బయలుదేరాడు.

రాజు ఇలా తిరుగుతూవుండగా దొంగ కనిపించాడు. తాడిచెట్టు ప్రమాణంలో వున్నాడు. కాలి అడుగుల అలికిడి కలుగకుండా తేలికగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు. అడపాదడపా పక్కలు చూస్తున్నాడు. ఒకొకసారి నెమ్మదిగా ఊపిరి విడుస్తున్నాడు. ఒకచోట పంకర తిరిగి వంగి చూస్తున్నాడు. క్షయరోగంలాగ ఆశతో నిండినట్టు, దావాగ్నిలాగ దుస్సహుడుగాను, వియోగిలాగ నిట్టూర్పులు నిగుడిస్తూ, కల్పాంతంలాగ కాల్చివేసేట్టు కనపడుతూ, సర్వస్వం హరించడానికి రాత్రిళ్లు తిరుగుతూ, సంబంధాలు విడదీయడంలో మొనగాడు, దుర్జనునిలాగ ప్రచ్ఛన్నుడు అయిన దొంగ దగ్గరికి వచ్చాడు.


వీరకేతువు ఆ విశ్వాస ఘాతకునితో నెమ్మదిగా, 'మిత్రమా, ఎవరు నీవు? వెంట ఎవరూ లేకుండా ఈ చీకటిలో తిరుగుతున్నావే?' అని అడిగాడు.

'నేను దేవీ పుత్రుణ్ని. ఇలా వున్నాను' అని దొంగ ఏదో సాకుతో సమాధానమిచ్చాడు.

'నీవు ఎవరు?' అని దొంగ రాజును ప్రశ్నించాడు. 'నేనూ దేవీ పుత్రుణ్నే' అన్నాడు రాజు.

'అయితే, రా, వెంట, గుంటలో పూడ్చిన డబ్బు నీకు ఇస్తాను.' అని దొంగ రాజును చంపివేద్దామనే తలంపుతో తన యింటికి పిలుచుకొని వెళ్లాడు. ఇద్దరూ ఇల్లు చేరారు. చోరుడు రాజును వెలుపల వుండమని ఇంట్లో ప్రవేశించాడు.

ఇంతలో ఆ యింటి దాసి ఎందుకో వెలుపలికి వచ్చింది. ఆమె దయావాత్సల్యం గలది. 'భద్రా, నిన్ను ఎవరు



...బృహత్కథామంజరి

మృత్యువు ముఖానికి పంపారు? వెళ్లు. ఈ దొంగ విశ్వాస ఘాతుకుడు. నిన్ను చంపడానికి పన్నాగం పన్నాడు.' అని రాజుకు నచ్చ జెప్పింది.

రాజు ఆమె మాటలు విని, ఎవ్వరికీ కనబడకుండా తన నగరం చేరుకున్నాడు.

ఉదయం త్వరగా లేచాడు నిద్రనుంచి రాజు. సేనాపతితో పాటు అతని యింటిపై దాడి చేశాడు. దుర్జయుడయిన ఆ దొంగతో పోరాడి పట్టుకున్నాడు.

రాజభటులు అతనిని కారాగారంలో వేయడానికి లాక్కుపోయారు. రక్త సిక్త గాత్రుడయిన అతన్ని పూరి జనమంతా విరగబడి చూచారు. ఆ వణిక్పుత్రి రత్నవతికూడా చూచింది. ఆ దొంగను చూడగానే ఆమెకు అనురాగం ఏర్పడింది.

తండ్రిని పిలిచి, 'నాన్నా ఈ వీరుడంటే నాకు ఎంతో గౌరవం. ఇతనిని నేను వరించాను.' అన్నది. అతనిని విడిపించేట్టు చేయమని పదే పదే తండ్రిని నిర్బంధించింది. రత్నదత్తుడు ఎట్లో రాజును దర్శించి, ఆ దొంగను విడుదల చేస్తే, అపార ధనమిస్తానని మనవి చేశాడు.

రాజు అతని మాటలకు నవ్వాడు. 'దొంగను రక్షించగోరేవాడూ దొంగే. పాప సంబంధంవల్ల పాపి అవుతాడు. ఇతనిని కూడా వధించండి, దొంగతో పాటు' అన్నాడు.

రాజు ఈ విధంగా తన తండ్రినికూడా నిర్బంధంలో పెట్టగా, రత్నవతి తనకు దొంగే భర్త అని అతనితోపాటే తను మరణించాలని నిశ్చయం చేసుకొని, శ్మశానానికి వెళ్లింది.

శ్మశానంలో ఆ దొంగను కొరత వేశారు. అకస్మాత్తుగా ధనం లభిస్తే అధమునికి ఎలా వెూరు, కళ్లు పైకి పోతాయో, అలాగే శూలంమీదవున్న దొంగ కళ్లు, ముఖం పైకి పోయాయి. ఇంకా ప్రాణం పోలేదు. రత్నవతి అతని వద్దకు వెళ్లి తన సంగతి తెలిపింది. వాడు ఆ మాటలు విని కన్నీళ్లు విడుస్తూ, నవ్వి ప్రాణాలు వదిలాడు.

రత్నవతి ఆ దొంగను శూలంమీద నుంచి దింపించి, చితిపేర్చ సహగమనానికి ఉద్యమించి, చితి ఎక్కబోతూంది. శంకరుడు, క్రీడాప్రియుడు, ఇదంతా చూచాడు, ఆమెకు అక్కడే ప్రత్యక్షమై కోరిన వరాలిచ్చాడు.

రత్నవతి తన తండ్రికి యోగ్యులయిన నూరుమంది పుత్రులు కలగాలని వరమడిగింది. తన భర్త బ్రతికి, ధనంతో, ధర్మంతో జీవితం గడపాలని వరం కోరుకుంది.

దొంగ శంకరుని వరంతో వెంటనే జీవించాడు. ప్రియురాలిని కలుసుకొన్నాడు. రాజు అతనిని తన సేనాపతిగా నియమించాడు. ఆ సుభటాగ్రణి చాల ఆనందించాడు.


ఛలముఖుడైన బేతాళుడు ఈ కథ చెప్పి, 'రాజా, దొంగ మొదట ఎందుకు యేడ్చాడు, తర్వాత ఎందుకు నవ్వాడు?' అని ప్రశ్నించాడు.

'తనను రత్నదత్తుడు అకారణ బంధువయి విడిపించడానికి పూనుకోడం, రాజు నిరాకరించడం చూచి, ఎవరి దైవ లిఖితాన్ని ఎవరు తుడిచివేయగలరు అని మొదట కన్నీరు వదలి విలపించాడు. రత్నావతి పనికి నవ్వుకున్నాడు.' అన్నాడు రాజు.

బేతాళుడు రాజు సమాధానం విని వినగానే బుజం మీది నుంచి ఎగిరిపోయి, చెట్టెక్కాడు. అచల హృదయుడయిన రాజు మళ్ళీ అతనిని దింపి ప్రయాణం కట్టాడు.

(ఇంకా వుంది)

ఏప్రిల్ ఫూల్స్


'ఏప్రిల్ ఫూల్' అనే పేరుతో రాసి పత్రిక్కి పంపిన కథ సరిగ్గా ఇవాళే తిరిగి వచ్చింది చూడు!
ఏప్రిల్ 1
మిమ్మల్ని ఫూల్ చెయడానికాదు! ఏప్రిల్ ఫస్ట్ నిజంగానే నా బర్త్‌డే! పెద్ద పార్టీ ఇస్తున్నాను రండని అందరికీ మరీమరీ చెప్పానే!
వామ్మయ్యో! ఇవాళ నేను లేచినవేళ బావుండబట్టి ఎవడో వేలి లోనా ఫూల్ కాకుండా దాటుకున్నా!
APRIL 1
నా కథకి బహుమతి వచ్చిందని పత్రిక ఆఫీసునుంచి నా ఫ్రెండు టెలిగ్రాం కొట్టాడు గదాని అందరికీ పెద్ద పార్టీ ఇచ్చొచ్చానే!
నేనప్పుడే అనుకున్నా! అసలు ఏప్రిల్ ఫస్ట్‌న ఇలాంటివి పెట్టుకుంటే ఎవడూనా నమ్ముతాడని?
మీ తెలివి తెల్లార్నట్టే వుంది! ఆ కథని ఇందాకే పోస్ట్‌మాన్ ఇచ్చివెళ్లాడు! ఇవాళ ఏప్రిల్ ఫస్ట్ అని చెప్తే వినిపించుకున్నారా?
ఇవాళ మేం వేదా వనుకున్న బెనిఫిట్ షోకి ఒక్క టిక్కెట్టైనా అమ్ముడు కాలేదండి

ప్రశ్నావళి

...కె. రామలక్ష్మి...

ఎమ్. ఆర్, పూనా

...ఎంత చెప్పినా సరే మరిచి పోతుంది. దాని తరవాత బాబు. నేనొకటి చెప్తే వాడు రెండు చెప్తాడు...ఈ పిల్లలతో సమస్య అయిపోయింది...

ఏడేళ్ళపిల్లకి చదువు అంత పెద్ద సమస్య అనుకుంటే మీరు చాలా పాతకాలం వారనుకోవాలి పూర్వము ఏడేళ్ల ఆడపిలలు ఏం చేసేవారు! హాయిగా ఆడుకునేవారు. అక్షరాలు నేర్చుకునేవారు. ఇప్పుడీ కిండర్‌గార్డెన్ నర్సరీ స్కూళ్ళు వచ్చాక మీలాంటి తల్లులు యిలా వారిని మూడో ఏడు నాలుగో క్లాసులో ఉండాలంటున్నారు! కిండర్ గార్డెన్‌లో కూడా బోగస్‌వి చాలా వున్నాయి అసలు వాళ్ళ వస్తువు లిచ్చి ఆటపాటల ద్వారా ఉత్సాహం పెంపొందించి పిల్లలను తాము చదువు కుంటున్నామని తెలియకుండానే అక్షరాలూ, రాతా వచ్చేలా చేస్తాయి కాని యీ బోగస్‌వి గ్రాంటుల కోసం పెట్టినవి, సరైన వస్తుసముదాయం కూడా లేకుండా పోజుపెట్టి యిలా పిల్లం ప్రాణాలు తోడుతాయి మీరు అనవసరంగా బెంగపడుతున్నారు బాబుని చూపి పాసని చెప్పకండి. అంతే చాలు.

జి. కె, మేడ్ చెల్

ఓ కులానికి చెందిన పెద్దమనిషి మరో కులానికి చెందిన స్త్రీని పెళ్ళాడితే కలిగే సంతానం ఏ మతానికి చెందుతుంది?

తల్లిది ఏ కులమైతే దానికే.

పి. ఏ. పి, నాగపూరు

ప్రశ్నావళి శీర్షికకు పంపేవారు కవరు మీద స్పష్టంగా ఎడ్రసు రాయాలని ప్రచురించారు కార్డు మీద రాస్తే ప్రచురించరా?

ప్రచురిస్తారు ఎటొచ్చి కార్డు మీదనైనా, కవరు మీదనైనా సరే—ఆ లేఖ ప్రశ్నావళికి అని అనుకుంటే మీరా సంగతి స్పష్టపరచాలని సంపాదకుల ఉద్దేశ్యం. ప్రశ్నావళికి అని ఉంటే ఉత్తరాల సార్టింగులకి సుఖం 'ఎడిటర్‌కి' 'ప్రశ్నావళికి' 'లేఖవాణికి' 'ఉత్తరాల శీర్షికకు' లాగ.

ఎన్. జి. కె. ఎమ్, మచిలీపట్నం

యు ఆర్ అస్పరింగ్ అవర్ కొస్చెన్స్ లైక్ స్కాలర్...లెట్‌మి నో యువర్ క్వాలిఫికేషన్స్ అండ్ ఏజ్ ప్లీజ్?

ఆడవారి వయస్సు అడగడం తప్పు కదూ, బ్రదర్! ఇక, క్వాలిఫికేషన్‌తో పనేమిటి—నా సమాధానాలు మీకు ప్లీజింగుగా ఉన్నప్పుడు?

ఎమ్. జి. ఆదోని

ఉపకారులకంటె అపకారులని, మంచి కంటె చెడుని ఎక్కువగా గుర్తుంచుకొంటారు కారణం?

ఏముంది సుఖం క్షణికం దుఃఖం శాశ్వతం అన్న రూలు అప్లయి చేయండి అన్నరు వస్తుంది.

టి. ఎమ్. ఐ, ఆదోని

గతాన్ని మరిచి పోవాలంటారు మరి రాబోయేదాన్నిపట్టి ఆలోచించ వచ్చునా?

లేకుంటే గుడ్డిగా బ్రతికేయమనా? మీ తాతలు తాగిన నేతుల వాసనలు మరిచి మన మనవలకి మనం ఎంత వెయ్యి యిస్తాం ఆలోచించమని.

వి. వి ఆర్. ఆర్, తెనాలి

సామ్యవాదులంటే ఎవరు? ఒక్కపేరు చెప్పండి

కట్టుకొన్నది యుంగవస్త్రము
పట్టుకొన్నది రాట్నచక్రము
పట్టుకుని పది మెతుకులైనా
పెట్టకుండు స్వోదరము గల

గాంధి కంటెను సామ్యవాదులు కలరె లోకములో అని నో కవిపుంగవుడు ఎంత చక్కగాచెప్పాడో వినండి

వి జి. విశాఖపట్నం

ఇంట్లో ఏ కలత రేగినా అంతా నామీద పడతారు 'నీ బ్రతుకింతే. నువ్వందుకే అవివాహితగా ఉన్నావు. నీ భవిష్యత్తు అంధకార బంధురం అవుతుంది' అని అంటారు. నేను అవివాహితగా ఉండటం నా తప్పా?

కాదు అయినా నవలల్లో లా అలా కనక ఎవరేనా అంటే తకేమని వాన్నా! మిమ్మల్నే దేవుడూ క్షమించడు నేను విలోషిని, అని మీరనాలి. అప్పుడు తరవాత సైన్ ఆలోచించవచ్చు!

ఎమ్ జె. ఆర్, పెదకొల్లివలస

లోకంలో డబ్బుతో ఏమైనా కొనుక్కోగలంగాని తల్లిని కొనలేమని నేనూ, డబ్బుతో డబ్బునే కొనలేమని నామిత్రుడనూ వాదించు కొంటున్నాం...

మంచిది పనిలేని వాళ్ళు చేసే పనేముందింక—కానివ్వండి. డబు తో తలి మాట ఏమో తెలియదు గాని— చేతనైన వాడి చేతిలో డబ్బు ఇంతింతై గా.. పెరుగుతుందన్నది మటుకు ఖచ్చితమైన నిజం,

సి. ఎమ్ ఆర్, కేరాఫ్ 99 ఏ.పి ఓ.

ఈ రోజుల్లో పెళ్ళియొక్క ముఖ్యోద్దేశ్యమేమి? వాటిని మనం ఎంతవరకు పరిపూర్ణం చేస్తున్నాము

బాగుంది మీ ప్రశ్న ఏ రోజుల్లోనైనా, బాధ్యత తప్పించుకోవాలని పెళ్ళి చేసుకొనంటూనే పెళ్ళి చేసుకుంటాడు మగవాడు. సుఖజీవనం కోసం పెళ్ళో అంటుంది—ఆడది.

ఆర్. వి. డి, లింగసపూడి

అత్తగారూ మీరు నన్ను అల్లునిగా స్వీకరిస్తారా? ఈ అల్లుని అందాన్ని ఆరాధిస్తారా? డబ్బుని ఆశిస్తారా? మంచిని గ్రహిస్తారా?

నేనేం గోకులంలో రాధమ్మనా అల్లుని అందం డబ్బు మంచీ వరించడానికి—నా కూతురి చేయి, పట్ట కల్గిన వ్యక్తి పౌరుషంగా బ్రతుకుతూ పెళ్ళాం ప్రాణాలు కొరుక్కు తినకుండా ఉంటే చాలునని మాత్రమే ఆశిస్తాను నాను బాబూ!!

కె ఎల్, సిర్‌పూరు కాగజ్‌నగరు

నే పంపిన కథ అచ్చవనూ లేదు. తిరిగి రానూలేదు కారణం?

ఇంకెవరి పేరనైనా అచ్చయి పోలేదు కదా!!

సాగరశ్రీ, అర్లగడ్డ

మీరు ఆరుద్రగారి కవిత చూసి వరించామన్నారు కదా? వారు మీలో ఏమి చూసి వరించారో తెలుసుకోవచ్చా?

అదే ఇన్నాళ్ల సహజీవనం తరవాత కూడా తెలియడంలేదు సాగరా! గమ్మత్తుగా లేదూ?

పి. వి. ఎమ్. ఆర్, మునగపాక

రామలక్ష్మిగారూ ఈ రోజులలో డబ్బు ప్రధానమా? చదువు ప్రధానమా?

చదువుంటే లాంగ్‌రేంజిలో మంచిది డబ్బుంటే వర్తమానంలో హాయి అదృష్టం కలిసివస్తే లాటరీలో కొట్టినా కొట్టవచ్చు డబ్బు. చదువలా రాదే—అందుకే చదువు ముఖ్యం.

ఎ పి. ఆర్, నెల్లూరు

సాగరశ్రీ అనే ఆసామి ఎవరండి. ప్రతివారం సాక్షాత్కరిస్తారు—కొంపతీసి మీ చుట్టం కాదు కదా?

నాకు చుట్టాలు లేరు—దీల్లో కొంప తీయడం ఏముంది? మీలాగే సాగరశ్రీ ఓ ప్రశ్నావళి పఠిత మీ లేఖ ధోరణి చూస్తే ఆడవాళ్ళ మీద అంత గౌరవం లేనట్టుంది— స్వీయాభిప్రాయాలు ఎంత దిగజారి వున్నా పబ్లిక్కులో సభ్యత కోసమేనా గౌరవం ప్రదర్శించడం నాగరికుల లక్షణం. కోపగించుకో/కండి/ కొండి (అవసరంలేని మాట కొట్టేయునది!) ●

వంచన

అమ్మంగి వేణుగోపాల్



ఆ వూరి మురికివాగు చిన్నదేం కాదు. కొత్తవారెవరూ అది మురికివాగని పోల్చుకోలేరు. కడుపులో ఎంతో కల్మశాన్ని దాచుకొని పైకి మాత్రం శుభ్రంగా, కల్లాకపటం ఎరుగని చిన్నతరహా పెద్దమనిషిలాగా ప్రవహిస్తూ వుంది. దానిమీద వంతెన.

నారాయణకు ఆ వంతెనమీద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతికే వాళ్లంతా తెలుసు. వాళ్లంతా అతని హోటల్ ఖాతాదారులే. ఉదయం తొమ్మిదయింది. వాళ్లంతా అప్పుడే దుకాణాలు తెరిచారు జనం ఎక్కువగా లేరు. తన దుకాణం దగ్గరికి రాగానే చెప్పులమ్ముకునే నరహరి.

'రండి సార్ రండి. క్యూలో నిలబడండి. పోతే దొర్కద్. బెహత్రీన్ మాల్' అన్నాడు నవ్వుతూ.

'శానా రష్ వున్నట్టున్నది. జరఫని జూస్కొని వస్త' అని నరహరి వీపుమీద రెండు దెబ్బలేస్తూ ముందుకు పోయాడు నారాయణ. ఇదంతా చూస్తున్న పెన్నులమ్ముకునే ఇరవైయ్యేండ్ల షరీఫ్ నారాయణకు అడ్డంవస్తూ.

'ఇది జూడు శిరీనివాసులు సేట్. ఇది జెపాన్ పెన్ వున్నై. దీన్ది జెర్మనీ గోల్డెన్ నిబ్ వున్నై. గ్యారంటీ మాల్' అన్నాడు.

'ఇదేందో నీ సొంత జెపాన్ వున్నట్టున్నదిరా పోరగా. నీయవ్వ సంపాయించిన జెపానారా' అంటూ 'వీడు పది రూపాయలకుమీదనే ఇయ్యాలె' అనుకుంటూ ముందుకు సాగాడు.

నారాయణ సాధారణంగా ఎవరికీ గంభీరంగా కనిపించడు. అంత వొత్తుగడ్డంలో నుంచి కూడా చిరునవ్వు కనిపిస్తూంటుంది. పైకి చూచాడు. తన హోటల్. వంతెననూ, వంతెనమీద నడిచే వాళ్లనూ వరానంగా ఆహ్వానించే 'శ్రీనివాస హోటల్'.

అతనిలో పితృవాత్సల్యం ఉప్పొంగింది. అతడు తన బ్రతుకులో ఈ మాత్రం చేస్తాననుకోలేదు.

ముందర ఎవరో పలకరించినట్లయితే చూచాడు. వంతెన చివర కూచున్న కుంటి వీరప్ప 'శణార్తిదొర. శణార్తి' అంటూ నమస్కారం చేస్తున్నాడు. కుంటి వీరప్పను నారాయణ అంతకుముందు వంతెన మీద చూడలేదు. అతని ముందు తెల్లబట్ట పరిచి వుంది.

'వీడు మంచిపనే సుదురాయించుకున్నడు' అనుకున్నాడు. అతని పక్కకు ఇంకో అతను కూచుని వున్నాడు. నారాయణ హఠాత్తుగా ఆగిపోయాడు. ఆ రెండో వ్యక్తి తన జీవంలేని రెండు కళ్లను తేలేసి ఆకాశం వంక చూస్తూ తలవూపుతున్నాడు. బొక్కలు కనిపించే బక్కపలుచని చామనఛాయ ముఖం. ఆతని ముందు కూడా బట్ట పరిచి వుంది. నారాయణ రెండడుగులు ముందుకేసి అతణ్ని బాగా చూచి హోటల్లోకి నడిచాడు.

తండ్రి రావటం చూచి గల్లా దగ్గర కూచున్న కొడుకు లేచి తాళం చేతులు అతనికిచ్చేసి ఇంటి ముఖం పట్టాడు. సర్వర్‌లకు నారాయణ రోజులాగా కనిపించలేదు. ముఖం వాడి పోయినట్లైనా పెరిగిన గడ్డం వల్ల గంభీరంగా కనిపించాడు.

అతణ్ని కొంచెం ఎరిగున్న వాళ్లంతా

ఎప్పుడంటే అప్పుడు ఏ విషయమంటే ఆ విషయం అడిగేవాళ్లు. అతని 'మూడ్' విషయం ఎవరూ అంతగా పట్టించుకోలేదు. కొంచెం వెనకా ముందు ఆడుతూనే వంతెన మీద సెకెండ్‌హాండ్ పుస్తకాలు అమ్ముకునే గంగరెడ్డి,

'నూడు శ్రీనివాస్ సేటే నన్ను బతుకుమంటవా వద్దంటవా. నీ కొడు కేమో ఇగ హోటల్‌కే రావద్దని చెప్పిండు. ఇంతకు ముందు నేను ఉద్దెర తిని ముంచినట్లు మాట్లాడిండు' అన్నాడు. నారాయణ కొంచెం విసుక్కున్నాడు.

'మాదిగూడ నడవాల్నా వొద్దా భై. ఉన్నోడు లేనోడు అందరు ఉద్దెర్లు పెడ్తె యాపారం మూడు దినాలు ముందల పడదు.' అన్నాడు.

ఈ మాట గూడా నారాయణ అంటాడని అనుకోలేదు గంగారెడ్డి. ఇంతకు ముందైతే. 'మంచిది రెడ్డి వానితోటి చెప్త. పో తిను పో' అనేవాడు.

'అరే నువ్వు దినాం పొద్దున్నాసంది చూస్తనే వున్నావుగద భై. ఏమన్న గిరాకైతున్నద చెప్పు. ఏగాడ్డి కొడుకన్న వచ్చి ఒక పుస్తకమన్న కొనుక్కుంటున్నాడ చెప్పు. జెర చెయ్యి కుదుర్కోనియ్యి పదిగొడు ఒరువై ఇస్త' అంటూ టేబుల్ ముందు కూచున్నాడు గంగారెడ్డి...నారాయణ సర్వర్‌ను పిల్చి 'రెడ్డికి ఏంకావాల్నో ఇయ్యి' అన్నాడు.

పని లేనప్పుడల్లా వంతెన వంక చూస్తున్నాడు నారాయణ కుంటి వీరప్ప అతనిపక్కన గుడ్డిమనిషి. వాళ్లముందు అంతగా మాయని తెల్లబట్టలు. ఎండలో మెరుస్తూ చిల్లరడబ్బులు కుంటి వీరప్ప ఇంతకుముందు నారాయణ హోటల్‌లో చాయ్ తాగి చాలా వినయంగా బిల్లు చెల్లించినవాడే. అతడు హోటల్‌లో కాలు పెట్టినప్పుడు, హోటల్‌నుంచి పోయేటప్పుడూ రెండుసార్లు చాలా వినయంగా నారాయణకు నమస్కారాలు చేసేవాడు. అతనికి మొన్న తెలిసింది ఎందుకు వీరప్ప అంత వినయంగా నమస్కారాలు చేసేవాడో. మొన్నరాత్రి నారాయణ హోటల్ విడిచి ఇంటికిపోయిన తర్వాత వీరప్ప వచ్చాడు.

'మాది సంగారెడ్డిప్యాట దొరా. కాలు

వంచన

లేనోన్ని. కట్టెలమిషిన్ల పోయింది. మీ హోటల్ల ఏమన్న నౌఖరీ ఇస్తె బతికి పోత' అన్నాడు. నారాయణ అతణ్ని ఎగాదిగా చూసి,

'నువ్వు చేసేపని మాదెగ్గరేముంటదిరా బాబు' అన్నాడు.

'ఎంగిలి గిలాసలు కోప్తస్తర్లు గిన కూసున్నజాగల కడిగిస్త దొర. నాకే మియ్యకు ఇంత రొండుపుటలు అన్నం పెడ్తె సాలు' అన్నాడు.

'గిలాసలు కూసున్న జాగలకు అవ్వి ఇవ్వి తెచ్చియ్యనికో నౌకరు కావాలె తీస్కపోనికో నౌకరు కావాలె. ఎందుకు? మాకేం తీట పట్టినాది?' అన్నాడు.

'కొంచెం దయ జూపుర్రి దొరా బతికి చెడ్డోన్ని. సంగారెడ్డి బసిస్టాన్‌కాడ గుడిసె హోటల్ నడిపినోన్ని. బాగ ఇంత ఎనకవేసింటి. ఏం జెయ్యాలె, దానమ్మ కడుపుకాల నా పెండ్లాం ముండ తీస్కపొయ్యి యాయ్యా మిండెలకు పెట్టుకున్నదొ. నేను దివాలా దీస్తి. వలుగుట్లు నగుబాట్ల పాలైతి.'

వీరప్ప కండ్లు తుడుచుకున్నాడు. ఇరవైయ్యేండ్లు ముప్పైనడుమ బలంగానే వుంటాడు. ముఖంలో చెమట మెరుస్తున్నది. నారాయణ కొంచెం కదలినాడు.

'సప్పం చెయ్యమంటవురారి. ఇప్పటికే నాదెగ్గర ఏకాన పనుంటె దొవ్వాన నౌకర్లున్నరు. ఇంకెవరి తనన్న పని చూస్కో. అందాంక దినాం పొద్దుగాలొచ్చి హోటల్ల చాయ్‌తాగి పోతుండు'. అన్నాడు. పని చేసేస్థితిలో వున్నప్పుడు కూచుని తినడం మంచిదికాదని నారాయణ అభిప్రాయం.

వీరప్ప పోయాడు. కట్టె టకటక జారిగా వినిపించింది. ఈ రోజు వంతెన మీద అడుక్కు తింటున్నాడు.

నారాయణను ఈ వూరివాళ్లంతా శ్రీనివాసులనే పిలుస్తారు. అతడీవూళ్లో హోటల్ పెట్టి మూడేళ్లయింది. జిల్లా. రైల్వేస్టేషన్ వుంది. ఆ వూళ్లోవున్న రెండు పెద్ద హోటళ్లలో ఇది ఒకటి. నారాయణ హోటల్‌కేమీ తక్కువచేయ్యలేదు, మంచి ఫర్నీచర్ తెప్పించాడు. సర్వర్‌లను శుభ్రంగా వుంచాడు. తిట్టికొట్టకాకుండా ప్రేమతో పని తీసుకున్నాడు. అందుకే ఆ మూడేళ్లలో కొత్తవాళ్లు వచ్చారు కాని పాతవాళ్లు పోలేదు.

అతనితోటి వ్యాపారస్థులు అతణ్ని పేకాటలోకి దించారు. మొదట్లో అతడు చాలా పిచ్చిగా ఆడేవాడు. రాను రాను తగ్గించుకుని రాజకీయనాయకులతో, హోదాలోవున్న ఆఫీసర్లతో పరిచయం కోసం మాత్రమే ఆ ఆటను ఉపయోగించుకున్నాడు.

రోజులాగా నవ్వుతూ పలకరిస్తూ, కాకుండా గంభీరంగా అసాధారణంగా వున్నందుకు నౌకర్లు చకచకా పనిచేసుకుంటూ పోతున్నారు.

నారాయణ మళ్లీ మళ్లీ వంతెన వంక చూస్తున్నాడు. కుంటి వీరప్ప ముఖం మీద గుడ్డ కప్పుకొని కట్టెను పక్కలో పెట్టుకుని పడుకున్నాడు. గుడ్డిమనిషి మాత్రం అలాగే కూచుని జీవంలేని కళ్లను ఆకాశంవంక పెట్టి తల వూపుతూనే వున్నాడు. ఆ మధ్యాహ్నపు ఎండలో నారాయణకు ఆ బక్క పలుచని చామనఛాయ ముఖం చాలా దగ్గరగా, నగ్నంగా కనిపిస్తూంది.

నారాయణకు ఈరోజు మనస్సేమీ బాగా లేదు. తలనొప్పి మొదలయింది. కాళ్లలో సన్న వణుకు కూడా మొదలయింది. మనస్సులో దారీ తెన్నూ లేని అస్పష్టమైన ఆలోచనలు. ఎత్తుగడలు. వంతెన వంక ధైర్యంగా చూడలేక పోతున్నాడు.

గల్లామీద కూచోడానికి కొడుకు రాగానే లేచి

'ఇయాల ఆకలైతలేదురారి. ఎందుకో నెత్తి నొస్తున్నది. బంగ్లామీద పండుకుంట. ఒక నెత్తినొప్పిగోలి, ఒక చాయ్ పంపియ్యి' అని నడిచాడు.

మెడల్పుగా దగ్గర దగ్గరగావున్న పది మెట్లను ఎక్కాడు. ఈ మేడనే ముందు స్టోర్‌రూంగా వాడుకునే వారు. చక్కెర సంచులవంటి బరువైన వస్తువులు పైన వుండడం మంచిది కాదని వెనుక పెరట్లో స్టోర్ రూం కట్టించాడు. అప్పటినుంచి పైన ఖాళీగా శుభ్రంగా వుంటుంది. ఈ మేడకు రోడ్డుపైపున వున్న గోడను, స్తంభాలువుంచి పడ

గొట్టేసి ఫర్నీచర్ వేసేస్తే, ఎండాకాల మైనా, ఏకాలమైనా ఇష్టమున్నవాళ్ళు పైన కూచోవచ్చు. పైన కొత్తగా 'ఫ్యామిలీ సెక్షన్' తెరవాలని కొడుకు అంటున్నాడు కూడా.

సర్వర్ అలనొప్పిమాత్ర, చాయ్ తెచ్చాడు. నారాయణ మంచంమీదినుంచి లేచి గోళీ వేసుకుని చాయ్ తాగాడు.

సర్వర్ వెళ్ళిపోగానే వంతెన వైపున్న కిటికీ తెరిచాడు. గాలి చాలా ఉధృతంగా వీస్తున్నది. పట్టలేక పట్టలేక విప రీతంగా నవ్వేవాడిలాగ చెట్లు కిందికీ పైకీ ఊగుతున్నాయి. మురికివాగు ప్రవాహం ఒక నిమిషం స్తంభించి పట్లయింది. వంతెనమీద నడిచేవాళ్ళు ఆగిపోయి కళ్ళల్లోపడ్డ దుమ్మును తుడుచుకుంటున్నారు. పుస్తకాలమీద రాళ్ళు పెట్టేస్తున్నాడు గంగారెడ్డి. కుంటి వీరప్పా, ఆ గుడ్డిమనిషీ తను ముందున్న గుడ్డలను మళ్ళీ మళ్ళీ పరుచుకుంటున్నారు. వాళ్ళవంక ఎక్కువ సేపు చూడలేకపోయాడు నారాయణ. మళ్ళీ కళ్ళల్లో వణుకులాంటిది వచ్చింది. వెంటనే కిటికీ మూసేసి మంచంమీద వాలిపోయాడు. అతనికి తన కళ్ళముందు ఏవేవో కనిపిస్తున్నాయి. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అయినా ఏవేవో దృశ్యాలు బలవంతంగా కనిపించసాగాయి.

* * *

నారాయణకు బుద్ధి తెలిసినప్పటి నుంచీ స్వంత హోటల్ పెట్టాలని వుండేది. అతడు చిన్నప్పటి నుంచి ఎన్ని హోటళ్ళలో నౌకరీ చేశాడో లెక్కలేదు. అతనే బతక లేడంటే, పెళ్ళాం, ఒక పిల్ల వాడు. డబ్బు ఎట్లా సంపాయించడమా అని రాత్రిళ్ళు నిద్రపోకుండా పిచ్చిగా ఆలోచించేవాడు. అతడు చివరిసారిగా బోధన్‌లో వున్న హోటల్‌లో పని చేశాడు. చూస్తుండగానే ఒక సంవత్సరంలోగా ఆ హోటల్ యజమాని పెద్ద మేడ కట్టే శాడు. అప్పటి నుంచీ నారాయణకు హోటల్ పెట్టాలనే పిచ్చి ముదిరి పోయింది. తనే చుట్టుపక్కల వారిని పరిశీలించేవాడు. ఎవరి దగ్గర ఎంత డబ్బు వున్నదీ అంచనా వేశేవాడు. భార్యను చెరుకు తోటలకు కూలికి పంపేవాడు.

నాలెక్కుదు నెలలు బాగా గాలించిన తర్వాత నారాయణకు కావలసిన వ్యక్తి దొరికాడు. అతడే కూలినాలి చేసుకుని బతికే గోవిందు. రోజు పొద్దుపోయిన తర్వాత హోటల్‌కు వచ్చి చాయ్ మాత్రమే తాగి పోతుంటాడు. గడ్డ కట్టిన ఎర్రని నెత్తుటి ముద్ద వంటి కుడి కన్ను. చామనఛాయ. బక్క పలుచగా వుంటాడు. మాసిన బట్టలు. తలకు నిండుగా రుమాలు. అమాయకుడని చూడగానే తెలుస్తుంది.

'కన్నుకేమైంది' అడిగాడు నారాయణ.

'చెరుకు కోసింది. రొండేండ్లాయె' అన్నాడు గోవిందు.

'పాపం' అని చాలా సానుభూతి చూపించాడు.


అట్లా స్నేహం కలిపేశాడు. తాను డ్యూటీనో వున్నప్పుడు రమ్మని రెండు మూడు టిఫిన్లూ టీ ఇచ్చి, టీ బిల్లు మాత్రమే తెచ్చిచ్చే వాడు. రాత్రి డ్యూటీ లేనినాడు సినిమాకు తీసుకొని పోయేవాడు.

డబ్బు ఖర్చు చేయడానికి వెనుక ముందులాడే గోవిందుకు ఈ స్నేహం నచ్చింది. గనుగెద్దులాంటి అతని బతుకులో ఈ స్నేహం కొత్తగా బాగా కని పించింది.

మొత్తానికి నాలెక్కుదు నెలల్లో నారాయణ అతని జీవితంలో చొచ్చుకొని పోయాడు. అతని మీద ఎంతో అధికారాన్ని సంపాదించాడు.

ఒకసారి నారాయణ అతని యింటికి పోయాడు. పాత పెంకుటిల్లు. రెండే రెండు గదులు. చిన్న పెరడు. ఒక గదిలో మూలకు మూడురాళ్ళు. కట్టెలు, పిడకలు వున్నాయి. అడుగులు మసిబారి పోయిన రెండు అల్యూమినియం పాత్రలు చిన్న కుండలు వున్నాయి. గోవిందు నారాయణను రెండో గదిలో కూచో పెట్టాడు, కింద గోనెసంచి వేసి. వాసా లకు కట్టిన తాడు మీద పాతబట్టలు వున్నాయి. మూలకు పెద్దగా వున్న పాతపెట్టె. దానికి లావైన తాళం వుంది. గోవిందు చిన్నప్పటినుంచీ సంపా దిస్తున్నాడు. కలరా వచ్చి పోయిన భార్య ఆర్నెల్ల క్రితంవరకూ సంపాదించేది. రోజుకు ఎనిమిదణాలకు మించి ఖర్చు చేయని గోవిందు ఆ డబ్బంతా ఏం చేస్తున్నట్టు. నారాయణతో తాను రెండో పెళ్ళి చేసుకోదలచినట్లు ఈనడుమ చెప్పాడు.

సగం బీడీ కాల్చి బయటకు విసిరేసి నారాయణ మొదలుపెట్టాడు. 'మా సేట్ గాడు ఏం సంపాయిస్తున్నాడు గోవిందూ చెప్ప తరంకాదనుకో. అన్నిఖర్చులు బోంగ వాన్కి దినాం ముప్పై మిగులుతున్న యంటె మామూలు మాటనా. నెలకు దెగ్గరదెగ్గర వెయ్యాయె. వాని అన్నలే



పెట్టుబడి యెంతనుకున్నవు? ఐదు వేలు. ఐదునెల్ల సంపాయించిండు.' అన్నాడు.

'ఉన్న మారాజులు వీ దండలనన్న సంపాయిస్తరు నారాయణా! లేనోడు యెండ్ల యేలుబెట్టినా సున్నకు సున్న హాల్లికిహాల్లి.'

'నువ్వన్నది నిజమేగాని మనసుంటే ఛ్లుకు దాని పనేంగాదది, అరే, ఇది వారకు నేనుగూడ ఒక హోటల్ పెట్టి న్నుంటె. ఆ ముండాకొడుకు దోఖా చేసె.' అన్నాడు నారాయణ. 'ఏమైంది?' అన్నాడు గోవిందు.

'ఇంతకుముందు నేను నిజామాబాదల పనిచేసేటప్పుడు నాతోటె రాజయ్య అని ఇంకోడు పనిచేస్తుండె. ముందే అనుకున్నాము. ఆశాన ఆశాన హిస్సాల ఇద్దరం కలిసి హోటల్ పెట్టాల్నని. యాడాదైనంక నేనో వెయ్యినర, వాడో వెయ్యినర సంపాయించినము. వాడేమన్నడంటె 'నేను నాల్గైదు తాలూకాలు తిర్గొచ్చి అడ్డా ఏర్పాటు చేసుకొని ఫర్నిచర్ గిర్నిచర్ జమాయించి నాల్గైదు దినాలల్ల వచ్చేస్త. రూపాలిచ్చెయ్యి. ఇద్దరం పోతె డబల్ ఖర్చులు' అన్నడు. యాడాది కల్సున్నము ఎవనికి అనుమానమొస్తది. పైసలిచ్చేసిన. వాడు పోయిండు ఎన్మిదొద్దులాయె ఏదొద్దులాయె. ఇగరాడగ రాడు. నెలాయె. పైసనా రెండు పైసలా వెయ్యినర. నాకేం సుద్దురా యించలేదు. అక్కడ్కి పోలీస్ ఇస్టేషన్ల ఫిర్యాదు చేసిన. ఆపోలీసు ముండాకొడుకులు బదామాశులు. వానికోసం దేవులాడింగ్రా లేదో గని నన్ను పట్టుకున్నరు. 'నీ క్యాడి నుంచి వచ్చినయి వెయినర' అని అడిగింగ్రు. 'సపాయించిన' అంటె ఇడుస్తర 'నువ్వు చేసేది ఎంగిలి గిలాసలు కడిగేపని ఇన్నిరూపాలాడి కెల్లొస్తయి? చెప్పు యాడ దొంగతనం చేసినవు?' అని పట్టుకున్నారు. ఇగేంజెయ్యాలె. ఎద్దు పోలీసోడు ఉరుక్కొడుండె. పెద్దపెద్ద మీసాలు దొడ్డుగ అచ్చు రావణాసురుని ల్యాకొలె వుంటడనుకో. 'బెటా తెస్తవా దో సౌరూ పాల్ దిస్కరా లేకుంటె నిన్ను బొక్కల నూకేస్త' అన్నాడు. ఇగ దేవుడా అని నా పెండ్లాం పెయ్యిమీదున్న బంగారమమ్మి

వంచన

నూటాయాభై రూపాలిచ్చి వాని కాళ్ళమీద బడితె ఇడిసేసింగ్రు. ఇట్ల గోవిందూ, ఉన్నది బోయింది, ఉంచుకున్నది బోయింది. ఆ పెద్దు తెల్సింది. ఎంత పొయ్యినా నోరు మూస్కొని ఊకోవాలెగాని, పోలీసోల్ల దగ్గర్కిమాత్రం పోగూడదాని.'

'అడు ఆకర్కి జిక్కనేలేదా'

'యాడ? ఇదువారకు వాని పతా లేదు.'

'పాపం! ఇట్ల దోఖా జేసి ఒడేం ముందలబడ్తడు నారాయణా నీ ఉసురు ముడ్తది జూడు.' అని ఓదార్చాడు గోవిందు.

ఇద్దరూ మళ్లీ బీడీలు కాల్చారు. 'నడు అట్ల పొయ్యి ఏమన్న తినొద్దాము' అన్నాడు నారాయణ. దగ్గరలోనే వున్న హోటల్‌లో ఇద్దరూ టిఫిన్లు తిని టీ తాగారు. అసలు విషయాని కొచ్చాడు నారాయణ.

'ఈ పనితోటి యాష్టొచ్చేసింది గోవిందూ, ఈ నెలల యెట్లనన్నచేసి హోటల్ పెట్టెయ్యాలనుకుంటున్న. చేతిల రెండువెయిలుంచుకొని ఒకని కిందెందుకు పని చెయ్యాలె. ఎవడు చెప్పిన బుద్దంట. సీతారాములు కొడుకు లేడా ఈర్రబ్రహ్మం. నీకు గుర్తున్నదా, వాడు ఫై తెల్లబట్ట లేసుకొని మా పాన్‌షాప్‌ల ఆకు తింటుంటడు జూడు...'

'తను నాకు కూసంలేదు' అన్నాడు గోవిందు.

'లేకపోతె మానె. ఎప్పుడన్న చూపిస్తగని, వాణ్ణడిగిన హోటల్ పెడ్దామా రాని. నంక లెగరేసిందు కొడుకు. రెండు వెయిలు ఇప్పుడంటె ఇప్పుడు దెస్తనడు పోదాము అన్నడు. వానికి నేనేం మాటియ్యలేదనుకో రెండు మూడొద్దులైనంక యామాట చెప్తాన్న'

'అట్లెందుకు కల్సి పెట్టెయ్యమంటివి' అన్నాడు గోవిందు.

'నూడు గోవిందూ. యాపారమన్నంక ఒకనిమీద ఒకనికి ఇశ్వాసముండాలె. కల్సి పెయ్యదామనుకోకుంద కష్టం చెయ్యాలె. ఈర్రబ్రహ్మంగాడు ఎసుంటోడా నాకు తెల్వదు. ఇదువారకే నాకు తట్టు దాకింది. కింద నూసుమంట నడువాలె. ఈర్రబ్రహ్మంగాడు ఇస్త్రీబట్ట లేసుకొని లాడ్‌సాబ్ ల్యాక గల్లామీద కూసుంటె, నేను కూలోనిల్యాక శాకిరి చెయ్యాలె. అందుకే నీ అసుంటోడు దొర్కితె మంచిగుండేని చూస్తున్న' అని ఆగిపోయాడు. అంత నమ్మకం తనలో వుంచినందుకు గోవిందు తబ్బిబ్బయాడు. కొంచెం సిగ్గుపడుతూ 'నా అసుంటోనితోనేమైతది నారాయణా' అన్నాడు. గోవిందు తనకు తాను అపాదించుకుంటున్న బీదరికంమీద ఏమీ వ్యాఖ్యానించకుండా పెద్దమనిషి లాగా అన్నాడు నారాయణ.

'చెప్పలేదంటవని చెప్తి తి. పెండ్లి దేముస్నది. సంపాయించినంక ఒకటి కాదు పది పెండ్లిళ్లు చేసుకోవచ్చు.

హోటల్ పెట్టి సంపాయించుడుకన్న హల్కావని లేదు. ఒక చాయ్ సంగతే తీస్కో. ఐదుపైసల షెక్కరి, ఐదుపైసల చాయ్‌పొడి ఐదుపైసల పాలతోటి రెండు కోపుల చాయ్ తయారైతది. పదిహేన్ పైసలు ఖర్చుచేసి ముప్పైపైసలు సంపాయించొచ్చు. గంటకు నాల్గుకోపుల చాయ్ అమ్మడుబోలె, తక్వలతక్వ పన్నెండు గంటలల్ల యాభైకోపులు. అంటె నాల్గు రూపాలు లాభం. ఇడ్లీలగిడ్లీలదాక ఆరు రూపాలనుకో. నువ్ దినాం ఖర్చులుపోంగ పదిరూపాలకు తక్వకండ్ల జాడవు. అంటె నెలకు మున్నూరు, యాడాదికి మూడువేల ... మూడువేల అరువొర్లు. ఇంకజెర కష్టపడి, రెండుపైసలెక్కువ ఖర్చుచేసి గిరాకి మనదెగ్గరికే వొచ్చేటట్లు చేసుకుంటిమా, యాడాది లోపట మన నాల్గువెయిలు మనకు రాకుంటె నా పేరు నారాయణ కాదు. యాడాదైనంక వొచ్చేదంత పుణ్యానికొచ్చినట్లైనా కాదా?'

'అవును' అన్నాడు గోవిందు. ఈసారి అతడు తన బీదరికం గురించి ఏమీ అనలేదు. గోవిందు ఆలోచనలో పడగానే.

'మల్లా కలుస్తా' అని నారాయణ సెలవు తీసుకున్నాడు.

ఆ మరుసాడే నారాయణ తన భార్యనూ పిల్లవాన్నీ అత్తవారింటికి పంపేశాడు.

నారాయణ అనుకున్నట్టుగానే రెండవ

రోజు రాత్రి గోవిందు హోటల్‌కు వచ్చాడు. నారాయణ డ్యూటీ ముగించుకుని, హోటల్ బయటకు రాగానే 'హోటల్ విషయంల ఎవర్నన్న కల్సుకుంటివ?' అన్నాడు గోవిందు.

'ఇంక లేదు. ఇయ్యాల ఈరబ్రహ్మం వొచ్చిండె. యీ సంగతి రేపు చెప్తాన్న' అన్నాడు నారాయణ.

'మల్లేం లేదు నా దెగ్గర్లో వెయ్యినర పైసల్లుంది. సరిపోతదంటవ?'

కొంచెం ఏకాంతంగ వుండి ఆలోచించి 'వెయ్యినరతోటి ఏమైతది గోవిందూ, రెండు రెండు నాలుగ్వెయిలైతె ఆడి కాడికి కటాకట్ సరిపోతది. ఈరబ్రహ్మం ఇయ్యాలొచ్చి మూడువెయిలైనా పెడ్తాంటున్నడు.'

'అయితే ముగ్గురం కలిసి పెడ్దాము' అన్నాడు గోవిందు.

'నీకు తెల్వదు గోవిందూ యెంత ఎక్వ మంది కలిస్తె అంత తక్వ లాభం వొస్తది. ముగ్గురుపట్టి మూడుచెక్కలకు గుంజుతుంటె చిప్ప చేతికొస్తది. నువ్వే చూడు ఎట్లనన్న రెండువెయిలు మట్టంవేస్తె వంటె పెట్టేతాము. ఐదునూర్లకేం ఎన్కకు పోతావు.'

'ఐతె మా ఆడిదాన్ది మూడు తులాలు బంగారంది దండె కడె వున్నది.'

'మూడుతులాలా? సరిపోతది' అని నారాయణ నడక చాలించి.

'సగ ఐదునొందుకు ఇద్దరం రేపే పట్నం పోదాము. అడ మా బావ మరిది దెగ్గర నా పైసలున్నయి. ఇద్దరివి కలిపి బ్యాంకుల ఏస్తేతాము. జమాన జోస్తె బాగలేదు. పైసలు దెగ్గరుంచుకోవొద్దు. అడ్డ దొర్కినంక ఎట్ల బేకైతె అట్ల చేతాము. అన్ని నోట్లు క్రయా చిల్లర్నె వున్నయా?' అన్నాడు.

'చిల్లర్నె శాన వున్నది' అన్నాడు గోవిందు. వెంటనే ఆ చిల్లరను మార్వాడీ దగ్గరకు తీసుకుపోయి నోట్లుగా మార్పించి ఇచ్చాడు. 'రేపు పొద్దుగాల ఐదుగంటల బండికి పోదాము. నీ దెగ్గరికి నేనే వొస్త. తయారుగుండు. ఇప్పుడే ఈరబ్రహ్మంగిన్నె కల్సుకొని కల్వదని చెప్పేస్త.' అని సెలవు తీసుకున్నాడు.

ఉదయం నాల్గింటికే గోవిందు దగ్గరకు వచ్చాడు నారాయణ. ఆ డబ్బు బంగారము ఒక ఉత్తరీయంలో చుట్టి తన లెదర్ బ్యాగ్‌లో పెట్టి తన వద్దనే వుంచుకున్నాడు. రెండు మూడు స్టేషన్లు దాటిన తర్వాత ఏదో స్టేషన్లో రైలాగినప్పుడు, నారాయణ బ్యాగుతో దొడ్డిలోకి పోయి వచ్చాడు. క్రిందికి దిగి నీళ్లు తాగాడు. వెంటనే కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి గోవిందుకు బ్యాగ్ ఇస్తూ ... 'జల్గం. పక్క డబ్బల మా వూరి కోమటోడున్నడు. వానికి యాపారం సంగతులు శాన గుర్తు సూట్లాడుత్తుంట. పట్నంలనే దిగి మనం కల్సుకుందాం. అని కిందికి దిగి, పక్క కంపార్ట్‌మెంట్‌లో మాయమైయ్యాడు.

గోవిందు పట్నంలో దిగి ప్లాట్‌ఫామ్ మీద చూస్తే నారాయణ లేడు, బ్యాగులో చూస్తే డబ్బు లేదు.

అప్పటి నుంచి నారాయణ శ్రీనివాసులు ఐనాడు గడ్డం పెంచాడు డబ్బు సంపాదించాడు.

*   *   *

తలనొప్పి మాత్ర వేసుకున్న తర్వాత కూడా నారాయణకు నొప్పి తగ్గలేదు. రోగిలో వుండే నిస్సహాయతా పిరికితనమూ అతనిలో చోటు చేసుకున్నాయి. వొళ్లంతా నొప్పి మంట. వెంటనే లేచి 'ఎర్రోడా, ఎర్రోడా' అని సర్వర్‌ను పిలిచాడు. కింద అల్లరి మూలంగా ఎవరూ వినిపించుకోలేదు. తానే రెండు మెట్లు దిగి పిల్చాడు. ఎర్రోడు వచ్చాడు. 'చూడూ, ఎదురుంగ ఫూల్‌మీద కుంటి ఈరప్ప వున్నడు. నేను రమ్మన్ననని మీదికి పంపియ్యి. పనున్నది' అన్నాడు.


'మీదికా?' అన్నాడు సందేహిస్తూ ఎర్రోడు.

'ఎక్కుతడు పది మెట్లెక్కడా? ఒకే కాలున్నది గద' అన్నాడు నారాయణ విసుక్కుంటూ కసిరినట్లుగా. ఐదు నిమిషాల్లో కుంటి వీరప్పను పైన వదిలేసి ఎర్రోడు పనిలోకి పోయాడు. వీరప్ప తల వొంచుకుని నిల్చున్నాడు.

'చూడు ఈరప్పా, నువ్వు చేస్తున్న పని నాకింత గూడ బాగనిపించలేదు. రెక్కల కష్టం చేసి బతుకుతవనుకున్న గాని, నువిట్ల నడి సడకల బిచ్చమడుగుతవనుకోలేదు.' అన్నాడు నారాయణ.

'ఏంజేయ్యాలె దొరా, ఎక్కడా పని దొర్కకపాయె. ఉపాస ముండి చచ్చే నౌబత్ వచ్చె. ఇంతబతుకు బతికినగని ఇసుంటె కష్టం నాకెప్పుడు రాలేదు. ఇంక ముందల ఏమేం చూసేదున్నదో ఆ పరమాత్ముని కెరుక.' కట్టె కింద సడేసి మాలబడ్డాడు.

కొంచెం ఏకాంతంగా వున్న తర్వాత 'ఏక్కణ్నుంచో ఒకగుడ్డోణ్నిగూడ సంపా



యించినట్టున్నవు. జోడి బాగ కలిసింది. ఈ పూరోడు కానట్టున్నడు.' అన్నాడు నారాయణ.

'కాదు. అక్కడ బోధన్ స్టేటోడంట. పాపం కూలిగీకిలి చేసుకుంట బతికేటోడు. సిన్నప్పట్నుంచి కష్టపడి రొండేయిలు సంపాయించి పెండ్లి చేసుకుందామని ఓరకు పెట్టుకుంటె, ఎవడో దోఖాబాజి ముండకొడుకు హోటల్ పెడ్దాం హోటల్ పెడ్దామని నమ్మిచ్చి ఆయిన్ని పైసలెత్తుకొని పరారైండంట, ఇదు వారకు పత్తా లేదు. ఆనికి ఆ పైసేం జెయ మిస్తడనుకున్న వాడొరా. ఆ ముండ కొడుకు కొనజాలకు పురుగులుపడి సచ్చి పోతడు.'

'పోలీసోల్లకు చెప్పనుండె.'

'ఈడు ఎట్లిదత్తమ్మ బుగులు పట్టి పోలీసులకు చెప్పలేదూ. నాయుట్టు పక్కలోల్లకు చెప్పలేదు. ముందే ఒకకన్ను పోయిండెనంట పైసపోయిది ఫికరుతోటి ఏడ్సిఏడ్సి ఉన్న కన్నుగూడ పోగొట్టుకున్నడు.'

'ఈ పూరి కెందుకొచ్చిండు?'

'పట్నపక్కలోల్లు చెప్పిన్రంట సర్కారోల్ల పెద్ద దవాఖాన వున్నది. పొయ్యి సూపిచ్చుకరా. ఈడుంటె ఎవడు చేస్తడు. పెండ్లాము పిల్లలా. గుడ్డోల్లకు టికెట్టు కూడ అడ్గరంటె రేలెక్కిండంట. చెకినొడొచ్చె ఈ పూరి టేషన్ల దించేసిండు. నేను నిన్న రాడ ఏ పనిగూడ దొర్కలేదని పూరికన్న పోదామని టేషన్లకొస్తున్న. రైలొచ్చింది. డబ్బుడప్పుకు చెకినోడుంటె, ఇగ ఎక్కలేదు. ఈడు ఏడ్సుకుంట కూకుంటె దెగ్గర్కిపొయ్యి 'ఏం సంగతని' అడిగ్తే, ఆడు ఆని కత చెప్పిండు, నేను నా కతా చెప్పేడిస్తి. ఇగ ఇద్దరం కలిసి అడుక్కోనన్న తిందమాని ఈ ఫ్లాట్‌మీద కూసున్నము.' ఆగి పోయాడు. చీకటిపడింది. నారాయణ లేచి లైటు వేశాడు.

'చూడు ఈరప్పా, నువ్వు అడుక్కోని తింటుంటె నాకే ఎట్లనో అనిపిస్తున్నది. రేపట్నుంచి నిన్ను పనిలోపటికి తీసుకుంట. కూచుప్పన్తానుల గిలాసలు కొపి తన్తుర్లగిన కడిగెయ్యి. రొండు పుటల అన్నంపెట్టి నెలకు ఐదో పదో ఇస్త. చేస్తావా?' అన్నాడు.

'ఎందుకు చెయ్య సేట్. ఇంత పూర్తికి దయజూపితె నీ మేలు ఈ జన్మల యాది మరువ.' అన్నాడు వీరప్ప.

'మల్ల ఆ గుడ్డోనిగతి' అన్నాడు నారాయణ.

'ఆడు ఆ ఫ్లాట్‌మీదనే అడుక్కోని బతుకుతుంటడు సేట్'

కొంచెం నవ్వొచ్చింది నారాయణకు. 'నేను నీకు పైసలిస్త రేపు ఆ గుడ్డోన్ని పట్నం తీస్కపో. ఆడ గుడ్డోళ్లకోసము కాళ్లుచేతులు లేనోళ్లకోసము దిక్కులేని ముసలోల్ల కోసము సర్కారోల్ల సత్ర మున్నది. అది యాడున్నదో ఎట్ల పోవాల్నో అంత రాసిస్త' అని జేబులోని తెల్ల కాగితంమీద అడ్రసూ పోవలసిన తోవా అంతా రాసి వీరప్పకు ఇచ్చి,

'నినేందంటె సర్కారోళ్ల సత్రంల నీణ్ని షరీక్ చేపిచ్చె. నీకు ఇష్టమని పిస్తె నువ్వుగూడ వుండు. లేకుంటె వచ్చెయ్యి. నేను ఇంతకు ముందు ముగ్గురు నల్గురు గుడ్డోళ్లను అడికి పంపిచ్చిన. వాళ్ల దవాఖానకు తీస్కపొయ్య చూపిచ్చు కుంటరు. రేపు మనుకుల బండికే పొండి. పాపమా గుడ్డోణ్ని నడమనే యాడనన్న ఇడ్సి వొస్తవు. కిందికి రా పైసలిస్త' అని నారాయణ వీరప్పతో కిందికి దిగడు.



తండ్రిని చూడగానే కొడుకు లేచాడు. 'నొప్పి తక్వయిందా నాయినా?' అని అడిగాడు. 'ఇంకా పూర్తిగ తక్వ కాలేదు రారి. ఇంక జ్వర మున్నది' అని చెప్పి గల్లాలోనుంచి ఇరవై రూపాయలు తీసి వీరప్పకిస్తూ 'ఇందుల పదేను రూపాలు రానుబోను ఖర్చులకు తిండీ తిప్పలుకు వొస్తయి. ఐదురూపాలేమొ ఆ గుడ్డోని చేతిలపెట్టు. ఇట్ల శ్రీనివాసులు సేట్ ఇచ్చిండని వానితోటిగాని, సల్గిరితోటే గాని చెప్పే అవసరం లేదు. నేను పేరు రావాల్నని ఇస్తలేను. మీ అసుంటోల్లకు ఎంత ఇచ్చినా తక్వనే ఏమంటవు?' అన్నాడు. 'మంచిది దొర యాది మరువ. రొండొద్దుంల్ల వచ్చేస్త. శణార్థి' అని నమస్కారం చేసి సెలవు తీసుకున్నాడు వీరప్ప.

నారాయణ వీరప్ప పోయే వైపు చూస్తూ కూర్చున్నాడు. వంతెనకు రెండువైపులా వున్న ట్యూబ్‌లైట్లు పాల వెలుగును కాస్తున్నాయి. గుడ్డిమనిషి, బిచ్చమడిగే శక్తిలేక, ఆపనేదో బట్టకే నొప్పచెప్పి, కాళ్లు చేతులు ముడుచుకొని పడుకున్నాడు. వీరప్ప తన బట్టల పడ్డ నాల్గైదు పైసలను జేబులో వేసుకున్నాడు. గుడ్డిమనిషి బట్టలో పడ్డ చిల్లర డబ్బులోనుండి నాల్గైదు బిళ్లలను తన జేబులో వేసుకుని అతన్ని లేపాడు. గుడ్డిమనిషి తన గుడ్డలో తడుముకుంటూ మిగిలిన డబ్బుల్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు. ఇద్దరూ లేచారు. గుడ్డిమనిషి తనచేతిని వీరప్ప చేతిలో పెట్టాడు.

వాళ్లు పోతుంటే నారాయణ నిశ్చింతగా నిర్భయంగా వాళ్ల వంక చూడసాగాడు.

ఇప్పుడు నారాయణకు తలనొప్పి పూర్తిగా తగ్గిపోయింది. మనస్సు కూడా తేలిక పడింది. పెదవుల చివరల్లోకి ఎప్పటి చిరునవ్వు వచ్చేసింది. ఆ రోజు ఎంతగిరాకీ అయిందో తెలుసుకోడానికి నోట్లు లెక్క పెట్టసాగడు.

వారఫలం

3-4-1970 శుక్రవారం మొదలు 9-4-1970 గురువారం వరకు

మేషం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారంమధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం ఆఖరులో తిరిగి అన్నివ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

వృషభం: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. వారం ఆఖరులో ప్రయోజనంలేని శ్రమకు గురి కాగలరు.

స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరుతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మిథునం: వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు బాగా ఉంటాయి. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. విలాస వస్తువులు కొంటారు.

కర్కాటకం: లాభంరావలసిన వ్యవహారాల్లో నష్టం రావచ్చును. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో సంతోషకరమైన వార్తలను వింటారు. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం: ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారంమధ్యలో ఆందోళన కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

కన్య: వృత్తిలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం ఆఖరులో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల: వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగా ఉంటాయి. పోటీవారితో మాటపట్టింపులు తగవు. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడుతాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. నూతన విషయాలను తెల్సుకొంటారు. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. కొన్ని వ్యవహారాల్లో అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కాగలదు.

స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరుతాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

ధనుస్సు: వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. స్థిరాస్తి వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. సజ్జనసాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

మకరం: భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషి చేయవలసి వస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.


కుంభం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి.


స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

మీనం: కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం పెరుగుతుది. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

—మహేష్





జరిగిన కథ

రాధాకృష్ణ పోయేసరికి పార్వతి గర్భవతి. ఆమె తప్పనిసరిగా రుక్మిణిని ఆశ్రయించవలసి వస్తుంది. బిడ్డని కని పార్వతి కూడా కన్ను మూసింది. ఆ పిల్ల మాధవి. రుక్మిణి దగ్గర మాధవి పడరానిపాట్లు పడ్డది. కళ్లారా చూసిన పరమేశ్వరి మాధవిని తనతో తీసుకు వెళ్లిపోయింది. శ్యామల రాధలతోపాటు మాధవిని కూడా కన్నకూతురిలాగే పెంచింది. మాధవి ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతాన్ని శివశాస్త్రికి ఇవ్వడం ద్వారా అతని అభిమానానికి కొంత పాత్రురాలు కాగల్గింది. మధు ఆ యింట్లో కొత్తగా అద్దెకు వచ్చాడు. రాధ అతనితో పరిచయం పెంచుకుంది. రాధ ఆరాధన మనసులోనే వుండిపోయింది. మాధవి అతనికి బాగా సన్నిహితురాలైంది. మధుకి కూడా ఆమెపైన అంతులేని అనురాగం.

5

ఆ సాయంత్రం శ్యామలను చూసుకోవటానికి పెళ్లివారొస్తున్నారు— ప్రొద్దుటినుండీ మాధవి ఒకటే హడావుడిగా తిరుగుతోంది-ఫలహారాలు తయారు చేసింది—ఇల్లంతా సర్దింది—శ్యామలను స్వయంగా ముస్తాబు చేసింది. పరమేశ్వరి ఎంత బలవంత పెట్టినా తను మాత్రం ఖరీదైన చీర కట్టుకోకుండా మామూలు మిల్లు చీరతోనే ఉంది—

తలుపు తట్టిన చప్పుడు కాగానే గాభరాగా తలుపు తెరిచింది — రాజారావు లోపల అడుగుపెట్టాడు—తనకు ప్రాణమైన శ్యామలకు కాబోయే వరుణ్ని ఆనందంతో చూసింది మాధవి—

ఎంత నిరాడంబరంగా ఉందో అంత అందంగా ఉన్న మాధవిని తనను తను మరిచిపోయి చూస్తూ నిలిచిపోయాడు రాజారావు—

కొంత సేపటికి అతని చూపులు ఇబ్బందిగా అనిపించి నర్వస్‌గా కదిలి 'లోపలకు రండి—' అంది మృదువుగా వచ్చి కూర్చున్నాడు రాజారావు—

'చొరవగా మీపేరు?' అన్నాడు—

'మాధవి!'

'చదువు కొంటున్నారా?'

'అహ! ఉద్యోగం చేస్తున్నాను—'

'గుడ్! ప్రస్తుత మనదేశపు ఆర్థిక పరిస్థితులనుబట్టి, ఆడవాళ్ళూ మొగవాళ్ళూకూడా చదువుకుని ఉద్యోగాలు చెయ్యవలసిందే!'

'నా ఉద్దేశమూ అదే! ఉండండి— ఫలహారం తీసుకొస్తాను—'

మాధవి లోపలికెళ్లి టిఫిన్ ప్లేట్లు ట్రేలో సర్ది శ్యామలకిచ్చి అతని కియ్యమంది—

శ్యామల గడగడ వణికి పోతోంది— వళ్లంతా చెమటలు పట్టాయి—

'నే నెందుకో నిలవలేకుండా ఉన్నాను మాధవీ! ఎందుకో చాలా భయంగా ఉంది నువ్విచ్చిరద్దూ!' అంది—

'ఎందుకు శ్యామలా భయం?—రా! నువ్విస్తేనే బాగుంటుంది—'

'అహ! నేను వణికి పోతున్నాను— నా చేతుల్లోంచి ట్రే జారిపడినా పడుతుంది—నువ్విచ్చిరా మాధవీ!'

పరమేశ్వరి కలిగించుకుని 'ఇచ్చిరా మాధవీ! అవతల పెద్దమనిషి కూర్చున్నారు—' అంది—

పరమేశ్వరి కాఫీ డికాషన్ తయారు చేస్తోంది—మాధవి ఫలహారం తీసుకొచ్చి రాజారావు కిచ్చింది—రాజారావు ఫలహారం చేస్తూ 'చాలా బాగుంది—ఎవరు చేసారు?' అన్నాడు—

'నేనే చేసాను—'

'మీరు అటు ఉద్యోగమూ ఇటు వంటా కూడా చేస్తారన్నమాట!—'

'మరి?! చాలామంది ఉద్యోగం చేస్తున్న ఆడవాళ్లు ఏదో సుఖపడి పోతున్నారనుకుంటారు—ఇళ్ళలో ఉండే ఆడవాళ్ల కంటే మా బాధ్యతలు రెట్టింపవుతాయి— పోనీ ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటుందా అంటే అదీ ఉండదు—పెళ్లి కాకముందు మా జీతంపైన అధికారం తండ్రిది— పెళ్ళయ్యాక భర్తది—జీతమంతా వాళ్ల కిచ్చి ఖర్చులకి మళ్లీ అడిగి తీసుకోవలసిందే!'

రాజారావు చిరునవ్వు నవ్వాడు—

'ఆర్థిక స్వాతంత్ర్యం లేదని బాధపడ

తున్నారా?'

మాధవి నవ్వింది—

'అవతలివాళ్ళు సహృదయులైనంత వరకూ ఈ స్వాతంత్ర్యం ఉన్నా లేక పోయినా ఒకటే! అన్నీ అవతలివాళ్ళు కనిపెట్టి చూసుకుంటూంటే మాకసలు డబ్బు దేనికి?'

'గుడ్! కానీ అసలు హక్కుల ప్రసక్తి లేకుండా నీ, నా భేదం తలెత్తకుండా సంసారం చేసుకోవటం మంచిది కదూ!'

'మెల్లగా అంటున్నారా? అంతకంటె స్వర్గం ఉంటుందా?'

'చదువుతో పాటు సంస్కారం కూడా ఉన్నవాళ్ల సంసారాలలాగే ఉంటాయి—'

మాధవి సిగ్గుపడి సంభాషణ మారుస్తూ 'మీ వాళ్లెవరూ రాలేదేం?' అంది—

'మామూలుగా జరిగే పెళ్లి చూపుల తంతు—అందరూ రావటం—అందరూ అన్ని రకాలుగా ఏదో ఒక బజారులో వస్తువులా పెళ్లికూతురిని పరీక్షించటం, నచ్చదు నాకు—అందుకే నేనొక్కడినే వచ్చి పెళ్లికూతురితోనే మాట్లాడాలను కున్నాను—వచ్చాను—తర్వాత ముహూర్తం నిశ్చయించుకోవడానికి మా నాన్నగారు వస్తారు—'

'ఇంతటి సభ్యతగల యువకుని ఇన్నాళ్లకు చూశాను—'

'ఇలా లేనిపోని సిగ్గులు ప్రదర్శించకుండా, నిస్సంకోచంగా అన్ని విషయాలూ చర్చించగల యువతిని ఇవాళే కలుసుకున్నాను—'

తెల్లబోయి చూసింది మాధవి—

ఇతనిముందు తను సిగ్గుపడవలసిన అవసరమేముంది?

ఎంతకూ కాఫీలు తీసుకుని శ్యామల రాకపోయేసరికి లోపలికెళ్లింది మాధవి—

'ఏమిటి పెద్దమ్మా! నువ్వూ శ్యామలా ఎంతకూ రారేం?'

'ఏం చెయ్యమంటావమ్మా!' కాఫీ ఇచ్చిరా! 'అని పంపుతే కాఫీ అంతా చీరమీద వలక పోసేసుకుంది—అది చీర మార్చుకొంటూంది—నేను కాఫీ తయారు చేస్తున్నాను మళ్లీ—లాభంలేదు—అది బెదురు గొడ్డు—ఈ కాఫీకూడా నువ్వే ఇచ్చేసిరా!'



మాధవి తనే కాఫీకూడా ఇచ్చింది—

అంతలో శ్యామలను చెయ్యి పట్టుకుని తీసుకొచ్చింది పరమేశ్వరి—

తల వంచుకుని కుర్చీలో కూర్చున్న శ్యామలను తెల్లబోయి చూసాడు రాజారావు—

'మీరు సాయంత్రం వస్తారనుకున్నాం —అందుకనే ఆయన పళ్ళు తీసుకు రావటానికి బజారు వెళ్ళారు — చిన్నమ్మాయికూడా ఆయనతో వెళ్ళింది—ఈ పాటికి వస్తూ ఉండాలి—'

'పరవాలేదు—ఇప్పుడు నాకు పళ్ళావీ ఏం అక్కర్లేదు—'

అంతలోనే శివశాస్త్రి, రాధ వచ్చారు —

'ఓహో! బావగారా! నమస్కారం—'

చేతులు జోడించింది రాధ —

అప్పుడే వరస కలిపేసిన రాధను చూసి నవ్వి తనూ ప్రతి నమస్కారం చేసాడు రాజారావు—

శివశాస్త్రి కంగారు పడిపోతూ 'అరె! అప్పుడే వచ్చేసారే! మర్యాదలన్నీ జరిగాయా? ఫలహారం తీసుకున్నారా? కాఫీ త్రాగారా? క్షమించాలి — ఆలస్యమయిపోయింది' అన్నాడు —

'మీరేం కంగారు పడకండి— కూర్చోండి — నేను మర్యాదలకోసం రాలేదు—అయినా మీ వాళ్ళు అతిథి సత్కారంలో లోపం చెయ్యలేదు —'

అపరాజిత

'అది మా పెద్దమ్మాయి శ్యామల— చదువుకోలేదు — కానీ, కుట్లూ అల్లికలూ బాగావచ్చు—వజ్రంలాంటిది—నేను చెప్పకూడదు కాని, అంత వినయ విధేయతలు ఎవరికీ ఉండవు — దీనికి పెళ్ళయితే మాకు కొండంత బరువు తగ్గుతుంది—'

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు రాజారావు — అప్రయత్నంగా కనుబొమలు ముడిపడ్డాయి — అంతలో సర్దుకుని కూర్చున్నాడు—

'మీ నాన్నగారు రాలేదేం?'

పరాగ్గా ఆలోచిస్తూన్న రాజారావు వెంటనే సమాధానం చెప్పలేదు—

'మిమ్మల్నేనండీ!'

ఉలిక్కి పడ్డాడు—

'ఏవిటీ?'

'మీ వాళ్లెవరూ రాలేదేం?'

'తర్వాత వస్తారు —' క్లుప్తంగా సమాధానం చెప్పాడు — కొంచెంసేపు కూర్చుని అందరికీ నమస్కరించి వెళ్ళిపోయాడు రాజారావు —

తర్వాత కొంచెం రోజులకు రాజారావు తండ్రి వచ్చి కట్నండబ్బు ముందుగానే తీసుకుని ముహూర్తం నిశ్చయించుకుని వెళ్ళిపోయాడు —

'చూడు పెద్దమ్మా! అంత సంస్కారంగా మాట్లాడాడు — కట్నంమాత్రం మానలేదు—' అక్కసుగా అంది మాధవి—

'అంతేనమ్మా! డబ్బు అన్ని ఆశయాలకూ మంగళహారతి పాడేస్తుంది—' నిస్పృహతో అంది పరమేశ్వరి—

* * *

శ్యామలకు పెళ్ళయిన దగ్గరనుండే మాధవి కెన్నో సంబంధాలు వస్తున్నాయి —ఆ సంబంధాలన్నింటినీ మాధవి అభిప్రాయంకూడా అడక్కుండానే ఏవేవో వంకలతో తిరగ్గొడుతున్నాడు శివశాస్త్రి —

మాధవికి మనసంతా అల్లకల్లోలమయిపోయింది — తనకు మధు నాలుగు వేలిచ్చినట్లు ఇంట్లో అందరికీ తెలుసు —ఆ మాత్రం తమ అనుబంధాన్ని అర్థం చేసుకోలేరా? ఇంకా ఎందుకిలా సంబంధాలంటూ కపట నాటకం? తన అభిప్రాయం ఎవరైనా అడుగుతే చెప్పటానికి సిద్ధంగానే ఉంది 'మధుని తప్ప ఎవరినీ చేసుకోనని—' కాని, అసలు తన దగ్గర ఆ ప్రస్తావన ఎవరూ తేకపోతే ఏం చెయ్యాలి? తనంత తను తన పెళ్ళి మాటలు ఎలా మాట్లాడగలదు?

శ్యామల పెళ్ళయి దగ్గర దగ్గర ఏడాది నిండుతోంది — మధుకు సహనం తగ్గి చిరాకు ప్రారంభం కాసాగింది—

'ఎన్నాళ్ళీ దాగుడుమూతలు మాధవీ! మీ వాళ్లతో స్పష్టంగా ఎందుకు చెప్పవూ?'

కొద్ది చికాకుతోనే అడిగాడు—


'ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు— నా దగ్గర ఆ ప్రస్తావనే లేవటం లేదు ఎవరూ...'

'నే నొచ్చి అడగనా మీ పెద్దనాన్నగారిని?'

'అడగండి —అదొక్కటే మార్గంలా కనిపిస్తుంది—'

పెద్దనాన్నకు తను పెళ్ళిచేసుకోవటం ఇష్టం లేదని మాధవికి లీలగా అర్థమవుతోంది—పెద్దమ్మ అభిప్రాయం స్పష్టపడటం లేదు—కనీసం పెద్దమ్మయినా తన నర్థంచేసుకుని తనకండగా నిలపకపోతే ఏం చెయ్యగలదు?

మాధవి ఇల్లు చేరుకునేసరికి పరమేశ్వరి ప్రయాణ సన్నాహంలో ఉంది—



మీరు త్రాగే కాఫీ చిక్కగా, కమ్మగా, స్ట్రాంగ్‌గా మరియు క్షణంలో కావాలంటే...

బ్రూ

మీకు కావల్సింది అదే



చిక్కని, స్ట్రాంగ్
కాఫీ చికరీ బ్లెండ్
క్షణంలో తయారౌతుంది!
సేద దీర్చి, ఉల్లాసాన్నిచ్చుటలో
దాన్ని మించినది లేదు.

బ్రూక్ బాండ్

బ్రూ ఇన్‌స్టెంట

కాఫీ చికరి బ్లెండ

ఆవిడ ముఖంకూడా పాలిపోయి ఉంది—

'ఎక్కడికి పెద్దమ్మా!' ఆందోళనగా అడిగింది మాధవి—

పరమేశ్వరి మాధవిని కౌగిలించుకుని ఏడ్చింది —

'శ్యామల పరిస్థితి ఏం బాగుండలేదని ఉత్తరం వచ్చింది— తీసుకు రావటానికి వెళ్తున్నాను —'

మాధవి గుండె గుభిల్లుమంది— పెళ్ళయి ఏడాది నిండలేదు—ఈ అనారోగ్యం ఏమిటో?

బరువు గుండెతోనే పరమేశ్వరిని రైలెక్కించి వచ్చింది—శ్యామల ఆరోగ్యం కొంచెం చక్కబడేవరకూ పెళ్ళి ప్రస్తావన వాయిదా వెయ్యమని మధుని బ్రతిమాలింది—మధుకు కొంత నిరుత్సాహం కలగక పోలేదు —అయినా సహృదయుడు గనుక విషయం అర్థం చేసుకుని సహనం వహించాడు—

వస్తూనే మాధవిని ఆప్యాయంగా కౌగిలించుకుంది శ్యామల ఇద్దరికీ కళ్లల్లో నీళ్లు తిరిగాయి — శ్యామలను చూసి భయంతో వణికిపోయింది మాధవి— సన్నగా తీగలా ఉండే శ్యామల విపరీతంగా లావైపోయింది—వళ్లంతా బాగా నీరు పట్టింది—

'ఇదేమిటి శ్యామలా! ఇంతవరకూ ఎందుకు డాక్టర్‌కు చూపించుకో లేదూ? ఈ వళ్లేమిటి?'

అపరాజిత

శ్యామల కళ్లల్లో వెనకటి వెలుగు లేదు—నీరసంగా నవ్వుతూ 'నా ఖర్మ! బాగా ముదిరేవరకూ రోగమనే తెలీదు— ఇప్పుడిక చూపించుకోవాలి — నువ్వొస్తావుగా! నాకే భయమూ లేదు—' అంది మాధవి భుజంమీద చేతులేస్తూ—

ఆ మర్నాడే శ్యామలను తీసుకుని మాధవి హాస్పిటల్ కెళ్ళింది—

లేడీ డాక్టర్ ముఖం శ్యామలను చూస్తూనే వడలిపోయింది—

'వెంటనే హాస్పిటల్‌లో చేర్పించెయ్యండి—నా శక్తి కొద్దీ ప్రయత్నిస్తాను —'అంది—

మాధవి గుండెల్లో రాయిపడింది—పరమేశ్వరి అక్కడే బావురుమని ఏడ్చేసింది—

శ్యామలను హాస్పిటల్‌లో చేర్పించారు — పగటివేళ పరమేశ్వరి, సాయంత్రం మాధవి భోజనం తీసికెళ్తున్నారు—పది రోజులు గడిచాయి—శ్యామల పరిస్థితి బాగుపడలేదు సరిగదా ముఖం మరింత ఉబ్బింది— యధాప్రకారం సాయంత్రం కేరియర్‌తెచ్చి శ్యామల దగ్గిర కూర్చుంది మాధవి—

శ్యామల తను అల్లుతోన్న స్వెట్టర్ పక్కకు పెట్టి 'హమ్మయ్య! తెల్లవారిన దగ్గిర్నుండీ నువ్వెప్పుడొస్తావా అనే తహతహ! నిన్ను చూస్తేకానీ నాకు స్థిమిత పడదు—' అంది—

'నాకూ రావాలనే ఉంటుంది—ఏదైన కాలేజీపని ఒకటి తగలబడింది కదా!'

'నీ పనిని తిట్టను—దానివల్లే అంత రం బ్రతుకుతున్నాం—'

'మీవల్ల బ్రతికినదాన్ని—కాస్త మీకు ఉపయోగపడుతున్నాను—'

'మావల్ల ఏం బ్రతికావ్! నీ స్వయంకృషితో పైకొచ్చావు—'

'పోనిస్తూ! కాని నువ్వీ అల్లికేమిటి? విశ్రాంతి తీసుకోక!...'

శ్యామల కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి — పేలవమైన చిరునవ్వుతో 'ముందు ముందు నా పాపకు ఏం చెయ్యగలనో! ఏం చెయ్యలేనో? ఓపిక ఉన్నంతవరకూ అయినా చెయ్యనియ్యి—ఇక ఒకటే విశ్రాంతి లభిస్తుందేమో!'

మాధవి నిలువునా వణుకుతూ శ్యామల నోరు మూసేసింది—


'వద్దు! వద్దు! శ్యామక్కయ్యా! ఇలా మాట్లాడకు—నేను సహించలేను— నీకు బాగవుతుంది—తప్పకుండా నయమవుతుంది—'

'బాగయితే మంచిదే! కాని ఒక్క మాట...'

'చెప్పు...'

'నాకు చాలా భయంగా ఉంది మాధవీ! రాత్రిళ్లు నా ఆయాసం చూస్తోంటే నేను సవ్యంగా బ్రతికి బయట పడ్తానని తోచదు...ఉండు... అడ్డురాకు... నన్ను చెప్పనీ! సవ్యంగా జరిగితే సరే! లేక నేను మరణించి నా పాప బ్రతికివుంటే మాత్రం ఆ పాప బాధ్యత నీదే! మావారి మనసులో ఏముందో నాకు తెలీదు—ఆయన నాకు ఏ విషయమూ చెప్పడు—నా సంగతే చూడు! నా జబ్బు ఇంత ముదిరిపోయే వరకూ నాకు జబ్బు చేసిందని కూడా తెలీదు—! ఆయన మనసులో నాకు స్థానం లేదేమో! అలాంటి వ్యక్తి చేతుల్లో నా పాపను వదలలేను—నా చిట్టి తల్లిని లేత వయసులోనే అనాదరణకు గురి చెయ్యకు — ఎదుటి వ్యక్తుల నిరాదరణ పసిమనసుకు ఎంతటి రంపపుకోతో నీకే తెలుసు — నా పాపకు ఆ గతి కలగనియ్యకు...మాధవీ!...'

ఉద్రేకంతో ఇన్నిమాటలు మాట్లాడిన



శ్యామల ఆయాసంతో రొప్పసాగింది — ఒళ్ళంతా చెమటలు పట్టిపోయింది — మాధవి గాభరాగా శ్యామల వెన్ను నిమురుతూ 'ఊరుకో! శ్యామ ఊరుకో! నిండుమనిషివి— అనవసరంగా ఆయాసం తెచ్చుకోకు—' అంది—

శ్యామల అంత ఆయాసంలోనూ తన చెయ్యి చాపుతూ,

'మాటియ్యి — నా పాపకు అండగా ఉంటానని మాటియ్యి—' అంది—

మాధవి కన్నీళ్ళతో ఆ చేతిలో చెయ్యి వేసింది—

'నాకు తెలుసు— నువ్వు సుఖంగా ప్రసవించి నీ పాపతో హాయిగా ఉంటావు— ఒకవేళ నా దారుణ దురదృష్టం కొద్దీ, అలా కాకపోతే, నీ పాపకు నేనే తల్లిని—నా కంఠంలో ఊపిరి ఉన్నంతవరకూ నీపాప తల్లిలేని పిల్లకాదు—'

శ్యామల సంతృప్తిగా ఊపిరిపీల్చుకుంది —అంతలో ఆయాసం మరింతయింది — మాధవి గాభరాగావెళ్ళి డాక్టర్ని పిలుచుకొచ్చింది — ఆవిడ శ్యామలను చూసి 'ఈవిడకి ఎవరు ఉద్రేకం తెప్పించారు? ఈ సమయంలో ఉద్రేకాలు పనికిరావు—' అని విసుక్కుంటూ ఏదో ఇంజక్షన్ చేసింది—

చాలా సేపటికి శ్యామలకి కాస్త నెమ్మదించింది—

'చూశావా శ్యామలా! ఎంత అవస్థ కొని తెచ్చుకున్నావో? ఇంకెప్పుడూ ఇలా అనవసరంగా హైరాణపడకు—నే నుండగా నువ్వు దేనికీ బెంగపెట్టుకోకు—'

'పెట్టుకోను — నా పాపకు నువ్వు తల్లి నవుతానని మాటిచ్చావు—ఇంక నాకే దిగులూ లేదు—బ్రతకాలనికూడా లేదు—బ్రతికి నేను పొందబోయే సుఖాలూ లేవు—'

'ఇలా మాట్లాడితే, నేను పారిపోతాను—ఎందుకింత నిరాశ నీకు?'

'భర్త ప్రేమకు నోచుకోని స్త్రీకి నిరాశ కాక ఏముంది?' వెక్కివెక్కి ఏడ్చింది శ్యామల—

చిత్తరువులా నిలబడి పోయింది మాధవి—

'నీ భర్తకు నీ మీద...'

ఆపైన మాట్లాడలేక పోయింది—

'అవును— నా భర్తకు నామీద అసలు

ప్రేమలేదు — విధిలేక నాతో సంసారం చేసారు—ఆయన ఎవరినో ప్రేమించారు—రాత్రివేళ నిద్రలో 'పొరపాటు జరిగింది—పొరపాటు జరిగింది—' అని కలవరించటం అనేకసార్లు విన్నాను—బయటంతా నవ్వుతూ తుళ్ళుతూ ఎంతో చైతన్యంగా ఉంటారు— నా దగ్గరకి రాగానే ఆయనలో జీవం అంతా నశించినట్లయిపోతుంది— యంత్రంలా మారిపోతారు—ఆయన అనురాగం పొందాలని నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైపోయాయి —సన్నిహిత వ్యక్తిగానైనా గుర్తించలేని ఆయనకు నేనెలా అపురూపాలిని కాగలను? అందుకే నా కసలు బ్రతుకుమీద ఆశ లేదు—' మాధవి కళ్ళలోంచి నిప్పులు కురిసాయి—

అపరాజిత

'ఛీ! ఏం మనుష్యులు? నాలుగువేలు కట్నం తీసుకుని...'

'అదే! ... అదే కారణం ఇంతకూ... ఆయన నన్ను కోరి చేసుకోలేదు—నాలుగు వేలు కట్నంగా ఇచ్చి కంఠంలో మూంగళ్యాలు కట్టించుకోగలిగాను కాని ఆయన మనసులో స్థానాన్ని పొందలేకపోయాను—ఆయన నిద్రలో కలవరించిన దాన్నే నేను జాగ్రదవస్థలోనూ అంటున్నాను— 'పొరపాటు జరిగిపోయింది...'

ఉసూరుమంది మాధవి —

'నిన్నింత క్షోభ పెట్టినందుకు అతను తగిన ఫలితం అనుభవిస్తాడు—' ఉద్రేకంతో అంది—

'వద్దు! వద్దు! అలా శపించకు —ఆయన నన్ను ప్రేమించకపోయినా, నేను ఆయనను ప్రేమిస్తాను — ఆయన సుఖంగా ఉండాలనే కోరుకుంటున్నాను —'

భారంగా కళ్ళుమూసుకుంది శ్యామల—

కోపంతో మనసు కుతకుత ఉడుకుతున్నా ఆ పరిస్థితిలో శ్యామలను మాట్లాడించటం ఇష్టంలేక బలవంతాన నిగ్రహించుకుంది మాధవి—

శ్యామలకి నొప్పులు ప్రారంభమయ్యాయి— ఇంట్లో అందరూ లేబర్ రూం దగ్గరే ఉన్నారు —

ప్రసవ వేదన అనుభవిస్తూనే 'ఆయనకు చెప్పొద్దు మాధవీ!' అంది శ్యామల—

పెళ్ళిగ్రామం అందుకోగానే వచ్చేసారు రాజారావు— యమయాతన పడుతోన్న శ్యామల ముఖం రాజారావును చూడగానే వికసించింది— చేతిని జాపింది— కన్నీళ్ళతో ఆ చేతిని అందుకున్నాడు రాజారావు—

'నన్ను క్షమించు శ్యామలా!' అన్నాడు గద్గదికంగా!

'ఇందులో క్షమార్పణల ప్రసక్తి ఏముంది? మీరు నన్ను ఏనాడూ కష్టపెట్టలేదు—మీ వశంలో లేని మీ మనసుకు మీరెలా బాధ్యులు?'

'పొరపాటు జరిగిపోయింది—'

'అవును... పొరపాటు...'

శ్యామల నొప్పులు ఎక్కువయిపోయాయి— డాక్టర్ హెచ్చరికతో రాజారావు బయటికి నడిచాడు — శ్యామల మూలుగులు అంతకంతకూ భయంకరంగా వినిపిస్తున్నాయి — చివరకు సన్నని పసిపాప రోదన ధ్వని వినిపించింది— ఉగ్గబట్టుకొని బయట కూర్చున్న ఆపుఅందరూ ఒక్కసారి తేలిగ్గా నిట్టూర్చారు — డాక్టర్ బయటకొచ్చింది — ఆత్రంగా లేచారు అందరూ—

'సారీ! తల్లి ప్రాణం రక్షించలేకపోయాను — శిశువు క్షేమంగా ఉంది—ఆడపిల్ల...'

(ఇంకా ఉంది)

(వైవాహికం రెండవభాగం ప్రారంభం, రచయిత్రి, శ్రీమతి తురగా జానకీరాణి)

డాక్టర్ కబుర్లు

వ్యాయామం - ప్రమాదాలు

వ్యాయామం మంచిది, నిజమే! కాని, ఇది అతి కాకూడదు. అందరికీ ఒకే రకం వ్యాయామం ఇచ్చి, బాగా కృషి




చెయ్యమంటే ఈ ప్రమాదం కలగవచ్చు.

టెన్నిస్, గోల్ఫ్ మొదలయిన ఆటలు ఆడే కొందరు డెస్కు వద్ద కూర్చుని పనిచేసే వారూ, ఇంటిపనులు చేసుకునే వారూ బలహీనులు అనుకోవచ్చు ఇది నిజం కాకపోవచ్చు.


వ్యాయామం చేసేముందు శారీరిక పరీక్షకాక మానసిక పరీక్షకూడా పొందటం మంచిది. ఏదో పరిశోధనాలయంలో నిర్మాణాత్మకమయిన పనిచేసుకునే వ్యక్తిని ఆటలకోసం బయటికి తరమటం చిక్కులు తీసుకురావచ్చు.

శరీరం బాగుంటే చాలదు! మనస్సుకూడా బాగా ఉండాలి. నడవలేని వారు కొందరు గొప్ప మేధావులు పేరు పొందారు; గొప్ప క్రీడాకారులు కొందరు అంత తెలివికలవారుగా కనిపించరు!

(కాపీరయిటు)



(తరువాయి 64 పేజీలో చూడండి.)



నువ్వంటేనే నాకిష్టం!

కోడూరి శ్రీరామమూర్తి

నా పేరు శేఖరం—మా తాతయ్యగారి పేరు చంద్రశేఖరంగారట—అందుకని నాకా పేరు వచ్చింది—నా పేరు చూచి నేను చాలా పెద్ద వాణ్ణనుకోకండి—మొన్ననే నాకు ఏడో వచ్చింది—ఇప్పు డయితే చాలా పెద్దవాణ్ణయి పోయాను గానీ—చిన్నప్పుడు అల్లరి బాజాలాగా వుండేవాణ్ణట—పైగ ముదెచ్చి బుద్ధులు కూడా బోలెడు వుండేవిట—ఇప్పుడుకూడా కొన్ని వున్నాయనుకోండి—నాకు తెలియదు అమ్మ అంటూ వుంటుంది — నా అల్లరి మా అమ్మకు జ్ఞాపకం వున్నంత మరెవరికీ జ్ఞాపకం వుండదు—అయినా మీరే చెప్పండి—కర్రగుర్రం మీద స్పీడుగా స్వారీచేస్తూ విరోధి సైన్యాలమీద 'ఢాం ఢాం'అని తుపాకి పేలుస్తూ యుద్ధం చేసినంతమాత్రాన అది అల్లరి అయి పోతుందా? — ఈ మాత్రం గోలకూడా లేకుండా యుద్ధాలు పూర్తయి పోవా లంటే ఎలా చెప్పండి?—సరే!—ఇప్పుడా గొడవంతా ఎందుకుగానీ నేను చిన్న వాడుగా వున్నప్పుడు జరిగిన కథ ఒకటి చెబుతాను—వినండి—

* * *

ఆ—ఆవేళ నాకు భలేకోపం వచ్చింది—ఎగ్జిబిషన్‌లో కొన్న కొత్తబొమ్మను ఓ మూలకు విసిరేశాను.

కర్రసిపాయిని నేలకేసి కొట్టాను—కసిగా జుట్టు పీక్కున్నాను.

అమ్మ ధోరణి నాకేమీ నచ్చలేదు—ఇంట్లో నేననే మనిషిని వున్నట్టు అమ్మకి జ్ఞాపకంకూడా వున్నట్టులేదు—ప్రొద్దున్న నేను స్కూలుకు వెళ్ళలేదన్న విషయంగానీ—టిఫెనుకూడా సరిగా తినలే దన్న సంగతి కానీ—అమ్మ పట్టించు కున్నట్టే లేదు—

అవును — ఎందుకు పట్టించు కుంటుంది?—అసలు ఒను ఈలోకంలో వుంటేగా—

నాకు మాత్రం నాన్నని చూడాలని లేదూ—నాన్నతో మాట్లాడాలని కోరిగా లేదూ—

అంత మాత్రాన అన్నీ మరిచిపోయి నాన్నగురించి ఆలోచిస్తూ కూర్చున్నానా అని—

అమ్మ అసలు ప్రొద్దున్న నించీ ఖాళీగా వున్నట్టులేదు—ఇప్పటిదాకా బోలె డన్ని లడ్డూలు చేసి సీసాలో మూత

పెట్టిదాచింది. 'నాన్న వచ్చాక తిందాం—' అంటూ—

ఇప్పుడు ప్రక్కగదిలో నేను దాచుకున్న ఆ సామానునంతా మంచాల కిందకు తోసేసి గదినంతా 'నీట్'గా సర్దుతోంది—

అమ్మసంగతి చూస్తూంటే కోపం ముంచుకు వస్తోంది—

'అమ్మా—' అన్నాను కోపంగా—

దానికి సరిగ్గా సమాధానం చెప్పక పోగా—నావేపు తిరిగి 'అప్పుడే జుట్టంతా చెరిపేసుకున్నావా?— నాన్న వచ్చే టైమ్ అవటంలేదూ!—' అంది—

'ఎప్పుడో సాయంత్రం కదా వచ్చేది!—' అన్నాను బాధను దిగమ్రింగుకుంటూ—

'నీ మొహం—రెండున్నర కల్లా బండి వచ్చేస్తుంది—బండిలో నాన్నకూడా వచ్చేస్తారు'—

రైలు బండిలో నాన్న వచ్చేస్తాడన్న వూహ నాకు చాలా ఆనందాన్ని కలిగించింది—అయితే ఇంతలోనే ఇంకో సందేహం వచ్చింది—

'మరి—రోజా రైలుబండి వస్తోంది కదా!—ఇన్నాళ్ళా నాన్న రాలేదేం—'

'రైలు ఎక్కకుండా నాన్న ఎలా వస్తారు?—ఇన్నాళ్ళా ఆ పాపిష్టివాళ్ళు నాన్నను విడిచి పెడితేగా—'

ఆ 'పాపిష్టివాళ్ళు' ఎవరో నాకు తెలుసు—వాళ్ళ సంగతి అమ్మ నాకెప్పుడూ చెపుతూనే వుంటుంది. ప్రపంచ పటంలో పాకిస్తాన్‌ని చూచినప్పుడల్లా నాకు నాన్నే జ్ఞాపకం వచ్చేవాడు—యుద్ధంలో మన సైనికులకు పాకిస్తాన్ సైనిక స్థావరాల రహస్యాన్ని చెప్పాడని—పాకిస్తాన్ సైనికులు మోసం చేసి నాన్నను ఖయిదీగా పట్టుకున్నారట—అయితే—నాన్న చెప్పిన విషయంవల్ల మనవాళ్ళకు ఎంతో అపకారం జరిగిందట—అలా నాన్న ఖైదీగా చిక్కకపోతే మేం చాలా హాయిగా వుండేవాళ్ళమట—

'అమ్మా!—నాన్నని మరి జైల్లో పెట్టారా?—' అమ్మని అడిగను నేను—

పుస్తకాల్లు సర్దుతూ అంది అమ్మ—

'[illegible] నాన్నను జెయిల్లో పెట్టడం [illegible]—ఎంతో గౌరవిస్తారు— పెద్ద ఉద్యోగం ఇస్తారు—'

'[illegible] పెద్ద ఉద్యోగం అంటే?'

'ఏమో తెలియదు—ఇంతకన్నా పెద్ద ఆఫీసరు వుద్యోగం—బహుశా కర్నల్ పదవి ఇచ్చినా ఇవ్వవచ్చు—'

అంతలోనే ఇంకో సందేహం—

'అప్పుడు కూడా మనం ఇక్కడే వుంటామా?'

నా మాటలకు నవ్వింది అమ్మ—'ఇక్కడెందుకు వుంటాం?—హాయిగా నాన్నతో వెడతాం— అప్పుడు నువ్వు నాన్న వడిలో కూర్చుని దర్జాగా ఎన్నో వూళ్ళు చూడవచ్చు—'

ఈ మాటలు నాకెంతో సంతోషాన్ని కలిగించాయి.

'అమ్మా!— నాన్న మంచివాడేనా— నేనంటే ఇష్టమేనా!—' అన్నాను.

ఆ మాటలకు అమ్మ ఫక్కున నవ్వింది—'పిచ్చీ!—నువ్వంటే నాకూ నాన్నకూ ఇష్టం వుండకపోతే మరెవరికి వుంటుంది? నువ్వే చూద్దువుగాని...' అంది నా బుగ్గమీద చిటికె వేస్తూ.

నాన్న సంగతి ఏమోగాని—ఆ మీసాలు మాత్రం నాకేం నచ్చలేదు—ఆ ఫోటోలోని మీసాలు చూస్తూంటేనే భయంగా వుంది—ముద్దు పెట్టుకోవాలంటే భయం వెయ్యదూ?— ఈ మాట చెప్పేశాను అమ్మతో—

అది విని — అద్దాన్ని తుడుస్తూ అంది అమ్మ నవ్వుతూ 'వచ్చిన తర్వాత మీ నాన్నతో చెబుదువుగనిలే— మీసాలు తీసెయ్యమని—'

అద్దంలో హాయిగా నవ్వుతున్న అమ్మ ప్రతిబింబం కనబడింది నాకు—

* * *

స్టేషనంతా హడావిడిగా వుంది—రైలు కోసం ఎదురుచూస్తూ జనం ప్లాట్‌ఫారంమీద పడిగాపులు పడివున్నారు.

'నాన్న రాగానే ఏం చెయ్యాలి?—' అమ్మను అడిగాను నేను—

'నమస్కారం పెట్టాలి—' అంది అమ్మ—

'ఆ తర్వాత?—'

'—ఆ తర్వాత నువ్వు ఏమీ చెయ్యనక్కరలేదు—నాన్నే నిన్ను ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటారు—'

నాకెంతో సంతోషం కలిగింది—నా మనస్సు తహతహ లాడిపోతోంది—కథల్లో రాక్షసిని చంపేసిన రాకుమారుడిలాగా ఎంతోమంది విరోధుల్ని తుపాకితో కాల్చి చంపిన నాన్నను చూడాలని నాగుండెల్లో కుతూహలం ఉరకలు వేస్తోంది— 'బండి త్వరగా వస్తే బాగుండును—' విసుక్కుంటూ అనుకున్నాను నేను.

ఇంతలో బండి రానేవచ్చింది—

ఎదురుగా అమ్మ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ల వైపు పరిగెట్టింది— ఇంతలో వో భారీఎత్తు మనిషి వో కంపార్ట్‌మెంట్ లోంచి దిగాడు చేత్తో సూట్‌కేస్ పట్టుకుని—అమ్మని చూడగానే ఆ మీసాలమనిషి 'హలో!—నళీ!—' అన్నాడు నవ్వుతూ—

ఇదివరకే ఫోటోలో చూశానుగా !—నాన్నను గుర్తు పట్టగలిగాను నేను—'గుడ్‌మార్నింగ్—డాడీ !—' అన్నాను.

అప్పుడు నాన్న నావైపు తిరిగి ఆశ్చర్యంలో అన్నాడు—

'వీడేనా మన వంశోద్ధారకుడు —ఎవరో అనుకున్నాను—ఏరా కేప్టెన్ !—' అన్నాడు బుగ్గమీద చిటికెవేస్తూ.

బొత్తిగా మంచీ మర్యాదా లేకుండా ఏమిటా పలకరింపు అనిపించింది—

పెట్టెను కూలీ చేతికిచ్చి అమాంతంగా నన్ను ఎత్తేసుకున్నాడు— నన్ను ముద్దు పెట్టుకుంటూ 'చాలా పెద్దవాడై పోయాడు. అప్పుడు వేలెడంత వుండేవాడు — చాలా బుద్ధిమంతుడు లాగా వున్నాడు—అల్లరిగిల్లరీ చెయ్యడుగా!—' అన్నాడు అమ్మతో.

ఆ మాటలకు నవ్వింది అమ్మ—'అలా అనుకుంటూ వుండండి—వాడి అల్లరేమిటో మీకే తెలుస్తుంది—'

కొత్తమనిషిని ఎదుట పెట్టుకుని అమ్మ నా గురించి అలా మాట్లాడడం నాకు నచ్చలేదు—అమ్మకు కూడా మంచీ మర్యాదా పోతోంది.

తిరిగి అమ్మ మాట్లాడింది— 'చాలా చిక్కిపోయారు — మళ్ళీ నాకీ అదృష్టం కలుగుతుం దనుకోలేదు — అయిదేళ్ళయి పోయింది—'

అమ్మ కన్నీళ్ళు తుడుచుకొంటోంది—అసలు ఏడుపెందుకు వచ్చిందో అర్థం కాలేదు నాకు—

అయినా—నాన్న ఏమంత చిక్కిపోయి వున్నాడనీ ?—ఏమో!— ఇదివర కెంత

నువ్వంటేనే నాకిష్టం!

లావుగా వుండేవాడో!—

జట్కాలో కూర్చున్నతర్వాత అంది అమ్మ నాతోటి— 'ఏరా!— నాన్నను చూడాలని తెగ కలవరించావు — ఏం మాట్లాడవేం మరి?—'

అయినాసరే—నేను మాట్లాడలేదు— అదీ కాకపోయినా అంత పెద్దమనిషితో ఏం మాట్లాడతాం?—

'ఏమిట్రా అంత పరీక్ష పెడుతున్నావ్?—' అంటున్నాడు నాన్న —

'మిమ్మల్ని కాదు — మీ మీసాల్ని!— వాటిని చూస్తే మీ వంశోద్ధారకుడికి హళ్ళుమంట!—'

తనివి తీరా నవ్వుతోంది అమ్మ!—

* * *

నాన్న వచ్చి పదిరోజు లయింది—

కాని—ఇంటి వాతావరణం పూర్తిగా మారి పోయింది—

నాన్న ఇంటికి ఒక రాజులా అయి పోయాడు—

'ఉష్!—నాన్న నిద్ర పోతున్నారు—'

'అలా చేస్తే నాన్నకు కోపం వస్తుంది—'

'నాన్నతో చెబుతాను చూడు—'

'నాన్న ఏమంటారో?—'

ఇలాంటి మాటలు ఇంట్లో తరుచూ వినబడ సాగాయి.

ఇదివరకటిలా ఇంట్లో గోల చెయ్యడానికి వీలులేదు—పొరుగు పిల్లల నందరినీ పోగుచేసి ఇంటిలో రైలుబండీ ఆట ఆడుకోడానికి వీలు లేదు. ఎప్పుడుబడితే అప్పుడు అమ్మతో కలిసి సరదాగా పక్కింటి సీతమ్మగారింటికి వెళ్ళడానికి వీలులేదు — రాత్రిపూట వెన్నెల్లో అమ్మ చెప్పేకథలు వింటూ గోరుముద్దలు తినడానికి అవకాశమే చిక్కడం లేదు—

ఎప్పుడూ నాన్న—నాన్న—నాన్న?—

నాన్న వస్తేగాని ఇంట్లో ఎవరూ భోజనం చెయ్యడానికి వీలులేదు.

నాన్నకి వీలయితేనేగాని సినిమాకు వెళ్ళడానికి వీలులేదు.

నాన్న ఉత్తరం రాసుకుంటున్నాసరే ఇంట్లో ఎవరూ నోరెత్తడానికి వీలులేదు— ఏమిటితని అధికారం? — ఏమిటితని గొప్పతనం?' — నాకు వొళ్ళు మండి పోతోంది—

నాన్న వచ్చినప్పటి నించీ చూస్తున్నాను నేను అమ్మ వరస — పాటలు తెగపాడుతోంది — చాలా సంతోషంగా వుంటోంది—నేను పరీక్ష పేసయినప్పుడు కూడా అంత సరదా పడలేదు—

నేను పది నిముషాలు ఆలస్యంగా నిద్ర లేస్తే కేకలేసే అమ్మ నాన్న ఏడు గంటలకూడా నిద్ర లేవకపోయినా సరే ఒక్కమాట కూడా అనదు—అంతేకాదు— ఎంతో తియ్యగా పలకరించి పక్క దగ్గరకే కాఫీ తీసుకు వస్తుంది. పళ్ళు తోముకోకుండా కాఫీ త్రాగే ఆ పాడు బుద్ధికి చివాట్లు పెట్టక— 'దొరగారికి బెడ్‌కాఫీ బాగుందా?—' అంటుంది నవ్వుతూ—సిగ్గులేక పోతేసరి—

నేను ఎప్పుడయినా సినిమాకు వెడదాం అంటే ఇవాళ కాదు —రేపు — రేపుకాదు ఎల్లుండి—అనీ, పరీక్షలు ముందు పెట్టుకుని సినిమాలేమిటనీ ఇన్ని వంకలు చెబుతుంది కదా—కాని, నిన్న కాక మొన్న వచ్చిన నాన్న సినిమాకు వెడదామంటే చాలు గబగబా తయారైపోయి రావడమే కాకుండా — 'ఆలస్యం చేశానా?—' అంటుంది పైగా—ఏం మనిషి బాబూ—

వచ్చి పది రోజులయినా కాలేదు — అప్పుడే నాన్న అమ్మను బాగా లొంగదీసుకున్నాడు— తనమాట కాదనకుండా చేసుకున్నాడు. ఇన్నాళ్ళ బట్టీ వున్న నేను ఎందుకూ పనికి రాకుండా పోయాను. బుంగమీసాలు — మిడిగుడ్లూను — ఏం బావుంటాడు బాబూ నాన్న?'

పైగా అతనికి అసలు పెద్ద మనిషి తరహాయే లేదు—నాన్నంటే హెడ్‌మాస్టర్ లాగా పంచె కట్టుకుని — పైకండువా వేసుకుని — చేతిలో కర్ర పట్టుకుని వుంటాడనుకున్నాను —కాని — అబ్బే — బొత్తిగా ఇలా వుంటాడనుకోలేదు— 'ఏరా కర్నల్' 'ఒరేయ్ కేప్టెన్' 'ఏరా కమేండర్' అంటూ నోటికొచ్చిన పేరుతో పిలుస్తూ వుంటాడు—అతను ఏ పేరుతో పిలిచినా పలకాలిట —పలక్కపోతే కోపం— నాన్నకు కాదు —అమ్మకు వస్తుంది. పైగా నేను ఏమన్నా అనబోతే 'నాన్న ఇన్నాళ్ళూ చాలా కష్టపడి వచ్చారు—

ఇప్పుడు మనం ఆయనన్ను సంతోష పెట్టాలి—ఆయనకు విశ్రాంతి ఇవ్వాలి—' అంటుంది. మహా తనే పడిపోయాను కష్టం— ఎంతో మంది చచ్చిపోతే గాని మన దేశానికి స్వాతంత్ర్యం రాలేదట— హెడ్‌మాస్టర్‌గారు చెప్పారు.

ఈ నాన్న వచ్చాక అమ్మకి పోకిరీ బుద్ధులు కూడా వచ్చాయి. ఆ మధ్య— ఏదో సినిమాకు వెళ్ళినప్పుడు అందులో రాకుమారుడు రాకుమారిని గట్టిగా కౌగలించుకుంటే అమ్మ— 'ఛీ! — పోకిరీ బుద్ధులు!—' అని గొణుక్కుంది. అంతే కాదు—పక్కింటి సీతమ్మగారితో ఈ విషయం చెప్పి 'అబ్బే!—ఈ సినిమాల వల్ల జనానికి పోకిరీ బుద్ధులు ఎక్కువ అయిపోతున్నాయి—' అంది—

ఇప్పుడు అమ్మ మాత్రం?—మొన్న రాత్రి నేను ముందు గదిలో కూర్చుని లెక్కలు హోమ్‌వర్క్ చేసుకుంటున్నాను కదా—అప్పుడు అమ్మ ప్రక్కన వున్న గదిలో ఏదో పత్రిక చదువుకొంటోంది. అప్పుడు నాన్న ఆ గదిలోకి మెల్లిగా వెళ్ళి హఠాత్తుగా అమ్మ కళ్ళుమూసేసి బుగ్గలు ముద్దుపెట్టుకున్నాడు. దానికి అమ్మ ఏమీ అనకపోగా 'ఉష్! — శేఖరం!—, అంది — అక్కడికి నేను అడ్డం అయిపోయినట్టుగా — ఛి — ఛీ! — ఇదెక్కడి మనిషి?—ఎక్కడో పాకిస్తాన్‌లో పడివుండక ఈ నాన్న మమ్మల్నందరినీ పాడు చేస్తున్నాడు— నాకేం చెయ్యాలో తెలియకుండా వుంది—

ఈ నాన్న కోసం ఎన్నాళ్ళ ఆత్రుతగా ఎదురు చూశాను—నాన్న వస్తే ఎన్నెన్నో చెయ్యాలని కలలు గన్నాను. కాని — నాన్నకు నా సంగతే పట్టినట్టు లేదు. ఎప్పుడో బుద్ధి పుడితే మాత్రం అమాంతం పైకి ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటాడు—అప్పుడు కూడా నాకు అసహ్యమే కలుగుతుంది—మీసాలు మూతికి గుచ్చుకుంటాయి. ముద్దు పెట్టుకున్నా డన్న సరదాయే వుండదు—

పైగా అస్తమానూ నాతో అంటూ వుంటాడు— 'ఏరా! —నువ్వు ఆర్మీలో చేరతావా?—నేవీలోనా?—ఎయిర్ స్క్వాడ్‌లోనా?— ఏది సరదా?—' అని.

నన్ను కూడా పాకిస్తాన్ పంపించెయ్యాలని చూస్తున్నాడు— నేను చచ్చే సైన్యంలో చేరను—నేను సైన్యంలో చేరిపోయి యుద్ధానికి వెడితే ఇంకేమున్నా వుందా? — అమ్మని బుట్టలో వేసుకుని ఇంకా పాడు చేస్తాడు—అమ్మని ఎలాగయినా నేను రక్షించాలి— అమ్మ నా మాట వినేలాగ చేసుకోవాలి— నేను యుద్ధంలోకి వెళ్ళకూడదు — తుపాకీని పారెయ్యాలి — కన్నీళ్ళు తుడుచుకుంటూ బాధగా గొణుక్కున్నాను నేను.

ఇంతలో నాకు—

'ఏరా!—నువ్వెక్కడున్నావా?— నీ గురించి నాన్న ఇందాకటినించీ అడుగుతున్నారు—' అమ్మ గొంతు వినబడింది.

నాన్న అడిగితేనే తప్ప అమ్మకి నా సంగతి గుర్తుండదన్నమాట.

'ఒక్కడివీ ఏం చేస్తున్నావ్?—' అడుగుతోంది అమ్మ—

'చదుకుంటున్నాను—' కోపంగా సమాధానం చెప్పాను. కాని—నా కంట్లోంచి కన్నీళ్ళు క్రిందికి జారేయి.

'ఏడుస్తున్నావా?—'. అంది అమ్మ ఆశ్చర్యంగా—

'లేదు—' అన్నాను బాధగా—

'అదేమిటి?—కళ్ళల్లో కన్నీళ్ళు కనబడుతూంటేనే—ఎందుకు?—' అంది అమ్మ నా ప్రక్కన కూర్చుంటూ—

ఎందుకట—ఎందుకు?—తనకు తెలియనట్టు — నాకు అమ్మమీద ఉక్రోషం ముంచుకు వచ్చింది.

'నేనివాళ భోంచెయ్యను—' అన్నాను మరింత కోపంగా—

నా మాటలకు అమ్మ నవ్వింది—

'బాగుంది—భోజనం మానెయ్యడానికి ఎవరయినా ఏడుస్తారా?—లే—కళ్ళు తుడుచుకో—' అంది.

ఈ ఊరడింపు నాకు మరింత బాధ కలిగించింది—ఇదివరకు నేను అన్నం మానేస్తానంటే అమ్మ ఎంత నొచ్చుకునేది!— 'నా బాబుని కదూ — నా బంగారుకొండవు కదూ—' అంటూ ఎంత బ్రతిమాలేది?—ఇప్పుడా విషయాన్ని ఎంత తేలిగ్గా తీసుకొంటోంది—

ఈ అవమానాన్ని నేను భరించలేకపోయాను—

ఒక్కసారి వరదలాగా కన్నీళ్ళు ముంచుకువచ్చాయి.


గుక్కపెట్టి ఏడ్చేశాను—

అప్పుడు అమ్మ ఎత్తుకుందని కూడా తెలియలేదు.

* * *

ప్రక్కరోజున నేను పక్కింటి సీతమ్మగారి అబ్బాయిని అడిగాను—

'ఒరేయ్—గోపీ— నువ్వంటే మీ



నువ్వంటేనే నాకిష్టం!

అమ్మకు ఇష్టమేనా?—' అని.

'హాఁ—భలే యిష్టం—' అన్నాడు గోపీ పిచ్చిక గూడు కడుతూ—

'మరి నాన్నంటే?—' నాక్కావలసిన ప్రశ్న యిది—

పిచ్చికగూడు పైభాగన్ని నునుపుగా చేస్తూ అన్నాడు గోపి—

'ఇంకా ఎక్కువ ఇష్టం—'

'ఎందుకని?—'

'ఎందుకేమిటి—వాళ్లిద్దరూ మొగుడూ పెళ్లాలుగా—మొగుడూ పెళ్లాలిద్దరికీ ఒకళ్లంటే ఒకళ్లకి ఇష్టం వుంటుందట—మా బామ్మ అస్తమానూ అదే గొణుక్కుంటూ వుంటుంది—'

'ఓహో!—అదా సంగతి!—అది సరే—అసలు అమ్మా, నాన్నా, మొగుడూ పెళ్లాలు ఎట్లా అయ్యారు?—'

'బాగుందిరా నీ ప్రశ్న—మొగుడూ పెళ్లాలవడం అంటే పెళ్లి చేసుకోవడం అన్నమాట—నిరుడు మా అక్కకు పెళ్లి అయింది కదా—అప్పటినించీ అక్కా, బావా, మొగుడూ పెళ్లాలయిపోయారు—మా అక్క ఇప్పుడు కడుపుతో వుందిగా!—దానికి ఓ కూతురు పుడితే నాక్కూడా ఓ పెళ్లాం దొరుకుతుందిట!—' గొప్పగా చెప్పాడు గోపీ—

గోపీమాటలు నాకు వినబడం లేదు—నా ఆలోచనలు ఎటో పని చేస్తున్నాయి. అమ్మకి నాన్నంటే అంత ఇష్టం వుండటానికి కారణం ఏమిటో అర్థం అయిపోయింది—

నాన్న అమ్మని పెళ్లి చేసుకున్నాడు కనుక!—

పోనీ—నాన్నబదులు నేనే అమ్మని పెళ్లి చేసుకుంటే...

ఈ ఆలోచన నాకు విచిత్రంగా తోచింది.


అమ్మని కనుక పెళ్లి చేసుకుంటే—అమ్మ నేను చెప్పినట్లల్లా వింటుంది. నేను రమ్మన్నప్పుడల్లా సినిమాలకు, పార్కుకు, వస్తుంది. నన్ను డాబామీద ఎత్తుకుని ఇంచక్కా గోరుముద్దలు తినిపిస్తుంది—ఎప్పుడూ నాదగ్గరే వుంటుంది—

ఈ వూహ నాకెంతో సంతృప్తి నిచ్చింది—

ప్రక్కరోజు రాత్రి పడుకొనేటప్పుడు అమ్మతో అన్నాను—'అమ్మా! నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను—' అని—

ఆమాటలు నేను అన్నానో లేదో అమ్మ పగలబడి నవ్వింది—ఎవర్ని, ఎప్పుడు, ఎక్కడ—ఇలాంటి ప్రశ్నలేవీ అడక్కుండానే నాన్నని పిలిచి—'చూశారా!—అప్పుడే మీకొడుక్కి పెళ్లికావలసి వచ్చిందట!—అన్నీ తండ్రి బుద్ధులే—వీడిగర్ల్ ఫ్రెండ్స్‌ని చూసి అనుమాన పడుతూనే వున్నాను—' అంది—

ఇంకా నవ్వుతూనే వుంది అమ్మ—



నాన్న అమ్మతో శృతి కలుపుతున్నాడు—

ఇంత చిన్న విషయానికి అంతగా ఎందుకు నవ్వాల్సి వస్తోందో అర్థం కాలేదు నాకు.

* * *

ఇలా వుండగా—నాన్నకు మాకు ప్రభుత్వం ఇచ్చిన సెలవు పూర్తయి పోయింది—బెంగుళూరులో నాన్నకు ఉద్యోగం అయిందట—అందరం వెళ్లిపోవాలట—అమ్మ చాలా హడావిడిగా వుంది—

ఈ వూరు విడిచి పెట్టాలంటే నాకు ఏడుపొస్తోంది—పల్లెటూరయితేనేం ఇక్కడ ఆడుకోడానికి బోలెడు తోటలున్నాయి—మైదానా లున్నాయి. ఇవన్నీ విడిచి పెట్టాలంటే మాటలా?—ఈ వూళ్లో అయితే నాకు ఆడుకోడానికి బోలెడు మంది స్నేహితులున్నారు—వాళ్లందరినీ విడిచి పెట్టి ఎలావుండగలను?—నాన్న పాకిస్తాన్‌లో ఖైదీ అయ్యాడని తెలిసిన తర్వాత అమ్మ ఈ వూరు వచ్చిందట—నాకు నాన్న వుద్యోగం సంగతిగానీ—మేం ఈ వూరు రావడంగానీ ఏమీ తెలియవు—అప్పటికి నేను నెలల పసివాణ్ణిట—

ఏది ఏమయినా—నాకు ఈ వూరంటే ప్రాణం—

మనం నాన్నతోబాటు వెళ్లొద్దని చెబుదామనుకున్నానుగానీ అమ్మ నామాట వినే పరిస్థితిలో లేదని తెలిసి వూరుకున్నాను—ఏ వూరయితే నాకేం?—

* * *

బెంగుళూరు వచ్చిన తర్వాత నా పరిస్థితి మరింత చికాకుగా తయారయింది—మిలటరీ స్టాఫ్ క్వార్టర్స్‌లో అందరు మిలిటరీవాళ్ల మధ్య వుండటం చాలా కొత్తగావుంది—నాన్నకూడా ఇదివరకటిలాగా మామూలు బట్టలు వేసుకోకుండా ప్రతిరోజూ యూనిఫారమ్ వేసుకుంటున్నాడు—యూనిఫారములో వున్న నాన్నను చూస్తే నాకు ఆశ్చర్యం వేసేది—ఈ యూనిఫారములో నాన్న మీసాలు బాగున్నాయని ఒకటి రెండుసార్లు అనుకున్నాను కూడా—

ఇక్కడికి వచ్చిన తర్వాత నాన్న ఇదివరకటిలాగా ఎక్కువసేపు ఇంట్లో వుండటం లేదు—ఎప్పుడో ప్రొద్దుగూకిన తర్వాత వచ్చి మళ్లీ ప్రొద్దున్నే వెళ్లి

పోయేవాడు—అందుచేత అమ్మతో మాట్లా డేందుకు ఎక్కువ అవకాశం కలిగేది— ఇది నాకు ఎంతో ఆనందాన్ని కలిగిం చింది—

ఇలా కొన్నాళ్ళయిన తర్వాత ఓ రోజు అమ్మ నాతో అంది—

'ఏరా — నీకు తమ్ముడు కావాలా చెల్లెలు కావాలా?—' అని. అప్పుడు అర్థమైంది నాకు ఇంట్లోకి ఇంకో మనిషి రాబోతున్నాడని. ఇది జరిగిన కొన్నాళ్ళకు కాబోలు ఓ రోజున నాన్న హడావిడిగా టాక్సీలో వచ్చి అమ్మను డాక్టర్ దగ్గిరకు తీసుకు వెళ్ళాడు — అప్పుడు అమ్మతోబాటు నేను కూడా వున్నాను కానీ— వాళ్ళు మాట్లాడుకునే దేమిటో అర్థం కాలేదు—నాకు ఇంగ్లీష్ వచ్చునుగానీ — వాళ్ళు మాట్లాడుకునే ఇంగ్లీష్ బొత్తిగా బోధపడలేదు — కాస్త యినా తెలుగులో మాట్లాడకూడదూ!—

ఆ ప్రక్కరోజున నాన్న అమ్మని ఆస్పత్రిలో జాయిన్ చేయించాడు — హాస్పిటల్లో అమ్మని చూసి ఏడ్చాను నేను —'నేను కూడా నీతోబాటు ఇక్కడే వుంటాను—' అన్నాను —

"ఉష్ !— తప్పు !— నువ్వెందుకూ ఇక్కడ!— ఇంచక్కా ఇంటిదగ్గిర నాన్న గారితో వుండు—'

'మరి నువ్వు ఇక్కడ ఒక్కర్తివే వుంటావు కదా భయం వెయ్యదూ!—' అన్నాను.

'నాకెందుకూ భయం? — ఇక్కడ బోలెడుమంది డాక్టర్లు, నర్సులు, వున్నా రుగా—' అంది అమ్మ—

'మరి నాకు భయం వేస్తోంది—' అన్నాను ఏడుస్తూ—

'నీకేమీ భయం లేదు — నాన్న ఎన్నో మంచి కథలు చెబుతారు. నీకు రోజూ చాక్లెట్లుకొని యిస్తారు—'

అప్పుడన్నట్లు నాన్న నన్ను దగ్గిరకు తీసుకున్నాడు—అమ్మ వున్నప్పుడే నాన్న దగ్గిర వుండటం భయం నాకు — ఇక యిప్పుడు చెప్పాలా? — అయినా నాకు ముందునించీ తెలుసు— నాన్న యిలాంటి అఘాయిత్యం చేస్తాడని — ఈ నాన్న వల్లే అమ్మకు ఈ జబ్బుచేసి వుంటుంది. ఇదివరకెప్పుడయినా యింత జబ్బు చేసిందా—?

ఇప్పుడు అమ్మకి జబ్బు చేస్తే తమ్ముడు ఎలా వుడతాడు?—

వాడితో నేను ఎలా ఆడుకోగలను?— నా ఆలోచనతో సంబంధం లేదన్నట్టు నాన్న నన్ను బరబరా లక్కుపోతున్నాడు— రానని గోలపెట్టి అల్లరి చేద్దామని పించింది—కాని— ధైర్యం చాలలేదు — ఏడిస్తే బాగుండదని కన్నీళ్ళు తుడుచు కుని నడుస్తున్నాను— హాస్పిటల్ లోంచి బయటకు వచ్చిన తర్వాత నాన్న నన్ను కారులో కూలేసి ఓ పెద్ద హోటల్ దగ్గిరకు తీసికెళ్ళాడు—

ఇక్కడ నన్ను వదిలి పెట్టేసి వెళ్ళి పోడు కదా అని భయపడ్డాను — కాని, అలా చెయ్యలేదు—

నన్ను టేబుల్ దగ్గిరకు తీసికెళ్ళి అక్కడున్న సర్వర్‌ని రెండు ఐస్‌క్రీములు తెమ్మన్నాడు— 'ఐస్‌క్రీం' అనే మాట వినగానే నాకెంతో సంతోషమైంది— ఫర్వాలేదు— మంచివాడేనే అని అను కున్నాను—ఒక ఐస్‌క్రీమ్ తిన్న తర్వాత మరొకటి తింటావా అని అడిగాడు — ముందు 'అలాగే' అందామనుకున్నాను గానీ— ఆ తర్వాత ఒద్దన్నాను— అ మాత్రం బెట్టు చెయ్యాలి—

ఆ తర్వాత నన్ను సినిమాకు తీసి కెళ్ళాడు—సినిమా జరుగుతున్నంత సేపూ నాకేవో కబుర్లు చెప్పి నవ్విద్దామని చూస్తున్నాడు—నాకు నిజంగానే నవ్వొ స్తోంది — నాన్న నేను అనుకున్నంత దురాత్ముడు కాడు—సరదాగానే కబుర్లు చెబుతాడు—

ఆ రాత్రి పడుకునే ముందు — నాన్న నా కెన్నో కథలు చెప్పాడు—మిలిటరీలో సైనికులు ఎంత ధైర్యంగా వుండాలో చెప్పాడు— రెండో ప్రపంచ యుద్ధం గురించి చెప్పాడు — అత్యాశకు పోయిన హిట్లర్ అంటే నాకు అసహ్యం వేసింది—


ఆ రోజేకాదు — ప్రతిరోజూ నాన్న అలాంటి కథలే చెబుతూండేవాడు — ఆ కథలంటే నాకెంతో ఇష్టం — క్రమ క్రమంగా ఆ కథలు చెప్పే నాన్న మీద కూడా ఇష్టం కలిగింది—ప్రతి రోజూ గుప్పెడు చాక్లెట్లు తెచ్చి నాకిచ్చే నాన్నంటే నాకెందుకు ఇష్టం వుండదు?—

నాన్న నన్ను సరిగా చూడటం లేదని— నన్ను కొడుతున్నాడని —ఎన్నో సార్లు అమ్మతో చెబుదామనుకున్నాను—కాని— ఒక్కటీ చెప్పలేక పోయాను—

కొంపదీసి నేనూ నాన్నా స్నేహితులం అయిపోవటం లేదుకద!

ఊహూఁ!—ఎప్పటికీ కాకూడదు — నాన్నతో స్నేహం చెయ్యకూడదు—

అలా అని నాన్నతో విరోధం తెచ్చుకో డానికి వీలులేదు—ఎందుకంటే అమ్మ ఇంట్లో లేదు కదా!—అందుచేత నాన్న చెప్పే, కథలన్నిటిని వింటున్నట్టు నటించేవాణ్ణి మొదట — కాసేపయిన తర్వాత ఆ కథలు చెబుతున్నది ఎవరో మరచిపోయి చాలా కుతూహలంగా వినే వాణ్ణి—నాకు కథలంటే వున్న సరదా



నువ్వంటేనే నాకిష్టం!

అలాంటిది?— ఏం చెయ్యను మరి?— ఈ కథలతో నాన్న నన్ను అమ్మను వేసుకున్నట్టుగా ఎత్తేసుకోవటం లేదు కదా!—

ప్రతిరోజూ నన్ను తన్ను తన పక్కలో పడుకోమనేవాడు—కాని—నేను మాత్రం వేరే పక్కలో పడుకునేవాణ్ణి—పక్కలో పడుకుంటే...హమ్మో!— ఇంకేమన్నా వుందా!!—

ఇలా వుండగా—వో రోజున నాకు భయంకరమైన కల వచ్చింది — అది పీడకల అని తర్వాత తెలిసిందనుకోండి —వో పెద్ద భూతం నా గదిలోకి వచ్చి నన్ను అప్పడంలాగా నమిలేస్తోందట!— నేను భయస్తుణ్ణి కాదు గానీ—ఎందుకో—ఒక్కసారి కేక పెట్టాను—వళ్ళంతా చెమటలు పట్టేశాయి—

నా గోల విని నాన్న లేచాడు—

'ఏరా—పీడకల వచ్చిందా?—' అన్నాడు.

బెదురుగా తల వూపాను—

'అందుకే నా పక్కలో పడుకోమన్నాను —పెద్ద హీరోలాగ వేరే పక్కలో పడుకున్నావు—' అంటూ నన్ను తన పక్కలోకి పిలిచాడు—ఆప్యాయంగా నా వంటి మీద చెయ్యివేశాడు—భయంతో నాన్నని కౌగలించుకున్నాను నేను—నాన్నని కౌగలించుకుంటే వెచ్చగా వుంది—అమ్మపక్కన పడుకున్నట్టే వుంది — నాన్న కూడా మంచి వాడనే అనుకున్నాను—

ఆరోజు మొదలు నాన్న పక్కలోనే పడుకునే వాణ్ణి — నా వంటిమీద నాన్న చెయ్యి వేస్తేనే గాని నాకు నిద్రపట్టేది కాదు—అలా నేనూ, నాన్నా, స్నేహితులం అయిపోయాం—

అలాంటప్పుడు తమ్ముడితో అమ్మ ఇంట్లోకి వచ్చింది—తమ్ముడు పుట్టాడని నాకు చాలా సంతోషంగా వుంది— కాని—వాడు ఏడుపిశాచి—ఎప్పుడూ ఏడుస్తూనే వుండేవాడు—తను నిద్రపోయే వాడు కాదు — మమ్మల్ని నిద్రపోనిచ్చే వాడు కాదు—

వాడు అంత గోల పెడుతున్నా సరే— అమ్మ వాణ్ణి ఏమీ అనేది కాదు—నాకోసం కాకపోయినా—కనీసం నాన్నకోసమయినా వాణ్ణి కోప్పడవచ్చు కదా!—

తమ్ముడు వచ్చాక—అమ్మకు నామాట సరేసరి—నాన్నమాట కూడా లక్ష్యం లేకుండా పోయింది—నాన్న ఎంతగా అడిగినా సరే సినిమాలకు, షికార్లకు, వచ్చేది కాదు—ప్రతీదానికీ,

'బాబుకు ఇది పడదు—'

'బాబుకు ఆలస్యం అవుతుంది—'

'ఉశ్!—బాబు లేచిపోతాడు—'

ఇలా అంటూ వుంటుంది—పాపం నాన్న మంచివాడుగా మరి!—అందుచేత ఏమీ అనేవాడు కాదు—నాకు మాత్రం అమ్మమీద కోపం వచ్చేది — నాన్నతుపాకీ తీసుకుని 'ఢాం' 'ఢాం' అని పేల్చేద్దామనిపించింది—,

అందుకనే నేను అన్నమాట నాన్నతోనే వుండే వాణ్ణి—స్కూలు నించి రాగనే నాన్నకోసం ఎదురు చూస్తూ కూర్చునే వాణ్ణి—నాన్న ఎంత మంచివాడని— నాకు ఎన్ని బొమ్మలు కొనిపెట్టాడో— నన్ను ఎన్ని సినిమాలకు తీసికెళ్ళాడో మీకేం తెలుసు? — నాన్న కొనే బొమ్మలన్నీ నాకే! — ఒక్కటి కీ అమ్మకీ, తమ్ముడికీ, ఇచ్చేది లేదు— ఎందుకివ్వాలి?—

* * *

ఆ రోజులు తలుచుకుంటూ వుంటే నాకు నవ్వొస్తూ వుంటుంది. ఇప్పుడు తమ్ముడు కూడా పెద్దవాడయ్యాడు. వాడిప్పుడు నాలాగా నడవగలుగుతున్నాడు — కోపం వస్తే కరుస్తాడన్నమాటేగాని, మిగతా బుద్ధులన్నీ మంచివే — అందుకే నాకు వాడిమీద కూడా కోపం పోయింది. ఇంక అమ్మ సంగతి సరేసరి—అమ్మమీద నాకు ఎప్పుడూ కోపం లేదన్న సంగతి మీకు తెలిసిందే!—

ఇప్పటికే మీతో చాలాసేపు మాట్లాడాను—నాకోసం నాన్న ఎదురు చూస్తూ వుంటారు వెళ్ళాలి—ఇప్పటికయినా అమ్మ సినిమాకు బయలుదేరిందో లేదో — తమ్ముడు వో పట్టాన తల దువ్వించుకోడు కదా!— అందుకే నాకు వాడంటే కోపం!— ●

హైందవులకు వేదాలు పరమ ప్రమాణాలు అనాదినుంచీ వాటిని గురుముఖతః — గురువు ఉచ్చరించిన విధంగానే ఉచ్చరిస్తూ — నేర్చుకోవడం జరుగుతున్నది. ఇతర గ్రంథాల వలెనే వ్రాత పుస్తకాలనుగాని అచ్చుపుస్తకాలను గాని చదువుకొని నేర్చుకోవడం కుదరదు. ఒకవేళ కొందరు విద్యార్థులు వేదభాగాలు ముద్రించిన పుస్తకములను చేతిలో వుంచుకొన్నప్పటికీ — అవి పాఠక్రమం కదలిపోకుండా చూచుకొనుటకు మాత్రమే ఉపయోగిస్తాయి.

వేదాధ్యయనంగా ఈవిధం జరగడానికి కారణం వేదాలను సస్వరంగా ఉచ్చరించవలసి ఉండడమే!

స్వరం ప్రధానంగా ఉండేవాటిని — పుస్తకాలుచూచి నేర్చుకోవడం సాధ్యం కాదు. సంగీతాన్ని గురించిన పుస్తకాలు — సరళీస్వరాలు మొదలుకొని సమగ్రంగా వివరించేవి — చాలా ఉన్నవి. గురువువల్ల నేర్చుకోకుండా — ఆ పుస్తకాలు చూసుకుంటూ — సరిగమ పదనిస — అని అనుకుంటే సంగీతం రాదు. వేదాలూ అటువంటివే!

ఏమతంలోనైనా సరే — పరమ పవిత్రాలయిన గ్రంథాలను ఉచ్చరించడానికి ప్రత్యేకంగా స్వరాలు ఉంటాయి. బైబిలు నుంచి భాగాలు చదివే క్రైస్తవులూ, ఖురానుచదివే ముస్లిములూ కూడా ప్రత్యేక పద్ధతులలోనే వాటిని ఉచ్చరిస్తారు.

వేదాలను ఉచ్చరించడంలో ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం అని మూడు స్వరాలున్నవి. ఆ స్వరా లెక్కడెక్కడ ఉచ్చరించాలో గురువు ఉచ్చరించినదాన్ని బట్టి తెలుసుకోవాలేగాని పుస్తకాల్లో అక్షరాలపైనీ, క్రిందాఉంచే గీతలను బట్టి గ్రహించలేము. ఒక స్వరానికి బదులు ఒక స్వరాన్ని ఉచ్చరించినా — ఒకచోట ఉండవలసిన దాన్ని మరొకచోట ఉంచి ఉచ్చరించినా వేదమంత్రం తారుమారై పోతుంది. అర్థంకూడా మారిపోతుంది. తప్పుస్వరాలతో ఉచ్చరించి హోమాలుచేస్తే ఫలం లేక పోవడం అటుండగా — విపరీత ఫలం కలుగుతుంది. అందువల్లనే ఎంతో శ్రద్ధంగా వాటిని

ధర్మపథం:




ఉచ్చరించాలి.

వృత్రాసురుడు ఇంద్రునికి విరోధి. గొప్ప బలవంతుడు. అతడు యుద్ధంలో దేవతలను వోడించి స్వర్గంనుంచి తరుమగొట్టి నానావిధాలా బాధించాడు. తన ఆధిపత్యం స్వర్గంలో స్థిరంగా ఉండడానికి యజ్ఞయాగాదులుకూడా చేశాడు.

వృత్రుడు గొప్ప యాగం తలపెట్టి దానిని నిర్వహించడానికి మునులను యాజకులుగా నియమించాడు. వారు ఇంద్రునిపై అభిమానం వున్నవారు. ఆ రాక్షస రాజువల్ల భయంకొద్దీ అతని యాగాన్ని నిర్వహించడానికి పూనుకున్నారు.

పూనుకున్నా, అది వృత్రాసురునికి అనుకూలమైన ఫలితాన్ని ఇవ్వకూడదనే వారి సంకల్పం. మంత్రాల స్వరాలు భేదిస్తే ఫలితం తారుమారవుతుందని వారికి తెలియదా? 'ఇంద్ర శత్రుర్వర్ధస్వ' అంటూ హోమం చేశారు. ఇంద్ర శత్రుపదానికి రెండర్థాలు తీసుకోవచ్చును. ఒకరీతి స్వరంతో ఉచ్చరిస్తే ఇంద్రుడి శత్రువులని అర్థం వస్తుంది. స్వరం మారిస్తే ఇంద్రుడు శిక్షకుడుగా కలవాడనే అర్థంవస్తుంది. ఈ రెండవ అర్థం ఇంద్రునికే అనుకూల మయినది. ఈ విధంగా స్వరంమారి వేరే అర్థం రావడంవల్లనే ఇంద్రుడు వృత్రుణ్ని యుద్ధంలో వోడించి చంపడం జరిగింది.

ఉచ్చరించే పదాలు మార్పులేక ఉన్నప్పటికీ స్వరాలు వ్యత్యస్తం కావడంవల్ల అర్థాలు మారిపోతాయి కాబట్టి — వేదాలకు స్వరమే మిక్కిలి ప్రధానమని తెలుసుకోవలసి ఉన్నది. ●



మేఘమాల

పి. ఎస్. నారాయణ

జరిగిన కథ

త్యాగరాజుకు పాటలు రావు. వినడంలోనూ అంత ఆసక్తి లేదు. నారాయణ అతన్ని ఒక కచేరీకి తీసుకు వెళ్లాడు. నారాయణ సంగీతాన్ని ఆస్వాదిస్తుంటే త్యాగరాజుకి విసుగ్గా వుంది. చలపతితో కలిసి బయటికి వెళ్లిపోయాడు. రాణి సుందరమూర్తితో లేచి పోయిందని చలపతి చెప్పినప్పుడు త్యాగరాజు నిర్ఘాంతపోయాడు. అతను హైద్రాబాదు వెళ్లాడు. తనపై శకుంతలకున్న అభిప్రాయం తెలిసిపోయాక ఇక ఆమె యింట్లో వుండటం అతనికి మనస్కరించలేదు. ఉద్యోగాన్వేషణతో వూరిమీద పడ్డాడు. అతనికి రాజేశ్వరి కనిపించింది. ఇద్దరూ కలిసి అద్దెకి ఒకే యిల్లు తీసుకున్నారు. హాస్పిటల్‌లో వున్న స్నేహితుడు చంద్రం గురించే అతనికి ఎక్కువ ఆలోచన పట్టుకున్నది. రోజూ హాస్పిటలుకు వెళ్లి చూసి వస్తున్నాడు. కాని, చంద్రం వచ్చిపోయాడు. ఆ దిగులుతో కృంగిపోయాడు త్యాగరాజు.

11

పదకొండు గంటలయింది.

రాజేశ్వరి పడుకున్న త్యాగరాజుకు పక్కగా బెడ్డింగ్‌మీద కూర్చున్నది.

సత్యవతి నిద్రలో మునిగిపోయింది.

'శకుంతల కెలా వున్నది?'

'బొబ్బలింకా తగ్గలేదు!'

'ఇంకా ఎన్నాళ్లు పడుతుందంటున్నారు?'

'చెప్పలేం... ఆసుపత్రిలో ఇంకా పది రోజులైనా వుండవలసి వస్తుందేమో?' ఒక్కక్షణం ఆగాడు. 'ఇంటికి వెళతానని గోల చేస్తోంది...ఏమాత్రం తగ్గినా ఇంటి దగ్గరవుండి మందు తీసుకుంటానంటున్నది!'

'పాపం!'...ఆ బాధ భరించటం చాలా కష్టం ... ఏలా భరిస్తున్నదోగాని!' నిట్టూర్పు విడిచింది రాజేశ్వరి.

'ఏం చేస్తుంది, మరి?'

కొన్ని నిముషాల మౌనం నల్లటి మేఘంలా ఆవరించుకున్నది ఆ ప్రదేశాన్ని.

'నాకు ఏమీ తోచటంలేదు!' అన్నది రాజేశ్వరి.

'ఏ విషయంలో?'

'—సత్యవతిని చూస్తుంటే!'

త్యాగరాజు మాట్లాడలేక పోయాడు.

'సత్యవతి ఎప్పటికి కోలుకునేను?'

త్యాగరాజు నిట్టూర్పు విడిచాడు.

'ఏం చెయ్యాలో నాకూ తోచటంలేదు... ఆమెను ఓదార్చేశక్తి నాకు లేకుండా పోతున్నది!' అన్నాడు బరువుగా.

మాళ్లా మాట్లాడుకోవటానికి మాటలే లేకపోయినయి.

'ఇంకా నేనెన్నాళ్లుండే దిక్కడ?' కంఠంలో భయం తొంగిచూస్తోంది.

రాజేశ్వరి మాటలకు ఉలిక్కిపడ్డాడు త్యాగరాజు.

'ఏమంటున్నావ్?'

'ఎన్నాళ్లిలా ఇక్కడ వుండమంటారు, నన్ను?' దిగులుగా అడిగింది.

'నేను నిన్న వచ్చిన ఉద్యోగంలో జేరదామనుకుంటున్నాను!' అన్నాడు త్యాగరాజు.

నిన్ననే వో కంపెనినుండి—హైద్రాబాదు వచ్చిన కొత్తల్లో, శకుంతల గృహంలో వుండగా అప్లై చేసిన వో ఉద్యోగానికి — జేరమంటూ ఆర్డర్లు వచ్చినయి!

'మీగురించిగాదు నేనడిగేది!'

'—నేనిక్కడవుంటే నీవక్కడ వుండవా మరి?' అన్నాడు ఆమె చేతిమీద వేలితో రాస్తూ.

రాజేశ్వరి నిట్టూర్పు విడిచింది.

'నాకు తెలుసు నీలోని బాధ, రాజేశ్వరీ!...కాని వోర్చుకోక తప్పదు... ఏంచేస్తాం...పరిస్థితులు మన అదుపులో లేనప్పుడు!' అన్నాడు నిట్టూరుస్తూ త్యాగరాజు.

'నీవూ ట్రాన్స్‌ఫర్‌కు అప్లైచేయి ...భర్త ఎక్కడవుంటే భార్యనూ సాధ్యమయినంతవరకూ అక్కడే వుంచాలనేది ప్రభుత్వ నిర్ణయంగదా!' ఆమె మోచేతి మీదగ చేత్తో గట్టిగా పట్టుకున్నాడు.

రాజేశ్వరిని ఆ క్షణంలో సిగ్గు ఆవరించగా, ప్రేమగా త్యాగరాజు ముఖంలోకి చూస్తూ చాలా సన్నగా, మధురంగా నవ్వింది.

'నేనన్నది అబద్ధమా?'

'నేను మీ కంటె తెలివిగల దాన్ననా— మీరు అవునన్నది కాదనేందుకు!'

ఆమె మాటలకు కొన్ని క్షణాలు నవ్వుకుంటూ మనస్సులో మననం చేసుకుంటూ ఆగి, 'మీ అమ్మ చెల్లెలూ మాత్రం అక్కడ దేనికి? ... ఇక్కడకు రమ్మనమని జాబు వ్రాశేయ్!' అన్నాడు.

'ఇది మీ నిశ్చితాభిప్రాయమా?'

'—ఇంతకు మించి మార్చుకోవాల్సిన అవసరం మాత్రం ఏమున్నది?'

'అవసరమంటూ ఏమీలేదు — కాని, నిర్ణయం తీసుకునేముందు అన్నీ ఆలోచించుకోవటం మంచిదనుకుం

టున్నాను !...

'నిజమే మరి ... అయినా, వాళ్లు ఇక్కడ వుండటంలో నష్టమేంవున్నది? మనకు హైద్రాబాద్‌లో డబ్బులు చాలవనే భయం ఏమీ లేదుగదా ?—ఇద్దరం సంపాదిస్తున్నామాయె !' నవ్వాడు త్యాగరాజు

రాజేశ్వరి మాట్లాడలేదు చిరుదరహాసం చేసి ఊరుకున్నది.

'నాకు తిరిగి మన ఊళ్లో కాలు పెట్టాలంటే తెలియని భయం ఆవరించి నన్ను పీకుతోంది...నరాలు జివున్నా లాగుతున్నాయి ... ఏదో అగాధంలోకి కూరుకుపోతున్నా నన్నట్టుగా గుండె దడ దడలాడుతుంది !' అన్నాడు చాలా చిన్నగా, బరువుగా.

'నేను మిమ్మల్ని అక్కడకు రమ్మన మనలేండి!' అన్నది చీరె అంచుని మెలి తిప్పుకుంటు.

'మీ చెల్లెలు పైపు పాసవుగానే ఇక్కడే ఏదో ఉద్యోగంలో చేరుద్దాం !' అన్నాడు ఆమె మనస్సును తేలిక పరుద్దామన్నట్టుగా.

'కాని, వివాహం చేద్దాం అన్నట్లయితే మరింతగా సంతోషించి వుండేదాన్ని !' అన్నది నవ్వి.

ఆమె మాటలకు లజ్జితుడయ్యాడు త్యాగరాజు

కొంతసేపు ఆగి, 'వివాహానికి టైప్ క్వాలిఫికేషనా ?' తేలిగ్గా తీసుకుంటున్నట్టుగా నవ్వాడు

రాజేశ్వరి నవ్వింది

క్షణంలో గంభీరుడవుతూ, 'నేను మాత్రం సంతోషించిననా నీ ఉద్దేశ్యం!' అన్నాడు.

'మీకంటే ఎక్కువగా నేను సంతోషిస్తానేమో?' అన్నది రెట్టిస్తున్నట్టుగా రాజేశ్వరి.

'నేను కాదనను !' అన్నాడు ఆమె మాటలకు అంగీకరిస్తున్నట్టుగా.

గుర్ఖా రోడ్డుమీద కర్రతో టకటకా కొట్టుకుంటూ వెళుతున్నాడు.

'పదకొండు గంటలయిందేవో?'

'అయివుండవచ్చు!' అన్నది రాజేశ్వరి

'నిద్ర రావటంలేదా?'

'ఈరోజు పగలు ఎక్కువసేపు పడుకున్నాను!'



త్యాగరాజు మాట్లాడలేదు.

ఆమె ముఖంలోకి, కిటికీనుండి లోపల పడుతున్న సన్నని వెలుగులో చూడ సాగాడు.

—ఏదేకంగా ఆమె ముఖాకృతిని కళ్ళల్లో కట్టుకుంటూ లీనమై పోతున్నాడు. ఆ క్షణంలో ఆ కొద్ది వెలుగే మరింత పెద్దదై, మరింత పెద్దదై దేదీప్యమానంగా వెలుగుతున్నట్లనిపించింది. అందులో — ఆ వెలుగులో— ఓ దేవతలా, శాంతమూర్తిలా, ఓ నిశ్శబ్ద ఆశ్రమంలా రాజేశ్వరి కనబడుతోంది — ఆమెను అలా చూస్తుంటే మనస్సును శాంతి, శరీరాన్ని చల్లదనమూ ఆవరించి— సర్వం మరిచిపోయి — ఆనందంలోనో, స్వర్గంలోనో తిరుగుతున్నట్లుగా వేస్తోంది.

ఎందుకో ఆ క్షణంలో కనబడినట్లుగా రాజేశ్వరి తన జీవితంలో ఇది వరకెన్నడూ కనబడలేదు!

'రాజా!' అన్నాడు కొద్దిగా మోచేతుల మీదుగా లేవబోతూ—ఆమె ముఖాన్ని దగ్గరగా జేరుస్తూ.

'రాజేశ్వరీ!' అన్నాడు పెదాలు కదిలిస్తూ గొణుగుతున్నట్లుగా.

ఆమె చెయి అతని పిడికిలిలో బిగుసుకు పోయింది.

'రాజా!'

'ఏమిటిది?' అన్నది. కళ్ళు రెపరెప లాడిస్తూ ఆవేశపడుతున్న అతడిని భయంగా చూస్తూ. 'నన్ను వెళ్ళమంటారా?'

త్యాగరాజు తననితాను అదుపులోకి తెచ్చుకున్నాడు. మామూలుగా పడుకున్నాడు.

తెచ్చుకున్న ఆవేశానికి సిగ్గుపడుతున్నట్లుగా, కళ్ళు మూసుకొని తల ఊగిస్తూ, 'వద్దు వద్దు!' అన్నాడు. 'నీవు ఎదురుగా కూర్చుంటేనే నాకు తృప్తి, శాంతి!' అన్నాడు ఎంతో ఆత్మీయంగా.

—హృదయం అట్టడుగు నుండి వెలువడినయి ఆ మాటలు!

'మీరు సాగర్ ఎప్పుడు వెళుతున్నారు?'

'రెండు మూడు రోజుల్లో వెళ్దామనుకుంటున్నాము!'

'సామాన్లు అంతగా లేవన్నది ... మీ వెంటే పట్టుకు వచ్చేశేయండి!'

'ఆలాగే!'

—తిరిగి చంద్రం త్యాగరాజు కళ్ళ ముందు మెదిలాడు.

మనస్సంతా చీకటయింది. వేదన స్ఫురించింది. దిగులు ఆవహించింది. విచలితుడయ్యాడు.

'రాజా! ... ఒక్కటడుగుతాను చెబుతావా ... సమాధానం మనస్ఫూర్తిగా చెప్పాలి!'

'అడగండి!'

'సత్యవతి మనదగ్గర వుండటం వలన నీకేమి అభ్యంతరం లేదుగదా ?'

'మీరు అలా ఎందుకనుకోవాల్సి వచ్చింది ?' అన్నది చాలా త్వరత్వరగా.

'లేదు...ఆవేశపడబోకు...నీ ఉద్దేశ్యం తెల్సుకోవడం నాకు ఎంతో అవసరం... మనిద్దరికీ మంచిదిగూడా ... తరువాత మనకెవ్వడు—జరిగిపోయిన విషయంమీద ఏలాంటి భిన్నాభిప్రాయాలూ రాగూడదు !' అన్నాడు ఆమెకు నచ్చ జెబుతున్నట్లుగా. 'ఈ ఒక్క విషయంలోనేగాదు...ఏవిషయంలోనైనా సరే !'

రాజేశ్వరి తల అటూ యిటూ ఊగిస్తూ, 'కృతజ్ఞురాలిని !' అన్నది.

'కృతజ్ఞతలు దేనికి ?'

'నామాటకు, నా మనస్సుకు ఎంతో విలువ ఇస్తున్నందుకు !

'దానిలో ప్రత్యేకతఏంవున్నది!...బండికున్న రెండు చక్రాలూ సమానమైనవే ...నీవు నన్ను గౌరవించడం లేదా ?' అడిగాడు.

'ఇక పోనీయండి ఆ విషయం...ఆమె మనదగ్గర వుండటాన్ని నేను హృదయపూర్వకంగా ఆమోదిస్తున్నాను !'

'నా కృతజ్ఞతలు స్వీకరిస్తావా మరి !

దెబ్బకొట్టారన్నట్లుగా చూస్తూ నవ్వింది.

'ఇక నేను వెళ్ళిపడుకుంటాను బాబూ, నిద్ర వస్తున్నది!' అన్నది లేచి నిలబడుతూ—ఏదో బరువైన వాతావరణాన్ని తేలిక పరుస్తున్నట్లుగా !

'నేను ఇందాకటినుండి పట్టుకు ఆపానా !' అన్నాడు విచిత్రంగా ఆమె ముఖంలోకి చూస్తూ.

'ఏంవిటి, నాతో వాదన పెట్టుకోవడం సరదాగా వున్నదా మీకు ?— ప్రతిదానికీ మరో అర్థం తీస్తున్నారు !'


'వెళ్ళి పడుకో !' అన్నాడు భారంగా త్యాగరాజు.

*   *   *

రాత్రి పన్నెండుగంటలు దాటినా త్యాగరాజుకు నిద్రపట్టలేదు. అటూ యిటూ కదులుతునే వున్నాడు.

ఉండి ఉండి రోడ్డుమీద పోతున్న కార్లూ, రిక్షాల మోత—

ఎక్కడో అకస్మాత్తుగా ఒక్క సారి



కుక్క ఆరుపు:

ఊరికినే తిన్నగా పొర్లుతున్నాడు.

ఏవేవో కుడుతున్నాయి.

ఏమయిందీ తెలియటంలేదు — అవి ఎక్కడా వున్నట్లు కనబడటంలేదు.

ఒక్కొక్కసారి అవేవీ కావు అనిపిస్తోంది!

—మనసులో తెలియని తపన!

నిద్ర పట్టటంలేదు.

దుప్పటిని నిలువెల్లా బిగించుకొని; బలవంతాన కళ్ళుమూసుకు పడుకున్నాడు.

—పిచ్చి పిచ్చి ఆలోచనలు...

ఆ ఆలోచనల పడును ... లేచిపోయిన రాణి...ప్రమాదంలో అందవిహీన అయిన శకుంతల ... ఒక కన్ను పోగొట్టుకున్న స్వామి...చచ్చిపోయిన చంద్రం...సర్వం కోల్పోయిన సత్యవతి—కళ్ళముందు గిర గిర తిరుగుతున్నారు!

అలా ఎంతసేపయిందో అతడికి తెలియదు.

మనిషి కదిలిన చప్పుడయింది!

'—రాజేశ్వరి లేచింది గబోలు!' అనుకున్నాడు. తలెత్తి చూద్దామనిపించి గూడా బద్ధకంగా అలాగే కదలకుండా పడుకున్నాడు.

వంటయింట్లో లైటువేసిన చప్పుడు.

'రాజేశ్వరీ! కాసిని మంచినీళ్ళు పట్టుకురా!' అందామనుకొని గూడా, పెద్దగా ఇంతదూరంనుండి అరవటం దేనికి, దగ్గరకువచ్చిన తరువాత చిన్నగా చెబుదాంలే అనుకున్నాడు.

—ఆమె రాకకోసరం ఎదురుచూడ సాగాడు.

నిజంగా రాజేశ్వరి అనుకోకుండా చాలా ఇరకాటంలో పడిపోయింది...

అక్కడ తను ఊళ్ళో చెడ్డ పేరు తెచ్చుకుంటోంది.

ఇక్కడ పరిస్థితులూ అనుకూలించటం లేదు...

—అవును! తల్లి బాధపడటంలో ఏలాంటి అసహజత్వమూ లేదు!

'పెళ్ళికాని ఆమె ఇలా ఊళ్ళు పట్టుకొని తిరుగుతూ పరాయి మనుష్యులదగ్గర ఉంటే ఎవరైనా అలాగే అనుకుంటారు!

కాని, తమ పవిత్రత వారికెలా తెలు

ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా "ప్రశ్నావళి,' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

మేఘమాల

స్తుంది?

నిజం!

ఇంకా రాజేశ్వరి వంటయింట్లోంచి రాలేదు.

—అక్కడ లైటుగూడా ఆర్పినట్లు లేదు!

'ఏం చేస్తున్నదబ్బా!' అనుకుంటూ నిండా కప్పుకున్న దుప్పటిని తొలగించి ఆ వంట గదివైపుకు చూచాడు.

లోపల లైటు వెలుగుతుండగా, తలుపు దగ్గరకు వేసి వున్నది...

తల పక్కకు తిప్పి ఆమె పడుకున్న చాప వైపుకు చూచాడు.

అతడి ఆశ్చర్యానికి అంతులేదు.

రాజేశ్వరి అక్కడే వున్నది!

సత్యవతి చాప వెక్కిరిస్తున్నట్లుగా ఖాళీగా కనబడింది.

విచిత్రంగా ఆ వైపుకు చూస్తూ లేచి కూర్చున్నాడు.

వంటయింటిలోనుండి ఏదో సన్నని శబ్దం...డబ్బాలు కదిలిస్తున్నట్లు... దేనికోసరమో వెతుకుతున్నట్లు...

అర్థం కాలేదు!

—సత్యవతి ఏంచేస్తున్నది లోపల?

త్యాగరాజును ఏదో అనుమానం ఆవరించగా భయంతో ఊగిపోయాడు.

ఇక తాత్సారం చేయటానికి వీల్లేదన్నట్లుగా, కాళ్ళు తడబడుతుండగా లేచాడు.

రాజేశ్వరిని లేపటానికా అన్నట్లుగా అటువైపు అడుగులు వేశాడుగాని, మరల మనస్సు మార్చుకున్నట్లుగా వంటయింటి వైపే వడివడిగా అడుగులు వేశాడు.

—మరే ఆలోచనా లేకుండా బిగుసుకుపోయి, భయంకరమైన ఆలోచనలకు మత్తును కలిపి త్రాగుతూ, దగ్గరకు వేసివున్న తలుపులను ఒక్క ఉదుటున లోపలికి నెట్టాడు...

అక్కడి దృశ్యాన్ని చూస్తూనే అప్రతిభుడయ్యాడు త్యాగరాజు.

'సత్యవతీ!' పెద్దగా, పిచ్చిగా అరిచాడు.

త్యాగరాజును చూస్తూనే సత్యవతి మొఖం నల్లబడి పోయింది.

భయంతో గిలగిల లాడింది.

ఓ చేతిలోవున్న కిరసనాయిల్ సీసామా, మరో చేతిలోవున్న అగ్గిపెట్టెను అలాగే జారవిడిచింది— పెద్ద శబ్దమయ్యేలా ...

—మొఖాన్ని చేతులతో కప్పుకొని ముందుకు పడిపోయి వెక్కివెక్కి ఏడ్వసాగింది!

* * *

ఉదయం పదకొండు గంటలప్పుడు త్యాగరాజూ, రాజేశ్వరి శకుంతలా వాళ్ళింటికి వెళ్ళారు.

ఆ క్రితంరోజే శకుంతల హాస్పిటల్ నుండి — అందరూ ఎంతవద్దన్నా వినకుండా పోరాడి ఇంటికి వచ్చేసింది.

శరీరంమీద కాలినచోట మంటలయితే కొద్దిగా తగ్గినయిగాని. పుండ్లు ఏమాత్రమూ తగ్గలేదు.

—ఒక విధంగా ఇంకా లేచి తిరగటం లేదుగూడా!

హాస్పిటల్లో పడుకున్నట్లే ఇంట్లోనూ పడుకొని వున్నది.

త్యాగరాజునూ, రాజేశ్వరినీ చూస్తూనే సాదరంగా ఆహ్వానిస్తూ పక్కమీద నుండి లేవబోయిందిగాని, 'పడుకో లేవబోకు!' అన్నాడు త్యాగరాజు.

శకుంతల తల్లిని పిలిచింది.

'అమ్మా! కుర్చీలు ఇలా పట్టుకురా!'

'నీ కెలా వున్నది శకుంతలా!' అడిగింది రాజేశ్వరి.

— ఆమె మొఖంలో కొట్టొచ్చినట్లుగా కనబడుతున్న నూతనత్వం శకుంతలకు వింతగొలిపింది. ఒక్క క్షణం ఆమెను పరిశీలనగా చూస్తే అది ఏమిటో అర్థమయింది.

'మీ రిద్దరూ నా అభినందనలు స్వీకరించండి!'

'కృతజ్ఞులం!' యిద్దరూ ఒకేసారి అన్నారు.

'ఆ మాటతోనే సరిపోదు...ఈరోజున నేను చెప్పినట్లుగా చేయాలి ... మా యింట్లో ఆతిథ్యం స్వీకరించాలి!' అన్నది శకుంతల చిన్నగా నవ్వుతూ.

రాజేశ్వరి జాలిగా శకుంతల మొఖంలోకి చూచింది.

'నీవు ఇలా ఉండగానేనా?'

'ఏం...ఇంకెలా వుండాలి నేను...ఏం

ఫరవాలేదు...మీరు కాదూ అనగూడదు!'

'వద్దు రాజేశ్వరీ?...మరో రోజు తప్పకుండా వస్తాం ... నిన్ను మొదటిరోజు ఆసుపత్రిలో చూడటమేతప్ప నేను మళ్ళీ రాలేదు... ఇంటికి వచ్చావు ఏలా వున్నావో చూచి వెళ్దామని ... ఆయన్ను తీసుకొని వచ్చాను!' అన్నది అనునయంగా 'అందునా దేవాలయంనుండి ఇటునుండి ఇటే వచ్చాం!'

'దేవాలయానికి వచ్చారా?'

రాజేశ్వరి సిగ్గుపడింది.

మొఖం ఎర్రబడగా 'ఒకగంట క్రితమే మా వివాహ మయింది!' అన్నది.

ఆమె తల వంగి పోయింది. చిరునవ్వు హాసం పెదాలను ఆక్రమించు కున్నది.

'దంపతులయి మొట్టమొదటి సారిగా మాయింటికేవచ్చారన్నమాట! ... నాకు చాలా సంతోషంగా వున్నది!' హృదయ పూర్వకంగా అన్నది ఆ మాటలను శకుంతల.

ఓ పావుగంట తరువాత రాజేశ్వరి అక్కడే వుండగా వంటయింటి వైపుకు వెళ్ళి గడప పక్కగా పీట వాల్చుకు కూర్చుంటూ, 'బాగున్నారా, అమ్మా!' అని అడిగాడు ఎంతో ఆప్యాయంగా శకుంతల తల్లిని.

ఆమె ఏవో చెప్పుకున్నది. అలా చెప్పుకుంటున్నప్పుడు చాలా మాటలకు కంటివెంట కన్నీరుగూడా కార్చుకొన్నది.

త్యాగరాజు ఆమెకు ఎంతనోగా ధైర్యం చెప్పాడు.

'నేను ఇక్కడే ఉద్యోగంలో జేరాను... అంతేగాదు, ఇక్కడే నా స్థిరనివాసం గూడా ఏర్పరుచుకోవాలను కుంటున్నాను... మీకే అవసరమొచ్చినా, కాకితో ఖబురంపినా క్షణాలమీద వచ్చి మీ ముందు వాలుతాను...మీరు ఏ విషయానికీ భయపడ నక్కరలేదు!' అంటూ అభయహస్త మిచ్చాడు.

వాళ్ళింటి నుండి బయల్దేరేటప్పటికి సరిగ్గా పన్నెండు గంటయింది.

'ఇప్పుడు భోజనం చేయకుండా వెళ్ళటం నాకేం బాగోలేదు!' అన్నది శకుంతల కష్టంగా.

'పొద్దున్నే అన్నీ తయారు చేసుకు పెట్టుకు వచ్చాం...పాడయి పోతయిగదా! తరువాత మరోసారి తప్పకుండా వస్తాం... నీ ఆరోగ్యం కోలుకొని ఉద్యోగంలో జేరిన మరునాడు నీవు ఖబురుచేయి!' అన్నది రాజేశ్వరి.

'మీ యిష్టం!' అన్నది నిష్కారంగానే శకుంతల. రాజేశ్వరి నవ్వేసి బయటకొచ్చింది.

ఆమె వెనుకనే 'వస్తాం శకుంతలా!' అంటూ బయటకొచ్చాడు త్యాగరాజు.

ఇద్దరూ ఆ యింటిముందు చిన్న మురికికాలవమీద వేసిన నాపరాతిని దాటి రోడ్డెక్కారు.

ముచ్చటగా ఆ నూతన దంపతులు ఆలా రోడ్డువెంట నడుస్తుంటే—శకుంతల బోర్లాపడుకొని మోచేతులమీద తలను పెట్టుకొని కిటికీలో నుండి—ఆనందమూ, నిరాశా నిండిన తడికళ్ళతో చూడసాగింది.

పోతూ పోతూ త్యాగరాజు ఒక్కసారి ఆ కిటికీలోనుండి—ఓడిపోయి బందీఅయిన మహారాజ్ఞిలావున్న శకుంతలను చూచి విచలితుడయ్యాడు.

బరువుగా వో నిట్టూర్పు విడిచాడు.

'ఈ రోజున స్వామిని మనయింటికి విందుకు పిలుచుకు వెళ్దామను కున్నాం... గుర్తున్నదా?' అడిగాడు రాజేశ్వరి కళ్ళల్లోకి చూస్తూ—యిరుగ్గావున్న రిక్షాలో తలవంచుకు కూర్చున్నారు యిద్దరూ.

రాజేశ్వరికి అలా అతనిపక్కన ఒదిగి కూర్చోవటం ఓ వింత అనుభూతి.

ఆమె మనస్సు ఆనంద పారవశ్యంతో ఆకాశ వీధుల్లో అందాలు చిమ్మే తెల్లని మేఘంలా పరుగెడుతుంది.

'గుర్తున్నది!' అన్నది సగం కళ్ళు మూసుకొని—ఈరోజున ఆమెకంతం చాలా హుందాగా వున్నదనిపిస్తోంది.

'హోటల్‌కువెళ్ళి పిలుచుకు వెళ్దాం!

రాజేశ్వరి రిక్షాలోనే కూర్చోబెట్టి హోటల్లోకి వెళ్ళాడు త్యాగరాజు.

స్వామికి ఆఫ్ అయితే ఓమూల చీకటి గదిలో పడుకొని నిద్రపోతున్నాడు.

అతడికి అసలు విషయం చెప్పి వెంటనే బయల్దేర మన్నాడు త్యాగరాజు.

'రాజేశ్వరి వాకిట్లో రిక్షాలో కూర్చొని వున్నది!' అన్నాడు తొందర చేస్తూ.

'అయితే మీరు ముందు వెళుతూ వుండండి...నేను వెనకాలే ఓపది నిముషాల్లో సైకిల్‌మీద వస్తాను!

త్యాగరాజు బయటకువచ్చి రిక్షా ఎక్కాడు.

'స్వామి లేడా?'

'వస్తానన్నాడు ఓ పది నిముషాల్లో!'

రిక్షా రంయ్ మంటూ మున్సిపల్ సిమెంటు రోడ్డుమీద పారాడసాగింది.

పల్లంలోకి పోతున్నప్పుడు ఒళ్ళు జలదరించగా చటుక్కున త్యాగరాజు చేతిని పట్టుకున్నది రాజేశ్వరి.

ఆమెను అర్థం చేసుకున్నట్లుగా త్యాగరాజు, 'చిన్నగా పోనివ్వమని చెప్పేదా!' అడిగాడు.

'అక్కరలేదు ... పక్కన మీరుండగా భయం దేనికి?' అన్నది తన్మయంగా అతడి మొఖంలోకి చూస్తూ.

వో నిముషం తరువాత, 'ఇప్పుడు మీ జేబులో డబ్బెంత వున్నది?' అని అడిగింది — రోడ్డుపక్కన వున్న దుకాణాల వంక తదేకంగా చూస్తూ.

'రెండు వందలపైన వుండవచ్చు!' అన్నాడు. తిరిగి ఆత్రంగా, 'దేనికి?', అని అడిగాడు ఆమెమొఖంలోకి చూస్తూ.

'నాదో కోరిక మన్నిస్తారా?' తల వంచుకొని అడిగింది.

ఒక్కక్షణం తటపటాయిస్తున్నట్లుగా ఆగి, 'ఈ రోజు ఉదయంనుండీ నాకంటూ ప్రత్యేకంగా ఏంవీలేదు. ఉన్నవన్నీ మనిద్దరివీను...ఈ డబ్బును ఖర్చు పెడదాం అనుకోవటం ... మన డబ్బును ఖర్చుపెడదాం అనుకోవటమే— అటువంటప్పుడు ప్రత్యేకంగా నీవుకోరటం, నేను తీర్చటం అనేది ఏంవీ వుండదు!' అన్నాడు.

'కృతజ్ఞురాలిని!' అన్నది కళ్ళు ఆనందంతో మెరుస్తుండగా.

'ఇంతకీ అలా ఎందు కడిగావో చెప్పనే లేదు!' అన్నాడు ఆసక్తితో. 'ఏంవైనా కొనాలా...రిక్షా ఆపించేదా?...'

'అవును...వో పెద్ద గుడ్డల షాపు ముందు ఆపించండి!'

రిక్షావాడికి ఆమాట చెప్పాడు.

(ఇంకా ఉంది)



మాయ భ్రమ

అందే రామారావు

ఆశలు, ఆశయాలు అంతరించిన వృద్ధులన్నా — పాపపుణ్యాలు, కోపతాపాలు, పాలుపోసుకోని పసివాళ్ళన్నా నాకు చిన్నప్పట్నుంచి యిష్టం. ఎప్పుడూ నాకు వాళ్ళే నేస్తాలు.

ఆరేళ్ళక్రితం — భీమవరం కాలేజిలో చదువుకునేటప్పుడు, సపోటా తోటలో — కాంతమ్మ గారింట్లో అద్దెకుండేవాణ్ణి.

ఆవిడ భర్త సరసయ్య — ఒకషావుకారు గారి కిరాణాకొట్లో పనిచేస్తుండే వారు.

నిజం చెప్పాలంటే నాకు ఆయనంటే ఏమాత్రం గౌరవం వుండేదికాదు. అసలె వాళ్ళది అంతంతమాత్రం బ్రతుకు. దానికితోడు రోజూ ఆయన రాత్రి పది పదకొండు గంటల ప్రాంతంలో తప్ప త్రాగి యింటికి వచ్చేవారు.

కొంతమంది త్రాగినా మున్నుతిన్న పాముల్లా కదులు — మెదులూ లేకుండా పడివుంటారు. ఏదో 'గుడ్డిలో మెల్ల' వాళ్ళు కాస్త నయం. సరసయ్యగారు అలా కాదు. తొలకరి చినుకుల్లో బెకబెక మంటున్న బొదురుకప్పలా ఒకటే వాగుడు — ప్రతి రాత్రి భార్యను తిట్టడం — గొడ్డును బాదినట్టు బాదడం ఆయనకు అలవాటై పోయింది.

ఒక్కోసారి నాకు చిరాకు పుట్టుకొచ్చేది. ఆ యిల్లు వదిలి వేరేచోటుకు వెళ్ళిపోదా మనుకునే వాణ్ణి. కానీ — ఎప్పుడూ 'తమ్ముడూ—తమ్ముడూ' అంటూ ఆప్యాయత చూపించే కరుణామయి కాంతమ్మ గారిని చూస్తే జాలి పుట్టుకొచ్చేది. అందుకే ఆ యిల్లు వదలలేక పోయాను.

పరీక్షల సమయాల్లో ఆయన గొడవ భరించలేక స్నేహితుల రూముకు వెళ్ళి చదువుకునే వాణ్ణి.

సర్సయ్యగారైనా రాత్రుళ్ళు త్రాగిన మైకంలో ఎంత రాక్షసంగా ప్రవర్తించినా, తెల్లవారేసరికి ఎంతో మర్యాదగా, పెద్దమనిషి తరహాగా మాట్లాడేవారు.

ఆయన భార్యను కొడుతూవుంటే చాలాసార్లు నేను వెళ్ళి అపుజేసే వాణ్ణి.

ఒకనాడు చేతికందిన కత్తిపీటతో భార్యను కొడితే ఆవిడకు చేతిమీద అంగుళం లోతుకు తెగిపోయి రక్తం చిమ్ముకొచ్చింది. అదిచూసిన నేను కోపం అపుకోలేక ఆయనపై చేయిచేసుకు — న్నాను.

అంత బాధలోను, భర్తపై చేయి చేసుకున్నందుకు ఆవిడ, కోపంతో నన్ను మందలించింది. నాకు ఒళ్ళు మండింది. పతివ్రతలా ఆవిడ అలా పడివున్నందుకే ఆయన అలా తయారయ్యాడని మనసులోనే మూలుక్కున్నాను.

మర్నాడు కాంతమ్మగారు నా గదిలోకొచ్చి, 'తమ్ముడూ...ఆయన్ని కొడితే చూడలేక కోపంతో నీ మనసు కష్టపెట్టాను. నన్ను క్షమించవూ' అంది.

జాలిగొలిపే ఆమె దీనవదనం చూసి నా మనసు చెప్పరాని వేదనతో మెలితిరిగి పోయింది.

* * *

ఆవేళ ఆదివారం కాలేజికి సెలవు.

ఉదయమేలేచి, సపోటా తోటకు గాయంలం రోడ్డుకు మధ్యనున్న కాలువలో స్నానంచేసి వచ్చాను. పట్టణానికి దూరంగా వుంది గనుక ఆ ప్రాంతం నిర్జనంగాను, ప్రశాంతంగాను ఉండేది.

ఇంటి బయట నుయ్యివున్నా స్నానానికి

ఆకాలువకే వెళ్ళేవాణ్ని. పల్లెటూర్లో పుట్టి పెరిగినవాణ్ణి గనుక, ప్రకృతి శోభకు పరవశించడం నాలో బాగా జీర్ణించుకు పోయింది.

'మామయ్యగారూ, నేనూ వస్తాను బజారుకు' అంటూ వచ్చింది కమల.

'పద, వెళ్దాం.' అన్నాను. ముఖానికి మోచార్కు పౌడరు పట్టిస్తూ.

'నేను రెడీయే. మీదే ఆలస్యం. అర గంటనుంచి చూస్తున్నాను, యింకా తెమలలేదు మీ అలంకరణ. ఆడపిల్లనే నయం,' అంది కొంటెగా.

జవాబుగా నవ్వి వూరుకున్నాను.

అన్నట్టు, కమలగురించి చెప్పలేదు కదూ. కాంతమ్మగారికి లేకలేక పుట్టిన ఒక్కగా నొక్క పిల్ల కమల. పదకొండు లేక పన్నెండు సంవత్సరాల వయసుంటుంది.

ఎర్రగా — బొద్దుగా — ముద్దుగా వుంటుంది.

నా దగ్గర బాగా చనువు ఎక్కువ. ఆదివారం వస్తే నన్ను విడిచిపెట్టేది కాదు. బజారుకెళ్ళినా సినిమా కెళ్ళినా నాతోపాటే వచ్చేది.

ఆవేళ బజారు కెళ్ళి, సిమెంటు రోడ్డునవున్న 'శంకర్—కేఫ్'లో వేడి వేడి పుల్లపెసరట్లు తిని బయట కొచ్చాం.

'సార్, బూట్లు పాలిష్ చేయమంటారా?' అంటూ వెనుకనుంచి ముందు కొచ్చి నిలబడ్డాడు ఒక కుర్రవాడు.

'వద్దురా'

'బిర్లిమార్కు పాలిస్సార్' అన్నాడు రెట్టిస్తూ.

'ఏ మార్కయినా వద్దురా. నాబూట్లే అపసానదశలోవుంటే యింకా వాటికి పాలిస్సేమిటి!' అన్నాను నా బూట్లవైపు చూస్తూ.

కమల ముసిముసిగా నవ్వుకుంది.

'క్రీమ్ పాలిస్సార్ చూసుకుంటే మీనీడ కనిపిస్తుందండి' అంటూ వెంటబడ్డాడు

కొట్టిన రాయిలా మాట్లాడకుండా నడుస్తున్నాను.

'పోనీ చేయించుకోండి పదిపైసలు వాడికిచ్చినట్లుంటుంది అంతమాత్రాన మీ ఎస్టేట్లేం తరిగిపోవుగ' అంది కమల.

'సరే తీసుకో' అంటూ బూట్లుతీసి వాడికిచ్చి, రోడ్డుకు ప్రక్కగా నిలబడ్డాం.

అప్పుడు పాలిష్‌చేస్తున్న కుర్రాణ్ణి పరీక్షగా చూశాను. మాసిపోయిన గళ్ళ బనీను. అంతకన్నా మాసిపోయిన కాకి నిక్కరు తొడిగాడు. నిక్కరు వదులుగా ఒకకాలు చిరిగిపోయి వుంది. బహుశా ఎవరోయిచ్చినదై వుంటుంది. దైన్యంగా వున్నవాడికళ్ళు, చిన్న చిన్న గోతుల్లో వేసిన గాజుముక్కల్లా ఉన్నాయి.

అటుప్రక్క, ఆదివారపు బజారునుంచి ఐదారు రెండెడ్ల బళ్ళు, పెద్ద పెద్ద సినిమా పోస్టర్లు అంటించిన బోర్డులతో గందరగోళంగా వస్తున్నాయి. ముందున్నబండిలో యిద్దరు కుర్రాళ్ళు 'లవ-కుశుల' వేషాలతో నిలబడివున్నారు. బండిలోపల బ్యాండు మేళం 'ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు—గజ్జెల సంగీతం, మువ్వలచిందు-హుషారు పసందు... పాట వాయిస్తున్నారు. రెండవ బండిలో ధమర్బాణధారులైన రామలక్ష్మణులు నిలబడివున్నారు.

'ఏవండి, ఈవేళ 'లవ-కుశ' సినిమాకు వెళ్దామండి' అంది కమల.

'వెళ్దాంలే' అంటూ పాలిష్‌చేసిన బూట్లు తొడుక్కుని కుర్రాడికి ఓపావలా యిచ్చి ఇంటికి బయలుదేరాం.

* * *

ఒక రోజున నేను కాలేజినుండి యింటికి తిరిగి వచ్చేసరికి సాయంత్రం ఐదు గంటలయింది.

సాయంకాలపు నీ రెండలో, ఇంటి ముందున్న సపోటాచెట్టు నీడలో కూర్చుని, కమల చేయిచూపించి జోస్యం చెప్పించుకుంటోంది.

జోస్యుడు కాషాయపు అంగవస్త్రం కట్టాడు. తలకు పెద్ద పెద్ద పక్షి ఈకలు రెండు బిగించి కట్టాడు. ఒంటి నిండా విభూది పూసుకున్నాడు. తుప్పు పట్టిన ఈటెఒకటి ప్రక్కన పెట్టుకు కూర్చున్నాడు.

నేను దగ్గరకు వచ్చేసరికి 'శ్రీరిగొడ్డులా ఉంది తల్లే— నీ చేతిలో ధన రేఖ లచ్చలు లచ్చలు సంపాదిస్తావు' అంటున్నాడు.

నన్ను చూడగానే వాడిముఖం భయంతో నల్లబడింది నేను నవ్వుకుంటూ లోపకు వెళ్ళిపోయాను.

తరువాత కమల నా గదిలోకివచ్చి.

'ఏమిటి మామయ్యా నవ్వుతున్నారు' అంటూ అడిగింది.

'అబ్బే ఏంలేదు. అది సరేగాని ఇంతకూ ఏం చెప్పాడు త్రికాలవేది?'

'బాగానే చెప్పాడండి నావన్నీ లక్షణమైన రేఖలని. అదృష్టజాతకురాలననీ చెప్పాడు.

'ఏ ఊరివాడు?' అని అడిగాను కుతూహలంగా.

'వాళ్ళకు ఒక వూరేమిటండీ ఋషీకేశం, బదరీనాదం అన్నీ తిరిగాడట', అంది ఆశ్చర్యంగా చారెడేసి కళ్ళు చెంపల్లో చక్రాల్లా త్రిప్పుతూ.

నాలో నేనే నవ్వుకున్నాను. సాధారణంగా పట్నవాసులంతా పల్లె ప్రజల్ని మొద్దులని, తింగరివాళ్ళని అంటూ, తమ ఔన్నత్యాన్ని చెప్పకుండానే చాటుకుంటారు. కానీ, ఆ పల్లెల్లో ఈ పట్టణ నాగరికులకు సైతం టోపీలు పెట్టగల ప్రజాపంతులున్నారని తెలుసుకోరు.

ఆ బదరీనాదంనుంచి వూడిపడ్డ సన్యాసి, మా వూరి బైరాగిఅని చెబితే, పాపం కమలకు కలిగిన సంతోషం కాస్తా కరిగిపోతుందని వూరుకున్నాను.

* * *

ఆ రోజు రాత్రి ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపకం. 'సెన్ అండ్ దాస్' ఆర్థిక శాస్త్రం చదువగా చదువగా మెదడు మొద్దుబారి నట్లయింది. అప్పుడు అల్లసాని వారి మనుచరిత్రలోని వరూధినీ ప్రవరాఖ్యుల సంవాదఘట్టం చదివేసరికి కాస్త రిలీఫ్ కలిగి, హృదయం తేలికపడి, మెదడు పదునుకొచ్చింది.

టేబిల్‌మీద అలారం పదకొండు గంటలు చూపిస్తోంది. మరలా తెల్లవారు ఝామున లేచి చదువకో వచ్చునని నాలుగ్గంటలకు అలారం పెట్టి పడుకున్నాను.

కునుకు పడుతూ పడుతూవుంది. ఇంతలో ఇంట్లో ఏదో గడబిడగా ఉంటే లేచి బయటకొచ్చాను.

ఎవరో క్రొత్తమనిషి విచారంగా నిల బడి వున్నాడు. కాంతమ్మగారు, కమల హృదయ విదారకంగా ఏడుస్తున్నారు. నాకు అయోమయంగా వుంది.

'ఏం జరిగిందండి?' అని ఆ క్రొత్త మనిషిని అడిగాను.

'బుధవారం మార్కెట్టు రోడ్డున, నర్సయ్యగారు లారీక్రింద పడిపోయారు' అన్నాడు నెమ్మదిగా.

ఇంటికి తాళంవేసి, అంతా గబగబా బయటకు వెళ్లిపోయాం.

నర్సయ్య త్రాగిన మైకంలో లారీ క్రింద పడ్డాడని లారీవాడు ఆపుచేయ కుండానే వెళ్లిపోయాడని, ఆ వచ్చిన మనిషి నాకు దారిలో చెప్పాడు.

ప్రమాదం జరిగినచోటుకు చేరు కున్నాం. అక్కడి దృశ్యం చూడగానే నాకు ఒళ్లు జలదరించింది—కళ్లు తిరి గాయి. లారీచక్రాలు పొట్టమీదనుంచి వెళ్లినట్లున్నాయి. చుట్టూ రక్తపు మడుగు. పేగులన్నీ బయటకొచ్చి అస్త వ్యస్తంగా పడివున్నాయి. భయంకర దృశ్యాలుచూసి తట్టుకోలేని బలహీనత నాలో బాగా వుంది. అందుకే వెంటనే స్పృహతప్పి పడిపోయాను.

తరువాత నన్నెలా యింటికి చేర్చారో, ఏం చేశారోకూడా నాకు తెలియదు.

* * *

బి. ఏ. అయిపోయిన తరువాత పై చదువుకు హైదరాబాదు వెళ్లిపోయాను.

పరాయి బ్రతుకు

భాగ్య నగరంలోవున్న రెండేళ్లు, కాంతమ్మగారు కమల నా కళ్లలో మెదులు తూనే వుండేవారు.

చదువు ఐపోయిన తరువాత భీమవరం లోనే నాకు ఉద్యోగం రావడంతో ఎంతో సంబరపడ్డాను.

ఉద్యోగంలో చేరడానికి వచ్చినరోజునే కాంతమ్మగారింటికి వెళ్లాను. నన్ను చూసిన కాంతమ్మగారి కళ్లలో కొత్త కాంతిని చూశాను.

'ఎన్నాళ్లకు వచ్చావు తమ్ముడూ' అంటూ ఆప్యాయత నిండిన కంఠంతో ఆహ్వానించింది.

నా కళ్లు అటూ యిటూ కమల కోసం వెదుకుతున్నాయి.

యెలావుందో యిప్పుడు?

పెద్దదై వుంటుంది!

ఇదివరకటిలా నాతో చనువుగా మాట్లాడు తుందా!

'ఇప్పుడేం చేస్తున్నావురా అబ్బాయ్?' అన్న కాంతమ్మగారి ప్రశ్నతో నా ఆలో చనలకు బ్రేకుపడింది.

భీమవరంలో ఉద్యోగం వచ్చిన సంగతి చెప్పాను. ఆవిడ చాలా సంతోష పడింది.

ఎంతకూ కమల కనబడక పోవడంతో, 'కమల ఏం చేస్తోందండి?' అని నేనే అడిగాను.

వాడిపోయిన పుష్పంలా, ఆవిడ వదనం కళ తప్పి కమిలిపోయింది.

'ఏం చెప్పను తమ్ముడూ ఆఖరికి అదికూడా నన్ను అన్యాయంచేసి వెళ్లి పోయింది.'

'ఏం జరిగిందండి?' అన్నాను ఆశ్చ ర్యంగా దీర్ఘంగా నిశ్వసించి కాంతమ్మ గారు చెప్పడం ప్రారంభించారు—

'సుబ్బారావని ఒక కుర్రాడు వుండే వాడు. బహుశా నీవు చూసేవుంటావు. అప్పుడప్పుడూ వీధి నాటకాలు వేస్తుండే వాడు. వాడితో దీనికి స్నేహం కలిసింది. ఇద్దరికీ ఎలా పరిచయమైందో, ఎప్పుడు పరిచయమైందో నాకే తెలియదు.

అప్పట్నుంచీ దీనికి సినిమాపిచ్చి పట్టు కుంది. ఎప్పుడుచూసినా అదే వాగుడు. సినిమాతారల గురించీ, వాళ్లకుండేపేరు ప్రఖ్యాతుల గురించీ లెక్కలేకుండా వాళ్లు సంపాదించే డబ్బుగురించీ, ఇది తలుచు కోని రోజు వుండేదికాదు.

అక్కడకీ నేను ఎన్నోరకాలుగా మంద లించాను. ఇక లాభంలేదని, ఏదో ఒక సంబంధం చూసి పెళ్లిచేసేయ్యాలని నిశ్చ యించుకున్నాను. ఇంతలోనే అది ఆ సుబ్బారావుతో కలిసి మద్రాసు వెళ్లి పోయింది.' అంటూ చమర్చిన కళ్లు పమిటచెంగుతో తుడుచుకుంది.

నా శరీరంలోని నరాలన్నీ తెగిపోయి నట్లయింది. గుండెను ఎవరో పిండు తున్నట్టు, నిస్సత్తువనాలో వ్యాపించింది.

ఎంతో ఆనందంగా వచ్చిన నేను హతా శుడయి తిరిగి వెళ్లాను.

ఆఫీసు పని చూసుకొని — హోటల్లో భోజనంచేసి—సాయంత్రం ఎనిమిది గంట లకు కాంతమ్మగారింటికి చేరుకున్నాను.


ఉన్నట్టుండి ఆకాశంనిండా మబ్బులు కమ్ముకున్నాయి. కొద్దికొద్దిగా వాన జల్లు ప్రారంభమయ్యింది.

నేను లోనకు వెళ్లేసరికి కాంతమ్మ గారు, సీతారామలక్ష్మణుల విగ్రహాలముందు కూర్చుని, పాతకాలపు తంబురామీటుతూ—

'బ్రతికినన్నాళ్లు నీభజను తప్పనుగాని
మరణకాలమునందు మరతునేమొ
నాటికిదియె నీ నామస్మరణచేతు...'

అంటూ పాడుకుంటూవుండగా తంబురా తీగ తెగిపోయింది.


పాట ఆగిపోయింది ●



వనితాలోకం

కె. రామలక్ష్మి

బాగున్నానా? హవ్వ!!



పొగడ్తకి లొంగని వాళ్ళుండరంటారు కాని, ఎవరేనా పొగిడినా, అభినందించినా ముక్కంతా కన్నంతా చేసుకుని, మూతి మూడువంకరలు తిప్పి 'చాల్లే వేళాకోళాలు' అని ఒక్కముక్కలో కొట్టి పారేస్తారు ఆడవారు. పొగడ్త చేయడం, అందిపుచ్చుకోవడమూ ఒకకళే అన్నది ఇటువంటి సందర్భాలలోనే తోస్తుంది. ఆడవారివిషయంలో ఎంతదూరం పోయారంటె—ఏమాటంటే ఏమొస్తుందోనే అని మగవారు అసలు పట్టించుకోని స్థితికి వచ్చేదాకా పోయారు. పొగిడితే తప్పు. 'బాగున్నావు' అంటే తప్పు. బాగుండక పోతే' బాగులేవని చెప్పినా తప్పే. ఎందుకొచ్చిన గొడవ అని ఇంటి మగవాడు పట్టించుకోవడం మానేస్తే — దానికి వాపోతారు. ఎవరేనా 'నీచీర బాగుంది.' అని అంటే చిరునవ్వునవ్వి ఊరుకునే ఆడవారు ఎందరు? 'అయ్యోరామ, ఇదా బాగుందంటున్నావు? రెండేళ్ళ క్రితంది, సగం వెలిసింది. అయినా నాకు ఎరుపు రంగు అసహ్యంగా ఉంటుందని అంతా అంటారు! అంటూ అది ఎందుకు ఎదుటివాడు బాగుండదని చెప్పివుండాలో—ఏకరువు పెడతారు. ఏ అందాలమ్మలాగో, 'బాగున్నావు ఓ గరిటెడు పంచదారుందా ?' అని అందరూ అంటున్నారని అనుకోవడంలో అర్థంలేదు.

'బాగున్నావు' అన్నదానికింత గొడవ ఎందుకు ? అలా అన్నవారి దృష్టి లోపం అని నిరూపించాలని తాపత్రయమో ! తను బాగులేదని నిరూపించాలన్న తాపత్రయమో!... 'బాగున్నావు' అన్నప్పుడు — అది ఎదుటివారి అభిప్రాయాన్ని కోరుతూ వేసిన ప్రశ్నకాదు. నిజానికది అన్నవారి స్వీయాభిప్రాయం. ఆమాటని అంతగానే అర్థం యిచ్చి వదిలేయాలి. కాని శల్యపరీక్షకు దిగడం అర్థం లేదు. ఎవరేనా 'బాగున్నావు' అన్నప్పుడు 'నిజంగానా అనో'. థ్యాంక్యూ అనో అనేసి ఊరుకొంటే ఎంత బాగుంటుంది ? నీకూ ఎరుపే యిష్టమా? అని చిన్న ఆశ్చర్యం లాంటిది ప్రకటించి ఊరుకుంటే ఎంత బాగుంటుంది ? ఎవరేనా ఏవేనా బహుమతి తెచ్చినప్పుడు 'ఇది తెచ్చారేం? నాకు ఫలానారకంది తెస్తారనుకున్నాను' అనడం ఎంత సభ్యతా దూరమో, 'బాగున్నా'వన్నప్పుడు అలా ఉండకూడదని నిరూపించ పూనడం కూడ అంతే.

ఎవరేనా మగవారు కొంచెం పొగిడితే చాలు మహిళలు దరిదాపు ఉడుక్కుంటారు. రహస్యంగా మనకేమైనా కాంప్లెక్సులున్నాయా అనిపిస్తుంది నాకు ... అందంగా లేమనీ, పొగడ్తలకీ మెప్పులకీ అనర్హులమనీ ఊహించుకుని మానసకంగా బాధపడేవాళ్ళే — యిలా ఎవరేనా పొగిడేసరికి ఎదురు తిరుగుతారు. ఇందుకనే కాబోలు చాలామంది భర్తలు అసలు పొగడ్త అనేమాట నోట రానియరు. పాపం — ఏంతో సరదాగా ఉత్సాహంగా అన్నవారి మాటను అనుమానంతో అతి తీవ్రంగా ఎదుటివ్యక్తి ఖండిస్తే ఎవరుమటుకు భయపడరు లెండి.

అంతా ఉత్సాహం పెల్లుబుకుతూ సరదాగా ఉండే ఎవరేనా పొగిడితే బాగానే ఉంటుంది—కాని చాకిరీతో సతమతమైపోయి, ఉసూరోమని ఉంటే అప్పుడొచ్చి— 'బాగున్నావోయ్' అంటే ఉడుకుమోత్తనం రాదా. అంటుందొక స్నేహితురాలు. మన అలసట మన దృక్పథాన్నికూడా అతిక్రమించ నీయడం దారుణం అన్నాను నేను.

చిన్నప్పుడు అస్తమానూ మా అత్తయ్య నేర్పేది — ఎవర్నిగురించేనా మంచిగా ఏదైనా చెప్పాలని ఉంటే చెప్పు. లేకుంటే గుప్‌చిప్. చాలా సీరియస్ సమయంలో మామయ్య 'బాగున్నావోయ్' అంటాడు అత్తయ్యని. అత్తయ్య నవ్వి ఊరుకుంటుంది. 'ఇప్పుడనవలసినదా మామయ్యా, అవతల కొంపలంటుకుంటూంటేనూ ?' అంటానేను. అత్తయ్య నవ్వేస్తుంది—లేకుంటే ఇప్పుడు చెప్పమంటావే చిట్టితల్లి ? నీ పెళ్ళి కోసం గాలించుకు వెళ్ళేటప్పుడా . పొగడ్త ఎప్పుడొచ్చినా, ఫరవాలేదు? దాన్ని అంత తెగబడి ఖండిస్తే అడతనం లేదు—' అంటుంది— నిజమే అని—ఎవరేనా 'బాగున్నావోయి' అన్నా, 'ఈ రోజు అందంగా ఉన్నారండీ' అన్నా స్వీకరించటం మెరుగు — అనుమానించడం కంటే !

మల్లెలాంటి మమత

మాధవి



హాస్పిటల్ ఆవరణంతా నిశ్శబ్దంగా వుంది. సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు రకరకాల మనుషులతో, రోగులతో, చిత్ర విచిత్రాలైన రోగాలతో అపర యమలోక మనిపించే ఆ సర్వజన వైద్యశాల రాత్రి పదిగంట లయ్యేసరికి అతి నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వుంటుంది. మధ్య మధ్య రోగులు బాధలను భరించలేక చేసే ఆక్రందనలు ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భయంకరంగా చేస్తాయి. పూర్వజన్మలో పాపాలకు ఫలితం ఈ జన్మలో శిక్ష అనుభవిస్తున్నా మనుకొనేవాళ్ళు కొందరు, ఈ జన్మలో చేసిన పాపాలకు ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తున్నా మనుకొనేవాళ్ళు మరికొందరు...భగవంతుని పిలుపుకోసం యెదురు చూసేవాళ్ళు...ఇంకా బ్రతకాలనే ఆశతో ఆ భగవంతుని ప్రార్థించేవాళ్ళూ... 'తప్పు చేయకనే తమకెందుకీ శిక్ష'... అని ఆ భగవంతుని నిందించేవాళ్ళూ... తమ అనంతరం తమ భార్యాపిల్లల్ని కాపాడమని ప్రార్థించేవాళ్ళూ...ఏనాడూ భగవంతుని ప్రార్థించని వాళ్ళూ ... రోజూ ప్రతిపనికి నీవే దిక్కు' అంటూ వాడిని తలుచుకొనేవాళ్ళూ... రక రకాల మనుషులు మనస్తత్వాలతో ఆ హాస్పిటలంతా నిండిపోయివుంది. ఎవరి మనసుల్లో ఏమున్నా ఆ సమయంలోమాత్రం అందరూ బాధలను మరచి నిద్ర పోవడానికి ప్రయత్నిస్తున్నవాళ్ళే ...

దాదాపు అందరూ నిద్రపోతున్న ఆ వార్డులో ఐదోనంబరు గదిలో కిటికీకి దగ్గరగావున్న మంచం మీద రెండు కాళ్ళూ ముడుచుకొని కూర్చుని చిక్కని చీకటిలోకి చూస్తోంది సుజాత.

ఆ కళ్ళలో బ్రతకాలనే ఆశ వున్నా బ్రతకనేమో నన్న భయంకూడావున్నాయి.

రక్తంలేక పాలిపోయిన ముఖం, సంవత్సరంనుండి గుండెజబ్బుతో క్షీణించిపోయిన శరీరం ... అంతకంటె మించిన శరీరంలోని బాధ అన్నీ కలిసి సుజాతలో నిరాశా, నిస్పృహలను యెత్తి చూపిస్తున్నాయి.

మనసుమాత్రం మూగగా ఆలోచిస్తోంది.

'అసలు తనకు ప్రేమంటే తెలుసా'...

పేలవమైన నవ్వొకటి మెరిసింది సుజాత పెదవుల మీద...

'తన తల్లికి తను అక్రమంగా పుట్టడం వల్ల తల్లిప్రేమ యేమిటో తనకు తెలియదు. తండ్రి బ్రతికే వున్నాడో, పోయాడో కూడా తెలియదు. తనకు జరిగిన ఈ అన్యాయానికి ఎవర్ని నిందించాలి?...

'ఆ తల్లిదండ్రులనా...

'కఠినమైన నిబంధలతో తనలాంటి అనాథలను ప్రేమకు నోచుకోనివ్వకుండా చేసిన ఈ లోకాన్నా...

లేకపోతే పైన కూర్చుని వినోదం చూస్తున్న ఆ భగవంతుడినా ... ఎవరి నేమనాలి?

మళ్ళీ ఒక పేలవమైన చిరునవ్వు మెరిసిందామె పెదవుల మీద ... దూరంగా ఎవరో రోగి బాధ భరించలేక కాబోలు యేడుస్తున్నాడు. నర్సు వస్తోన్నట్లుంది. అందరూ తమ బాధలు చెప్పుకొంటున్నారు. నర్సు విసుక్కొంటోంది.

సుజాత చెవులకవి రోజూ వినిపించే శబ్దాలే...

'నోరు మూసుకొని పడుకో...' ప్రక్క గదిలో రోగిని నర్సు గట్టిగా కసురుకొంది.

ఉలిక్కిపడి దిండుపైన వెనక్కు వాలి కళ్ళు మూసుకొని పడుకొంది సుజాత.

ఆలోచనలు ఈగల్లా ముసురుతున్నాయి.

నర్సు గదిలోకి తొంగి చూసి సుజాత నిద్రపోతూందనుకొని వెళ్ళిపోయింది.

మళ్ళీ లేచి కూర్చుంది సుజాత. అలా గంటలతరబడి కూర్చుని ఆ కిటికీలోకి చూస్తూ ఆలోచించడమంటే ఆమెకు చాల యిష్టం.

'సుజాత!' తనకీ పేరు యెవరు పెట్టారో...

మళ్ళీ నిర్జీవమైన చిరునవ్వు మెరి

పిండి పెదవుల మీద.

'ఇంతకెవరు పెద్దారు? ... వాళ్ళ తప్పు ... ఆ జ్ఞాపకం రాగానే ఆమె ముఖం మళ్ళీ అతి బాధాకరంగా పాలి పోయింది. తన తల్లిని ఒక్కటంటే ఒక్కసారి చూపించమని యెన్ని సార్లు ప్రార్థించినా వాళ్ళ మనసు కరుగలేదు. తాను లోకం దృష్టిలో వాళ్ళు పెంచు కొన్న అనాథ...వాళ్ళయింట్లో పిల్లలకు పెద్దవాళ్ళకు అణగిమణగి పడివుండే దిక్కులేని అనాథ...అయినదానికీ, కాని దానికీ ఆ యింట్లో అందరి తిట్లు భరించి, చేయిచేసుకొంటే సహనంగా శరీరాన్నప్పగించి నిల్చుండిపోయే అనాథ.

'...తను అనాథకాదని తన తల్లి బ్రతికే వుందని చచ్చిపోయేముందు అమ్మమ్మ చెప్పక పోతే తనకుమాత్రం యేం తెలిసేది?...'

'అమ్మమ్మ...పాపం తనముందే తన కోడలు, కొడుకు, వాళ్ళపిల్లలు తన స్వంత కూతురిబిడ్డను మాటలతో, చేతలతో చిత్రహింస పెడుతుంటే భరించ లేక, నిజంచెప్పి లోకానికి తన కూతు రును లోకువ చేయలేక అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోయి చివరికి ఆ రాత్రి తనకా విషయం చెప్పేసి నిశ్చింతగా కళ్ళు మూసుకొంది...'

వున్న ఆ ఒక్క ఆలంబనమూ పోయి తను గిలగిల లాడిపోయింది. తన తల్లి నైనా ఒక్కసారి చూడాలనే కోర్కెను వాళ్ళ నిరంకుశత్వం చంపేసింది. జీవి తంలో 'ప్రేమ' అనే వస్తువు తనకు ఈ జన్మలో లభించదనుకొనే సమ యంలో తనపాలిటి గొప్పవరంలా ఈ గుండెజబ్బు వచ్చింది.

రెండుమూడు రెకమెండేషన్లతో ఈ ఆస్పత్రిలో తన్ను తోసేసి వాళ్ళభారం వాళ్ళు వదిలించుకొన్నారు.

అందుకు తను బాధపడటంలేదు... ఈ జబ్బుతో ఎప్పుడో ఒకరోజు తనకు నూరేళ్ళు నిండిపోతాయి. కాని...కాని ...ఈ జన్మలో తనకు ప్రేమగా పిలిచే ఆప్తులు...ఆప్యాయంగా ఒక్క చిరునవ్వు నవ్వే అభిమానులు...లేరనే బాధే తన వదనరాళ్ళి పిండేస్తోంది. తనలాంటి దురదృష్టవంతులీప్రపంచంలో యెంత మంది వున్నారో...

సుజాత కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

దగ్గరలోనే పరిచితమైన తనకత్యంత ప్రియమైన కంఠం వినిపిస్తోంది.

సుజాత చటుక్కున మంచంపైన వెనక్కివాలి కళ్ళు మూసుకొంది.

ఆమె కళ్ళముందు తెల్లని దుస్తులతో, చచ్చిపోయే రోగికైనా బ్రతకాలనే ఆశ కలిగించే మెరుపులుగల కళ్ళతో డాక్టర్ సారథి ప్రత్యక్షమయ్యాడు.

'తనపిచ్చి...తనకి లోకంలో ఎవరూ లేరనుకొంటోంది...సారథి... ఆప్యాయంగా, ఆత్రుతగా, తనకు బ్రతుకంటే ఆశ కలి గించేలా మాట్లాడే సారథి తన కున్నాడు...'

'నువ్వు ధైర్యంగా వుండాలి సుజా... ఈ లోకంలో నాకెవ్వరూ లేరని బాధ పడటమెందుకు?... పిచ్చి పిల్లవి ... నేను లేనూ... నీ చుట్టూ వున్న ప్రపంచం లేదూ...ఆ పైన భగవంతుడు లేడూ...'

తన తలపైన చేయివేసి ఆప్యాయంగా నిమురుతూ ఓదార్చే సారథి.

'తను మందు తాగనని మొండిగా ప్రవర్తిస్తే...ఇలాగైతే నిన్ను భరించడం నాకు కష్టం అవుతుంది 'సుజా...' అంటూ తన భుజాల చుట్టూ చేతులేసి పట్టుకొని బలవంతాన మందు తాగించే సారథి.

అవును...తను దురదృష్టవంతురాలు కానేకాదు...నిజంగా తను అదృష్టవంతు రాలు...సారథి తనవాడు...'

ఆ రోజు అడిగేసింది అతని ముఖం లోకి చూస్తూ... 'నిజంగా మీకు ... నేనంటే యిష్టమా డాక్టర్...'

ఒక క్షణం తెల్లబోయి తన ముఖం లోకి చూసి వెంటనే నవ్వుతూ... 'అదేం ప్రశ్న... నువ్వంటే నాకెంతో యిష్టం సుజా... నువ్వు మళ్ళీ మామూలు మని షివి కావాలనీ, చేయబోయే ఆపరేషన్ సక్సెస్ కావాలనీ నేనెప్పుడూ భగవంతుని కోరుకొంటుంటాను...'

సుజాత ముఖంలో వేయి మెరుపులు మెరిశాయి.

'నువ్వంటే నాకెంతో యిష్టం సుజా...' అన్న మాటలే ఆమె చెవుల్లో గింగురు మన్నాయి.

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్ళలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంప రాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాత ప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాత ప్రతులతో స్వంత చిరునామాకల, తగి మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 అరఠావు పేజీల పరిమిత ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతి కించిన కవర్లు జతపరిచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులనీ, కార్టూన్లనీ వీలయి నంత శ్రద్ధగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయమంలో ఎటు వంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షర తుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

మొట్టమొదటి సారిగా 'ప్రేమ... అప్యాయతా' ఇలా వుంటాయా అనుకొంది.

తనూ బ్రతకాలి... బ్రతికి సారధితో... ఇంక ఆలోచించలేక పోయింది.

హృదయమంతా తీయటి భావనలు...

సారధి తనవాడైతే తనకంటే అదృష్టవంతు లింకెవరుంటారు ?...

కాని...కాని...ఆ భయంకరమైన ఆపరేషన్...అదే...అదే... ఇప్పుడు ... తనేం చేయాలి...? భగవంతుడు దయదలచి బ్రతికిస్తే... 'స్వామీ ... యే నేరమూ చేయకపోయినా యిప్పటివరకు అనుభవించ వలసినవన్నీ అనుభవించాను ... ముందు అనుభవించబోయే జీవితానికే నేను యిన్ని యింత ఓపిగ్గా భరించానేమో... నా భవిష్యత్తును... నా మధురమైన ముందు జీవితాన్ని ఇంతటితో త్రుంచేయకు తండ్రీ...'

రెండుచేతులూ జోడించి చీకట్లోనే కనిపించని ఆ భగవంతునికి నమస్కరించింది సుజాత.

చల్లని మృదువైన హస్తం ఆమె నుదుటిని అప్యాయంగా తాకింది.

సుజాత కళ్ళు తెరిచింది. ఎదురుగా దీపంలా సారధి. మళ్ళీ కళ్ళుమూసుకొంది. ఆమె మనసు అతి ప్రశాంతగా వుంది.

* * *

'భయమేస్తోందా...' ఆపరేషన్ థియేటర్లో క్లోరోఫారమ్ ఎక్కిస్తూ అడిగాడు సారధి.

లేదన్నట్లు తలవూపింది సుజాత. యేమేమో చెప్పాలనివుంది. తన నొక్కసారి దగ్గరకు తీసుకోమని, 'సుజా' అని పిలవమని యింకా యెన్నో... కాని యేమీ చెప్పలేనట్లు నిస్సహాయంగా అతనివైపే చూస్తూ మత్తులోకి జారిపోయింది.

ఆమె ప్రాణంతో పోరాడుతూ చివరికి గంటన్నర తర్వాత ఆపరేషన్ థియేటర్లో నుండి బయటికి వచ్చాడు డాక్టర్ సారధి.

ఆపరేషన్ సక్సెస్ అయింది.

కాని ఆ విషయం అడగడానికి ఆమె తరపువాళ్ళెవరూ...లేరు...ఆత్రంగా అతని నోటినుండి ఆమాట వినాలనుకొనేవాళ్ళూ లేరు...

'పాపం...సుజాత...' బాధగా నిట్టూరుస్తూ ముఖంపైన పట్టిన చిరుచెమటను తుడుచుకొన్నాడు సారధి.

సుజాత ఎక్కడెక్కడికో వెళ్ళిపోతోంది ... కొండలు, నదులు సముద్రాలు...అన్నీ దాటుకొని ఎక్కడెక్కడికో వెళ్ళిపోతోంది...అలా వెళ్ళిపోతున్న ఆమెకు దూరంగా సారధి కనిపించాడు. 'డాక్టర్'—అరవబోయింది, నోటినెవరో గట్టిగా మూసినట్లు గొంతు పెగల్లేదు. క్రిందికి దూకేద్దామనుకొంది. కాని ఎవరో పట్టుకొన్నట్లు దూకలేకపోయింది.

'డాక్టర్...డాక్టర్...' రెండుచేతులూ చాపి అతనిని చేరుకోవాలని అల్లాడుతోంది. కాని అతనికి అంత కంతకు దూరమై పోతోంది ...

'డాక్టర్...' వులిక్కిపడి కళ్ళు తెరిచింది సుజాత.

చాలమంది డాక్టర్లు అందుకోసమే యెదురు చూస్తున్నట్లు ఆమె ముఖం మీదికి వంగి పరీక్షగా ఆమెను పరిశీలిస్తున్నారు.

ఆమెకళ్ళు సారధికోసం వెతికాయి.

దూరంగా సిరెంజ్‌లోకి మందెక్కిస్తున్న సారధిని చూసి అవి తళుక్కున మెరిశాయి.

అతడు యింజక్షన్ యిస్తుంటే ఆమె పెదవులు చిరునవ్వు నవ్వాయి.

ఆ గదిలో సారధితోపాటు అంతమంది వుండటం ఆమెకు నచ్చలేదు.

ఒక్కసారి అతడు తనను దగ్గరగా తీసుకోవా లనిపించింది.


కాని ఆమెకోరిక అతనికి తెలియదు. మరో రోగిని చూడటానికి వెళ్ళిపోయాడు.

ఆమె కళ్ళు నిరాశగా క్రిందికి వాలి పోయాయి.

* * *

రెండురోజులు గడిచిపోయాయి. 'సుజాతకు యింకేం ప్రమాదంలేదు...' సారధి తృప్తిగా నిట్టూర్చాడు.

ముఖ్యంగా తన అప్యాయత, ఆదరణల వలననే ఆమె కోలుకోగలిగింది. గుండె జబ్బు వున్న మనుషులకు హృదయం లో



ప్రశాంతత వుండటం యెంత అవసరమో తనకు తెలుసు.

అటువంటి శాంతికి దూరమై, అపోహ్యుత, ఆదరణల కోసం అలమటించి పోయిన సుజాతకు తన నుండి అవి లభించడం...ఆపరేషన్ సక్సెస్ కావడం...' నిజంగా అతనికి చాల తృప్తిగా వుంది.

'రజనికీ విషయం చెప్పాలి ... చాల సంతోషపడుతుంది.

'ఆలోచిస్తూ సుజాత దగ్గర కెళ్ళాడు.

అతని నోటి నుండి వినబోయే మాటల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తోంది సుజాత.

'ఇంక నీకేం ఫరవాలేదు...' స్నేహపూర్వకంగా నవ్వాడు.

కాని ఆమె ఆశించింది అదికాదు ... ఆమె కళ్ళు నిరాశగా చూశాయి. అలా చూస్తుండగానే అతడు అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

మరో వెల రోజులు సాఫీగా గడిచిపోయాయి. ఇంక రెండు రోజులలో సుజాతను డిశ్చార్జి చేస్తారు ... ఆ విషయాన్ని గురించే ఆలోచిస్తూ కిటికీలో నుండి బయటికి చూస్తున్నది...

'సుజాతా...'

ఆత్రంగా... ఆశగా అటువైపుకు తిరిగింది.

'నాకు కొడుకు పుట్టాడు...' సారధి ముఖంలో అంతులేని సంతోషం పొంగి చూపోతోంది.

సుజాత తల తిరుగుతోంది. ఆమె కూర్చున్న మంచం, ప్రక్కనున్న షెల్ఫు, అందులో వున్న పాలు, పళ్ళు, ఎదురుగా వున్న సారధి అందరూ కళ్ళముందు ఆగకుండా గిర్రున తిరుగుతున్నారు. పెద్ద ప్రళయం వచ్చేసి భూమిని ముంచేస్తోంది...

'సుజాతా ... యేమైంది...' క్రింద పడిపోతున్న ఆమెను బలంగా పట్టుకొన్నాడు సారధి.

ఆమె కళ్ళు అతడిని చూస్తూ వున్నాయి.

'మై గాడ్... సుజాతా...' నిర్జీవంగా తన చేతుల్లో వాలిపోయిన సుజాతను నిశ్చేష్టుడై చూశాడు డాక్టర్ సారధి.

అంతవరకు ఆరోగ్యంగా, ఉల్లాసంగా వున్న ఆమె అంత హఠాత్తుగా పోవడానికి కారణం అతనికి యెంత ఆలోచించినా అర్థం కాలేదు.

అతనికే కాదు...అక్కడున్న వాళ్ళెవరికీ కూడా అర్థం కాలేదు. అర్థం కాదు...


గతరాత్రి
నేను కాంచిన
కల
A. S. Murty
కాంతి

రాత్రి 10గంటలకి అమ్మకి మందిచ్చి అమ్మపడుకున్న తరువాత దీపమార్పేసి, గుండెలదాక దుప్పటికప్పి బైటకొచ్చాను. నాన్నగారింకా పడుకోలేదని ఆయన కదలికలద్వారా తెలుస్తోంది. నీళ్ళచెంబు నాన్నగారి మంచంక్రింద పెట్టి వచ్చేస్తున్నాను. అడుగులు చప్పుడు విన్న నాన్నగారు ఇటు తిరిగి...

'ఇంకా పడుకోలేదామ్మా' అన్నారు.

'ఇదిగో వెళ్తున్నా నాన్నగారు' అని చెప్పి నేను వచ్చేశాను.

అమ్మ విషయమే నాకు బెంగగా వుంది. నా పెళ్ళి చూడాలని అమ్మకెంతో కోరికగా ఉంది. కాని, కురూపినయిన నాకు ఎన్నిసంబంధాలు చూసినా కుదరటం లేదు. ఒకవేళ వచ్చినా, వాళ్ళు నా డబ్బును చూసే కాని నన్ను చూసి చేసికోవడానికి రావటంలేదు. ఆస్తినంతా నాకు కట్నంగా ధారపోస్తే ఇంక చివరికి, తమ్ముడిని చదివించటానికి, అమ్మానాన్నల శేష జీవితం గడపటానికి మిగిలేదేమిటి?

నాన్నగారు చూసిన సంబంధాల్లో కొందరికి నేను నచ్చలేదు, మరికొందరు నాకు నచ్చలేదు, మరికొందరికి నాన్నగారిచ్చే కట్నం నచ్చలేదు. ఈవిధంగా ఆలోచిస్తూ పడుకున్న నాకు మెల్లగా నిద్దురపట్టింది.

* * *

'ఏమేవ్ ఇలారా' అంటూ నాన్నగారు హడావిడిగా లోపలికొచ్చారు. లోపల పెరట్లో పనిచేసుకుంటున్న అమ్మ కొంగుకి చేతులు తుడుచుకుంటూవచ్చింది. అక్కడే స్తంభానాన్నుకొని నిలబడ్డ నాకు హడావిడివికి, అమ్మకి మళ్ళీ ఎక్కడ గుండెదడ వస్తుందోనని భయమేసింది.

'అబ్బబ్బా ఏమిటండీ అలా గావుకేక లేస్తారు' అంది అమ్మ.

'ఇంకా నెమ్మదిగా 'ఏమిటండీ' అంటావేమే. అమ్మాయిని చూసుకుందికి యెవరో వస్తున్నారు. పెయ్యేటివారుట. వాళ్ళది వరంగల్లుట. అమ్మాయిని లోపలికి తీసికెళ్ళి తయారు చెయ్యి' అంటూ వచ్చినంత హడావిడిగాను వెళ్ళిపోయారు నాన్నగారు.

నాన్నగారెళ్ళిన పది నిమిషాలకి ఆశ్చర్యం నుండి తేరుకున్న అమ్మ గబగబా వంట యింట్లోకి వెళ్తూ అక్కడే ఉన్న నన్ను చూసి 'అమ్మాయి లీలా, తొందరగా ముఖం కడుక్కుని నీ పుల్‌వాయిల్ చీర కట్టుకుని తయారుగా ఉండమ్మా' అన్చెప్పి వెళ్ళిపోయింది.

నేను పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని లోపలి కెళ్తున్నాను. అప్పటికే నాన్నగారి గొంతు వీధిలో విన్పించడంతో నేను గబగబా చీర మార్చుకొని జడేసుకున్నాను. సరిగ్గా అప్పుడే నాన్నగారు 'అమ్మాయిని తీసుకురావే' అని కేక వేసారు. ఈ పెళ్ళి చూపులు ఇప్పటికి చాలా సార్లయినా ఈసారి మాత్రం ఎందుకో భయంగా వుంది.

అమ్మ నన్ను, ముందు హాల్లోకి తీసికెళ్ళింది. ఆ వచ్చిన వాళ్ళు నలుగురు. అందులో ఇద్దరాడవాళ్ళున్నారు. బహుశ వాళ్ళు అతని తల్లి, చెల్లెలు అయి ఉంటారు. మగవారిలో ఒకాయన అతని తండ్రయి వుంటాడు. అందులోంచి ఒకరు 'నీ పేరేమిటమ్మా' అని ప్రశ్నించారు.

'లీలావతి' అని మెల్లగా జవాబిచ్చాను.

తరువాత మామూలు పెళ్ళి చూపుల తతంగం ముగిసింది. నాన్నగారు నన్నుద్దేశించి 'ఇంక నువ్వు లోపలి కెళ్ళమ్మా' అన్నారు.


నేను మెల్లగా లేచి లోపలి కెళ్ళిపోతూ, ఒక్కసారి అతన్ని చూద్దామన్న ఉద్దేశ్యంతో గుమ్మం దగ్గర ఆగి వెనక్కి తిరిగి చూసాను. అతని చూపులతో నా చూపులు కలుసుకున్నాయి. వెంటనే నేను సిగ్గుతో తల వాంచుకొని లోపలి కెళ్ళిపోయాను. ఈ పెళ్ళి చూపుల యొక్క ఫలితం తెలుసుకోవాలని నాకెంతో ఆత్రంగా ఉంది. అందుకని నేను తలుపు చాటున నిల్చున్నాను.

పెళ్ళివారి తరపునుంచి 'పిల్ల నచ్చిందన్న' సమాధానం నా కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

నేనా ఆశ్చర్యానందాల్లోంచి తేలుకోక మునుపే అమ్మ లోపలికొచ్చి 'ఇన్నాళ్ళకి నీకు కళ్యాణఘడి యొచ్చిందమ్మా' అంటూ కౌగలించుకొని కన్నీళ్ళెట్టుకుంది.

నేను, అమ్మా కలిసి పూజామందిరంలో కెళ్ళి వెంకటేశ్వరస్వామి పటానికి మనసారా నమస్కరించాము. ఈ సంబంధం తెచ్చిన మామయ్యకి నేను మనసులోనే నమస్కరించాను.

ఆ రోజునుంచి సరిగ్గా వారం రోజులకి, పెళ్ళివారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఆ నెలాఖరు నున్న ముహూర్తాలలో ఒక ముహూర్తం నిశ్చయించినట్లు వారు వ్రాసారు.



లిట్ క్విజ్ నెం. 64 - 16 క్లూలు

1. మన కిష్టమైనా, కాకపోయినా వయః వృద్ధి/పీడ సదా మన అస్తిత్వమందలి అఖండ భాగమై వుంటుంది.

2. సామాన్యంగా చెప్పడంలో, సభ్యత/సంతుష్టి మనకు ఏ ప్రమాణంలో లభ్యమో, దానికి వ్యతిరేక ప్రమాణంలో సహన సమ్మతి వున్నట్లు కనిపిను న్న దనుట అతిశయోక్తి కానేరదు.

3. ఈనాడు ఇంగ్లీషు వ్యాపారం/సంస్కృతి సాధనకంటె ఎక్కువగా రాకపోకల సంపర్క సాధనం తరుచు అభ్యసించబడుచున్నది.

4. సమానత/వ్యక్తిత్వంయొక్క నిషేధం మానవతకు మృత్యువై యున్నది.

5. ధార్మిక వివేకానికి ద్వారం వినమ్రత/శాంతియందు గలదు, దాసత్వమందు కాదు.

6. మీరు జీవనం/ప్రేమ విషయం కొంత వరకు అవగాహన చేసుకొనజాలనిదే సాహిత్యమును ఎన్నటికీ అవగాహన చేసుకొన నారంభించజాలరు.

7. వ్యవహారికంగా విద్యాభ్యాసం ఎంత వ్యాపకమై యున్నదో జీవితం/శిక్షణ అంతా వ్యాపకమై యున్నది. మరియు అది కేవలం బాల్య మరియు యవ్వనావస్థయొక్క విశేషతకాదు.

8. విధేయత/బలి ప్రేమకు పరీక్షయై వున్నది.

9. సంఘటన / తయారీ లేనిదే ఏ ఘనకార్యమున్ను నెరవేర్చబడజాలదు.

10. స్వకీయ జీవనంలో ప్రస్తుతం అధిక ప్రమాణంలో ఇతర ఇచ్ఛలకు భిన్నంగా ఔచిత్యం / సంతుష్టి లేనట్లే ఆర్జితేచ్ఛయందుగల సశక్తి, దృఢత కార్యంయొక్క ఏ ఉద్దేశ్యమందుమలేదు.

11. భౌతిక సంపన్నత / సురక్ష మనుష్యుని అంతరిక శక్తులను క్రమేణా నిద్రపుచ్చును.

12. సుఖజనులు సింహావలోకనం / క్రాంతియందు లోక్యం కలిగించుకొనరు.

13. తరతరముల నుండియు భగవంతుని పూజించుటలో అత్యుత్తమ విధానం బలిదానం / సేవ అని మానవుని దృఢ భావనయైయున్నది.

14. నిజంగా శాంతికి ఒక్కటే మార్గం విజ్ఞానం / సురక్షయై యున్నది.

15. యుద్ధం / ధనం మానవతాయుతం కాదు మరియు ఎప్పటికీ కాజాలదు.

16. ధనము / వివేకముకు ఏట్టి రాష్ట్రీయతలేదు ఏ హద్దుమ్మానులేదు అనేది మనం మరువరాదు.

No. 64 - 16 CLUES

(1) Whether we like it or not, **Ageing / Suffering** will always be an integral part of our existence down here.

(2) Generally speaking, it is probably not an exaggeration to state that our willingness to endure seems to be in inverse proportion to the degree of **Civilization / Satisfaction** attained.

(3) Nowadays, English is often taught more as a means of communication than as a vehicle of **Commerce / Culture.**

(4) The denial of **Equality / Individuality** is the death of humanity.

(5) The gate to religious wisdom lies in **Humility / Serenity** and not in servility.

(6) You will never begin to understand literature until you understand something of **Life / Love.**

(7) Learning is practically co-extensive with **Living / Training** and is not merely a characteristic of childhood and youth.

(8) **Obedience / Sacrifice** is the test of love.

(9) No great work can be done without **Organisation / Preparation**

(10) In private life, no motive of action is at present so powerful and so persistent as acquisitiveness, which unlike most other desires, knows no **Propriety / Satiety.**

(11) Material **Prosperity / Security** lulls a man's inner powers to sleep.

(12) Happy people do not indulge in **Retrospection / Revolution.**

(13) Down the course of ages, men have felt that the most appropriate form of worship of God is **Sacrifice / Service.**

(14) **Science / Security** is, indeed, the only gateway to peace.

(15) **War / Wealth** is not humane and never will be.

(16) We must not forget that **Wealth / Wisdom** has neither nationality nor boundary.

గమనిక: పై క్లూలు ప్రసిద్ధ గ్రంథకర్తల పుస్తకములనుండి తీసుకొనబడినవి. అవి పూర్తి వాక్యములు మరియు వేరువేరుగా పూర్తి అర్థవంతమైనవి. ఒక్కొక్క క్లూ యందలి పదములు అక్షర వరుస క్రమములో వ్రాయబడినవి. క్లూలయందు మొదటి పదములు అక్షర వరుసక్రమములో నున్నవి. ఈ కొటేషనులు యే పుస్తకము నుండి తీసుకొన్నది అఫిషియల్ సొల్యూషన్ తోపాటు లిట్ క్విజ్ వీక్లీలో ప్రచురించబడును.

ప్రతి ఆదివారము సండేస్టాండర్డ్ నందు "ఇంగ్లీష్ క్లూలు మరియు ఎంట్రీఫారము చూడండి.

గతరాత్రి...

అమ్మ లేని ఓపిక తెచ్చుకొని పెళ్ళి పనులు చేస్తోంది. అమ్మకు పెళ్ళిపనుల్లో సాయం చెయ్యటానికి నాన్నగారు, పిన్నిగారింటికి వెళ్ళి, వాళ్ళకుటుంబాన్ని తీసుకొచ్చారు. పెళ్ళిరోజు దగ్గరపడ్డ కొలది బంధువులు రావడం మొదలుపెట్టారు.

ముహూర్తం రాత్రి 8–30 నిమిషాలకి నిశ్చయించారు. పెద్ద ముత్తయిదువులు నన్నలంకరిస్తున్నారు. పెళ్ళికొడుకుని మంగళస్నానానికి తీసికొచ్చారు. శరీరం లోపల ఉన్నా మనసు మాత్రం పెళ్ళికొడుకు చుట్టూ పరిభ్రమిస్తోంది.

గౌరీపూజకు కూర్చోపెట్టారు. నేను ఆ ఆది దంపతులకు భక్తితో నమస్కరించాను. నన్ను దీర్ఘ సుమంగళిగా దీవించమని గౌరీదేవిని ప్రార్థించాను.

ముహూర్తం సమీపించడం వల్ల, మామయ్య నన్ను తీసికెళ్ళడాని కొచ్చారు. చేతిలో కొబ్బరి బొండంలో, నుదుట నిలువు బొట్టుతో, కాళ్ళకు పారాణితో, తలలో పూలతోవున్న నన్ను ఇద్దరుముత్తయిదువులు ఇరుప్రక్కలా పట్టుకొని నడిపించు కెళుతుండగా, మామయ్య బుట్ట పట్టుకొని వెనకాల వచ్చారు.

పీటలమీద కూర్చున్నాను. మా ఇద్దరి మధ్య తెర వెలిసింది. బ్రాహ్మణులు చెపుతున్న మంత్రాలను ఆయన శ్రద్ధగా వల్లె వేస్తున్నారు. ఇంతలో తెర తొలగింది. ఆయనకేసి చూడాలని తలెత్తిన నాకు ఆయన చూపుల నెదుర్కొనే శక్తి లేక, వెంటనే తలవొంచుకున్నాను.

మంగళవాయిద్యాలు మిన్నుముట్టాయి. నా మెడలో మంగళసూత్రం వెలిసింది. పురోహితులు మా కొంగులు ముడివేశారు.

* *

తొలికోడి కూసింది. వెంటనే ఉలిక్కిపడి లేచాను.

ఇంతసేపూ నేను కన్నదంతా కలేనని, యథార్థం కాదని తెలిసికొన్న నేను ఎంతో బాధపడ్డాను.

అదే సమయంలో కలలోనయినా ఆ ఆనందం అనుభవించగలిగినందుకు ఒక ప్రక్క సంతోషించాను కూడా!

వసంత ఋతువుకై గొప్ప ఆఫర్

1) మొదటి బహుమతి : రు. 40,000

2) 16 క్లూలు మాత్రమే

LITQUIZ NO. 64

Rs. 50,000

1ST PRIZE Rs. 40,000

UP TO 2 ERRORS Rs. 10,000

5TH COUPON FREE

— లిట్ క్విజ్ నెం. 64 అధికార ఎంట్రీ ఫారము —

బహుమతుల మొత్తం రు. 50,000. ఆఖరు ముగింపు తేదీ 15-4-70 బుధవారం

ADDRESS: LITQUIZ No. 64,

ALANKAR, BALARAM STREET, BOMBAY-7. (W.B.)

గమనిక: 1) ఒక్కొక్క కాలంలో మీరు వద్దనే పదమును కొట్టివేయండి. (2) ఒక కూపన్ మాత్రం పంపినచో ఇతర కూపనులను కొట్టివేయండి. (3) ఎంట్రీరుసుము M.O. ద్వారా పంపినచో, పోస్టాఫీసునుండిపొందిన M.O. రసీదును ఎంట్రీ ఫారమునకు జతపరచవలెను. M. O. రసీదు లేని ఎంట్రీలు నిరాకరింపబడును. (4) I. P. O. క్రాస్‌చేయవద్దు. అది లిట్‌క్విజ్ నెం. 64 బొంబాయి—7 వారికి చెల్లించునట్లు ఉండవలెను.

	Re. 1	1	Re. 1	2	Re. 1	3	Re. 1	4	FREE	
1	AGEING	SUFFERING	AGEING	SUFFERING	AGEING	SUFFERING	AGEING	SUFFERING	AGEING	SUFFERING
2	CIVILIZATION	SATISFACTION	CIVILIZATION	SATISFACTION	CIVILIZATION	SATISFACTION	CIVILIZATION	SATISFACTION	CIVILIZATION	SATISFACTION
3	COMMERCE	CULTURE	COMMERCE	CULTURE	COMMERCE	CULTURE	COMMERCE	CULTURE	COMMERCE	CULTURE
4	EQUALITY	INDIVIDUALITY	EQUALITY	INDIVIDUALITY	EQUALITY	INDIVIDUALITY	EQUALITY	INDIVIDUALITY	EQUALITY	INDIVIDUALITY
5	HUMILITY	SERENITY	HUMILITY	SERENITY	HUMILITY	SERENITY	HUMILITY	SERENITY	HUMILITY	SERENITY
6	LIFE	LOVE	LIFE	LOVE	LIFE	LOVE	LIFE	LOVE	LIFE	LOVE
7	LIVING	TRAINING	LIVING	TRAINING	LIVING	TRAINING	LIVING	TRAINING	LIVING	TRAINING
8	OBEDIENCE	SACRIFICE	OBEDIENCE	SACRIFICE	OBEDIENCE	SACRIFICE	OBEDIENCE	SACRIFICE	OBEDIENCE	SACRIFICE
9	ORGANISATION	PREPARATION	ORGANISATION	PREPARATION	ORGANISATION	PREPARATION	ORGANISATION	PREPARATION	ORGANISATION	PREPARATION
10	PROPRIETY	SATIETY	PROPRIETY	SATIETY	PROPRIETY	SATIETY	PROPRIETY	SATIETY	PROPRIETY	SATIETY
11	PROSPERITY	SECURITY	PROSPERITY	SECURITY	PROSPERITY	SECURITY	PROSPERITY	SECURITY	PROSPERITY	SECURITY
12	RETROSPECTION	REVOLUTION	RETROSPECTION	REVOLUTION	RETROSPECTION	REVOLUTION	RETROSPECTION	REVOLUTION	RETROSPECTION	REVOLUTION
13	SACRIFICE	SERVICE	SACRIFICE	SERVICE	SACRIFICE	SERVICE	SACRIFICE	SERVICE	SACRIFICE	SERVICE
14	SCIENCE	SECURITY	SCIENCE	SECURITY	SCIENCE	SECURITY	SCIENCE	SECURITY	SCIENCE	SECURITY
15	WAR	WEALTH	WAR	WEALTH	WAR	WEALTH	WAR	WEALTH	WAR	WEALTH
16	WEALTH	WISDOM	WEALTH	WISDOM	WEALTH	WISDOM	WEALTH	WISDOM	WEALTH	WISDOM

ఈ క్విజ్ ప్రవేశమునకుచెందిన నిబంధనలను, షరతులను పాటించుటకు అంగీకరిస్తున్నాను. మరియు కాంపిటీషన్ ఎడిటరుగారి నిర్ణయమును తుది నిర్ణయముగాను, న్యాయబద్ధమైనదిగాను అంగీకరించుటకు ఆమోదిస్తున్నాను. ప్రతి కూపనుకు ఎంట్రీ ఫీజు రు. 1/— ఈ పూర్తి ఎంట్రీఫారము (5 కూపనులకు) ఫీజు రు 4/—M. O. రసీదు/I.P.O./లిట్‌క్విజ్ క్యాష్ రశీదు/ప్రైజు కార్డు జతపరుస్తున్నాను. వాటి నెం.........................

64 (ASVP)

CAPITAL LETTERS

NAME..

....

ADDRESS ....

....

....

POST.......................DIST....................

— ఈ పూర్తి ఫారమును కత్తిరించి పంపవలెను —

ఏజెంట్లు : ఈ క్రింద తెలిపిన ఏజంట్లను కలుసుకొని రొఖ రశీదులు, ఎంట్రీ ఫారములు లిట్‌క్విజ్ వీక్లీ పొందవచ్చును. అనంతపూరు — జి. చెన్నకేశవులు, 5/383, పటేల్ రోడ్. [2] ఏ. ఏ. రమణయ్య, 10/292, రాజాజీవీధి, పాత టవున్. [3] వి. ఎస్. లక్ష్మయ్య, బి.ఎ. శ్రీకృష్ణా జనరల్ స్టోర్సు, డి. నెం. 6/189, గుల్జారీపేట. [4] శ్రీ జె. జానకిరాం, శ్రీ భాస్కర్స్ బేకరీ, కుల్కార్జీరావు బిల్డింగ్, రైల్వే ఫీడర్ రోడ్. [5] సి. వెంకటరాముడు, న్యూస్‌ఏజెంట్, బస్‌స్టాండ్, గుత్తి. [6] యు. వెంకప్ప, పెన్షనర్, ధర్మవరం, కడప : క్రెసెంట్ న్యూస్ ఏజెన్సీ, మద్రాసు రోడ్. హైదరాబాదు : [1] ఎస్‌కే. ఎంటర్‌ప్రైజెస్, 40, జి. వి. ఎన్ స్టైల్ కువార్, 4-1-213, హనుమాన్ టెక్డి, [2] ఎస్. కే ఎంటర్‌ప్రైజెస్, C/o జి. మల్లిఖార్జున్, 1-8-104, చిక్కడపల్లి ఎన్. వి. ఆచారి, శ్రీనివాస ట్రస్టు, ట్యాంక్ రోడ్, వెల్లూరు. ఏ. ఉపేందర్, హెచ్. నెం. 7/981. 1000 స్తంభముల దేవాలయం వద్ద, హనుమకొండ, వరంగల్లు-1.

ఆఖరు ముగింపు తేది: 15-4-70

సొల్యూషన్ ఆంధ్రప్రభ 19-4-70

* సొల్యూషన్ వెంటనే పొందుటకు 10 పైII స్టాంపు, స్వంత అడ్రసు గల కార్డును వెంటనే పంపవలెను.

అమలాపురం సమీపంలో నాగేశ్వరరావు, వాణిశ్రీల ఆట పాటలు

నాగేశ్వరరావు, వాణిశ్రీ, చంద్రకళ, పద్మనాభం అమలాపురంలో ఒక వారంరోజులు మకాం వేస్తున్నారు. మార్చి 24 న యిక్కడ బయల్దేరి 25 న అమలాపురం చేరుకుంటారు. అమలాపురానికి 20 మైళ్ల దూరంలో ఒక గ్రామం వుందట. ఆ గ్రామంలో జగపతి ఆర్టు పిక్చర్స్ 'దసరాబుల్లోడు' షూటింగు జరుగుతుంది. వాణిశ్రీ, నాగేశ్వరరావు ఆడిపాడే నాల్గు పాటలను దర్శకుడు వి. బి. రాజేంద్రప్రసాద్ ఆ గ్రామ పరిసరాల్లో చిత్రీకరిస్తారు. ఈ నాల్గు పాటలను ఆచార్య ఆత్రేయ వ్రాసారు. మహదేవన్ సంగీత సారధ్యంలో సుశీల, ఘంటసాలలు పాడారు.

ఈ చిత్రానికి వెంకటరత్నం ఛాయను, హీరాలాల్ నృత్యాన్ని నిర్వహిస్తారు.

దర్శక నిర్మాత

ఇంతవరకు నిర్మాతగా వుంటున్న శ్రీ రాజేంద్రప్రసాద్ ఈ చిత్రంలో దర్శకుడు కూడా అయ్యారు. 'దసరాబుల్లోడు' పాటల చిత్రీకరణ, క్లయిమాక్స్ చిత్రీకరణ కలర్‌లో వుండగలదని తెలుస్తుంది. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను నాగేశ్వరరావు, రంగారావు, గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, వాణిశ్రీ, చంద్రకళ, అంజలీదేవి, సూర్యకాంతం గార్లు పోషిస్తున్నారు. మార్చి 25 నుండి ఏప్రిల్ 2 వరకు జరుగనున్న అవుట్‌డోర్ షూటింగులో నాలుగు పాటలు చిత్రీకరింపబడ్తాయి; మే మాసంలో యిదే లొకేషన్‌లో మరొక పాట పిక్చరైజు కాగలదని దర్శక, నిర్మాత శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

సినిమా

భారీఎత్తున సన్నాహం

'పాండవ వనవాసం' చిత్రం తర్వాత ఎన్. టి. రామారావు, రంగారావుల కాంబినేషన్‌ను కుదిర్చిన ఘనత ఎం. ఎస్. రెడ్డికి చెందుతుంది. తెలుగు చిత్రరంగంలో యింతవరకు యెవ్వరూ చెయ్యని యజ్ఞాన్ని శ్రీ రెడ్డి తలపెట్టడం ముదావహం. మార్చి 25న యీ యజ్ఞం ప్రారంభమవుతుంది. ఈ యజ్ఞం పేరేమిటో తెలుసా? 'శ్రీకృష్ణవిజయం'



'మనసిచ్చి చూడు'లో కె. ఆర్. విజయ.

'మల్లెమాల' అనబడే శ్రీ ఎం. ఎస్. రెడ్డి వ్రాసిన 'శ్రీకృష్ణవిజయం' తెలుగు చలనచిత్రరంగానికి ఒక అపూర్వ కానుక కాగలదని ఊహించవచ్చు. శ్రీకృష్ణునిగా రామారావు, వసుంధరగా జయలలిత; అలక ప్రదర్శిస్తూ ప్రేమను చిలకబోసే అందాలగుమ్మ సత్యభామగా జమున నటిస్తారు. ఈ చిత్రంలో కనిపించే ముఖ్యపాత్రలను రంగారావు, నాగభూషణం, పద్మనాభం, రామకృష్ణ, సత్యనారాయణ, ధూళిపాళ, మిక్కిలినేని, దేవిక, సుకన్య, సంధ్యారాణి, రమాప్రభ, శ్రీరంజని పోషిస్తున్నారు. జగ్గయ్య (గెస్టు) ఒక ప్రముఖ భూమికను పౌరాణికచిత్రంలో ధరించడం ఒక విశేషం. యావద్భారత తారగా వెలుగొందుతున్న హేమమాలిని (రంభగా) ఒక నృత్యాన్ని చెయ్యడం మరొక విశేషం. ఈ యజ్ఞానికి శ్రీ కామేశ్వరరావు సారధి; వీరికి సహాయకులుగా శ్రీ జి.కె. రాము (ఛాయ); శ్రీ గోఖలే; (శిల్పం); పెండ్యాల (సంగీతం); శ్రీ ఈశ్వరరెడ్డి (సహకార దర్శకత్వం) పనిచేస్తారు. ఈ చిత్రం ఆంధ్రాలో విజయ పిక్చర్స్‌ద్వారా విడుదలవుతుంది.


మీకు తెలుసా?

నటి దేవిక తెలుగులో శ్రీ అక్కినేనికి జంటగా నటించనట్లే, నటి జయలలిత తమిళంలో జెమినీ గణేశన్‌తో యింతవరకు కలిసి నటించలేదట.

బొంబాయి చిత్రనిర్మాతల్లో చాలామంది తమ ప్రింట్లను తిరుపతికి తీసికెళ్ళి, ఏడుకొండలవాడి అనుగ్రహాన్ని పొందిన వెంటనే, తమ చిత్రాలను విడుదల చేస్తున్నారట.

హిందీనటుడు రాజేంద్ర కుమార్ హీరోగా నటించిన చిత్రాలకు అరబ్బు దేశాల్లో ఎక్కువ డిమాండ్‌వుందట.

ఇప్పుడు హాలివుడ్ నిర్మాతలు 'షేక్స్‌పియర్' వ్రాసిన నాటకాలను చిత్రంగా నిర్మించే ప్రయత్నాలను చేస్తున్నారట.


తెలుగు ఆడపడుచులకు పండుగ దినం.
బంధుమిత్ర సపరివారంగా చూడండి!
పాలకులైన పెద్దలే
అన్యాయాలూ,
అత్యాచారాలు చేస్తుంటే
పీడిత ప్రజానీకం
నిరాశగా కన్నీళ్ళు
నింపు కోవలసిందేనా!?
పద్మనాభం సమర్పించు
రేఖా, మురళీ ప్రొడక్షన్స్
కథానాయిక
మొల్ల
బి.పురుషోత్తం
కోదండపాణి
జె సత్యనారాయణ
అనంతరామ్
దర్శకత్వం
బి. పద్మనాభం

మార్పుతో ప్రారంభమైన మలుపు

దర్శక, నిర్మాత శ్రీ బి. ఏ. సుబ్బారావు ఏ శుభముహూర్తాన రత్నకుమారిని వాణిశ్రీ అని మార్చారో, ఆరోజే ఆమె జీవితంలో కొత్త మలుపు ప్రారంభమైంది. వాణి అంటే సరస్వతి; శ్రీ అంటే లక్ష్మి; 'నటన' ఒక కళ; ఆ కళలో వాణిశ్రీ పట్టభద్రురాలైంది; ఆమె చదువుకుతగ్గ ప్రతిఫలం లభిస్తూవుంది. అందుకే వాణిశ్రీ అనేపేరు ఆమెకు బాగా అతికిపోయింది. తెలుగు ప్రేక్షకుల అభిమాన తార అయింది.

గ్లామర్‌తో పాటు గాత్రం ఇచ్చిన నాయిక

నటి జయలలిత హీరోయిన్‌గా నటించిన మొదటి తెలుగు చిత్రం 'మనుషులు—మమతలు'. ప్రథమ చిత్రంలోనే ప్రేక్షకుల అభిమాన ధనాన్ని జయలలిత సంపాయించ గల్గింది. కొన్ని చిత్రాలు కేవలం ఆమె గ్లామర్ పైనే నిర్మాతలకు వసూళ్లను తెచ్చి పెట్టింది. ఇంతవరకు జయలలిత సినిమాల్లో నటించింది, డాన్సు చేసింది. ఇప్పుడు గాయని కూడా అయింది.

శ్రీ ఎస్. రామబ్రహ్మం నిర్మించిన 'అలీబాబా నలభై దొంగలు' చిత్రంలో శ్రీ ఘంటసాల సారథ్యంలో జయలలిత పాడింది. దాశరథి మదిలోని భావాన్ని జయలలిత స్పష్టంగా తెలిపింది. ఆ పాట ఏమిటో తెలుసా?

చల్ల చల్లని వెన్నెలాయె
మల్లెపూల పానుపాయె
ఒంటిగా నేనుండ జాలరా
నా వన్నెకాడ—వయసు నెవ్వరి
పాలు సేతురా!



'తాళిబొట్టు'లో జ్యోతిలక్ష్మి.

అంటూ జయలలిత పాడిన పాటను విన్నప్పుడు, పాటలోని భావాన్ని ఆమె ఎంతో చక్కగా పల్కిందనిపించింది. కాస్త ప్రాక్టీసు చేస్తే, ఇకపై ఉత్తమ గాయని కూడా అవుతుందనిపించింది.

'అలీబాబా నలభై దొంగలు' చిత్రానికి శ్రీ డి. వి. నరసరాజు రచనను, ఘంటసాల సంగీతాన్ని, విఠలాచార్య నిర్దేశకత్వాన్ని నిర్వహించారు. గౌతమి పిక్చర్స్ విడుదల చేసే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను ఎన్. టి. రామారావు, జయలలిత, నాగభూషణం, సూర్యకాంతం, సత్యనారాయణ, హేమలత, మిక్కిలినేని, రమాప్రభ, అల్లు రామలింగయ్యగార్లు ధరించారు. శ్రీ రామబ్రహ్మం నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ మొదటి వారంలో విడుదలవుతుంది.



'పచ్చని సంసారం'లో వాణిశ్రీ, కృష్ణ.

శిల్పకళా వైభవానికి తార్కాణం

భవానీ ఫిలింస్ నిర్మిస్తున్న 'మాయని



'మాయనిమమత'లో రామారావు.

మమత' చిత్రంలో వాసవదత్త దృశ్య నాటిక హైలైటుగా వుంటుంది. శ్రీ టి. వి. ఎస్ శర్మ శిల్పకళా వైభవానికి 'వాసవదత్త' ఒక తార్కాణం. స్త్రీ జాతి ఔన్నత్యాన్ని, ఆమెలోని సుగుణ సంపత్తిని చాటిచెప్పే 'మాయని మమత' పూర్ణాద్వారా మే 1 న విడుదల అవుతుంది. శ్రీ బాపయ్యచౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను ఎన్. టి. రామారావు, శోభన్‌బాబు సరోజాదేవి, లక్ష్మి, నాగభూషణం, హేమలత, రాజబాబు, రమాప్రభ, ధూళిపాళ, త్రినాథరావు, సాక్షి రంగారావు పోషించారు. దర్శకత్వాన్ని శ్రీ కామేశ్వరరావు, సంగీతాన్ని శ్రీ అశ్వత్థామ, నిర్మాణ నిర్వహణను శ్రీ ఎన్ ఎల్. ఎన్. శాస్త్రి గార్లు నిర్వహించారు.

మూడవ ప్రయత్నంగా జానపదం

'చిక్కడు దొరకడు', 'కదలడు వదలడు' చిత్రాలను నిర్మించిన లక్ష్మీనారాయణ కంబైన్స్ తమ మూడవ ప్రయత్నంగా ఒక జానపద చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీ బి. వి. శ్రీనివాస్ నిర్దేశకత్వంలో తయారుకానున్న ఈ చిత్రానికి శ్రీ జి. కె. మూర్తి కథ, మాటలను సమకూరుస్తున్నారు. శ్రీ సీతారామస్వామి నిర్మించే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను ఎన్. టి. రామారావు, ఎస్వీ. రంగారావు, జయలలిత, సావిత్రి పోషించగలరని తెలుస్తోంది. షూటింగు ఆగస్టులో వుండగలదని అనుకుంటున్నారు.

* * *


మధుపిక్చర్స్ మల్లికార్జున రావుగారు తెలుగులో నిర్మించనున్న చిత్రంయొక్క షూటింగు ఏప్రిల్ 19 న మద్రాసులో ప్రారంభ మవుతుంది. ఈ చిత్రానికి ముళ్లపూడి వెంకటరమణ మాటలను, కోదండపాణి సంగీతాన్ని, శ్రీ హరిరావు ఎడిటింగును నిర్వహిస్తారు. శ్రీ బాపు నిర్దేశకత్వంలో రూపొందించబడే ఈ చిత్రంలోని ముఖ్య భూమికలను శోభన్ బాబు, నాగభూషణం, 'షావుకారు'జానకి, చంద్రమోహన్ ధరిస్తున్నారు. శోభన్ ప్రక్కన ఒక కొత్తమ్మాయి నటించ గలదని తెలుస్తోంది. ఏప్రిల్‌లో ప్రారంభమై జూన్‌లో పూర్తికాగలదని తెలుస్తోంది.

ఏడాదికి ఒకటి లేక రెండు మంచి చిత్రాలు నిర్మాణం

'జానపద దర్శక బ్రహ్మ'గా వినుతి కెక్కిన శ్రీ విఠలాచార్య ప్రస్తుతం కె. జి. ఆర్. పిక్చర్స్, రాజేంద్ర ఆర్ట్స్



'భలేపాప'లో కె. ఆర్. విజయ.



శ్రీ నాయక్, శ్రీ మధుసూదనరావు, శ్రీ అక్కినేని, 'దసరా బుల్లోడు' చిత్రానికి దర్శకత్వం నెరవుతున్న శ్రీ వి. బి. ప్రసాద్.

చిత్రాలను డైరెక్టు చేస్తున్నారు. ఈ రెండింటిలో రామారావు కథానాయకుడు. ఈ చిత్రాల షూటింగు కార్యక్రమాలు పూర్తికాగానే మూడు మాసాలపాటు విశ్రాంతి తీసుకోదలచినట్లు వెల్లడించారు. భారత దేశంలోగల వివిధ పట్టణాలను, ప్రశస్తి పొందిన ప్రదేశాలను చూడదలచినట్లు చెప్పారు. టూర్ పూర్తిగానే విక్టర్ హ్యూగో వ్రాసిన 'లేమిసరబుల్స్'ను తెలుగులో నిర్మిస్తారు.

సినిమా

ఈ చిత్రానికి 'బీదలపాట్లు' అని పేరు పెట్టారు. ప్రధాన పాత్రలను వెండితెర ప్రముఖులు పోషించగలరని శ్రీ విఠలాచార్య చెప్పారు. ఏడాదికి ఒకటి లేక రెండు మంచి చిత్రాలను తమ బ్యానర్‌లో నిర్మించడానికి నిశ్చయించినట్లు వ్యక్తపరిచారు.

* * *

'పెళ్ళికానుక' 'మనస్సే మందిరం' లాంటి చక్కటి చిత్రాలను ప్రేక్షకులకి నచ్చే విధంగా డైరెక్టు చేసిన శ్రీ శ్రీధర్ యిప్పుడు ఒక పంచరంగుల చిత్రాన్ని చూపించనున్నారు. కథా రచయితగా, సంభాషణ కర్తగా, దిర్శకుడిగా శ్రీధర్‌కు ప్రజల్లో, పరిశ్రమలో ఒక ప్రత్యేక స్థానం వుంది. విదేశాలకు వెళ్ళి, అక్కడి సుందర ప్రదేశాల్లో కొంత చిత్రాన్ని చిత్రీకరించిన ఘనత శ్రీధర్‌కే దక్కింది. అనుకున్న పనిని అనుకున్నట్టే చెయ్యగల దీక్ష, సామర్థ్యం శ్రీధర్‌కు ఉంది. చిత్రాలయ నిర్మించిన యిహాస్తుమన్ కలర్ చిత్రాన్ని మీరు త్వరలోనే చూస్తారు. చూచి శ్రీధర్ యొక్క ధైర్యసాహసాలకు జోహారు అర్పిస్తారు. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను కాంచన, ఎస్వీరంగారావు, శాంతకుమారి, నమ్ర్తా పోషించారు. 'పెంపుడుకొడుకు', 'మనోహర' 'పరదేశి' చిత్రాల్లో నటించి ఆంధ్ర ప్రేక్షకుల అభిమానాన్ని విపరీతంగా చూరగొన్న శివాజీగణేశన్ యిహా చిత్రానికి నాయకుడు.

విజయలలితని కవ్వించిన కృష్ణంరాజు


కృష్ణంరాజు, విజయలలిత ఒకే కాలేజీ విద్యార్థులు. కృష్ణంరాజు ధనవంతుడు; ఉల్లాసరాయుడు; తియ్యటి మాటగాడు. అతనిరూపాన్ని, అతని మాటల మాధుర్యాన్ని విజయలలిత ఆరాధించింది. కృష్ణంరాజుతో పార్కులకు, సినిమాలకు వెళ్ళింది. విజయలలిత మనస్సును కృష్ణంరాజు హరించాడు! ఆమెలో కోర్కెను రేకెత్తించాడు. ఆమెను ప్రేమించాడు. ఆమెతో ఆడాడు; పాడాడు. ఆమె కళ్ళలో తన కళ్ళను కలిపాడు.

కృష్ణంరాజు : చెంపకు చారెడుకళ్ళున్నాయి
కళ్ళకు బోలెడు కలలున్నాయి

విజయలలిత: గుప్పెడు గుండెలో గంపు కోర్కెలు

గుబగుబ చప్పుడు చేస్తున్నాయి—

అంటూ విజయలలిత నాజూకుగా నడవసాగింది. ఆమె నడకను కృష్ణంరాజు కళ్ళార్పకుండా చూశాడు. చూచి,



'నా దేశం'లో చంద్రకళ, హరనాథ్.

"పిడికెడు నడుమునకు పిరుదులు బరువై
అడుగడుగున వూగింది—
బారెడు జడ ఆరెంటికి జతగా
జరజరలాడుతూ పాకింది.

అంటూ విజయలలితను కృష్ణంరాజు తన హృదయానికి హత్తుకున్నాడు. ఈ శృంగార సన్నివేశం 'తాళిబొట్టు' చిత్రంలో కనిపిస్తుంది.

స్త్రీకి విలువయినది, మరి మరి లేనిది ఒక్కటే. ఏమి అది? అదే 'మంగళ సూత్రం' ప్రతిస్త్రీకి ధన్యత చేకూర్చేది ఆమె మెడను అలంకరించే మాంగల్యమే. ఈ నిత్యసత్యాన్ని నిరూపించే చిత్రమే 'తాళిబొట్టు'. శ్రీ వెంకట్రామరాజు నిర్మించిన యీ చిత్రానికి మాధవరావు నిర్దేశకుడు, మహదేవన్ సంగీతదర్శకుడు, ఆచార్య ఆత్రేయ మాటపాటలను వ్రాసిన 'తాళిబొట్టు' చిత్రంలో నాయికా, నాయక భూమికలను విజయ నిర్మల, కృష్ణ ధరించారు. శ్రీ విశ్వనాథ రాజు సమర్పిస్తున్న ఈ చిత్రానికి పూర్ణా పంపిణీదారులు.

* * *

నటుడు చంద్రమోహన్, డాక్టరు గారి రామమందరరావుగారి కుమార్తెను (జలంధరను) మార్చి 15 న పరిణయమాడారు. పరిశ్రమలోని ప్రముఖులనేకులు వచ్చి శుభాశీస్సులను, కానుకలను అందచేశారు.

* * *

చంద్రమోహన్‌కు మార్చి 15 న పెండ్లయింది. మార్చి 16 న చంద్రమోహన్ షూటింగులో పాల్గొనవలసి వచ్చింది. పెండ్లి తర్వాత చంద్రమోహన్ నటించిన సన్నివేశం శృంగార సన్నివేశం. ఎక్కడో తెలుసా? విజయా గార్డెన్స్‌లో. ఎవరితో నటించాడో తెలుసా? స్నేహప్రభ అనే కొత్త అమ్మాయితో

వింత ప్రేమ

చంద్రమోహన్, స్నేహప్రభలు ఒకరినొకరు ప్రేమించుకున్నారే గాని ఇద్దరూ "నువ్వెంతంటే నువ్వెంత" అనుకునే స్వభావాన్ని కలిగి ఉండటమే వారిలోని విశేషం.

చంద్రమోహన్:



'పసిడిమనసులు'లో శోభన్‌బాబు, శారద.

రారా, ఎంతదూరం పోతావ్
పోయి పోయి చూస్తే నువ్వెక్కడ
ఉంటావ్.
నా పక్కనే వుంటావు.

స్నేహప్రభ:

రారా, ఎంతదూరం వస్తావ్
వచ్చివచ్చిచూడు, నన్నందుకుంటావ్
నా సొంతమవుతావ్.

ఈ పాటను ఉత్తమచిత్రవారి సొంతానికి ఆచార్య ఆత్రేయ వ్రాశారు. పెండ్యాల ఆధ్వర్యంలో రామమూర్తి, జానకి పాడారు. ఈ సన్నివేశాన్ని శ్రీ ప్రత్యగాత్మ మార్చి 16, 17 తేదులలో చిత్రీకరించారు. శ్రీ కుటుంబరావు నిర్మించే ఈ చిత్రంలో జమున, నాగేశ్వరరావుగారలు నాయికా నాయకులు. శ్రీఫిలింస్ విడుదలచేస్తే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను జగ్గయ్య, రామకృష్ణ, పద్మనాభం, అంజలీదేవి, గీతాంజలి, సూర్యకాంతంగారలు పోషిస్తున్నారు. మే నెలలో ఊటీలో అవుట్‌డోర్



'పెత్తందార్లు'లో విజయనిర్మల, సావిత్రి.

పుస్తకాలు

అనుభవం

రచయిత:— శ్రీ కొడవటిగంటి కుటుంబరావు ప్రచురణ: ఎమ్. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాదు, వెల: రూ 2.

పాత శతాబ్ది చివర అవతరించిన పార్వతమ్మ అనుభవాన్ని చిత్రించిన కథ ఇది. అయిదుగురు మగ పిల్లల తరువాత మీనమ్మకు పుట్టిన ఆడపిల్ల పార్వతమ్మ. తండ్రిని అంతగా ఎరగని పిల్లగా పెరిగి పెద్దదయింది పార్వతి. 'ఆవిడకేం? కుంటిదేవి' అని ఎవరో తనతల్లి గురించి అన్న మాటలు పార్వతి మీద పనిచేసినవి. తల్లిని గురించి ఆమె తలలో అనుమానం తల ఎత్తి రాను రాను రూఢి అయింది. అయినా పార్వతి షాక్ కాలేదు. నిర్వికారంగా వుండిపోయింది. ఇటువంటి పార్వతి పెండ్లి, చిన్న జమీందార్ల కుటుంబంలోని వాడయిన కాంతయ్యతో జరిగింది. కాంతయ్య తల్లి శ్యామలాంబ. కొడుకు పెంపకం విషయంలో ఆమె చూపిన జాగ్రత్త విపరీతంగా పరిణమించింది. బస్తీ జీవితానికి అలవాటు పడిన భర్త కథ పార్వతి తెలుసుకొని, పడవలసిన జాగ్రత్త పడేనాటికే ఆమె గర్భవతి. 'నన్ను వేధించకండి. నేను మీకు కావలసిన ఆడదాన్ని కాను. మిమ్మల్ని సవాలు చేసే ఆడవాళ్ల మీద మీ ప్రతాపం చూపించండి' అంటుంది పార్వతి. ఆతరువాత పార్వతికి పుట్టిన పిల్లవాడు నారాయణ. అప్పటికే కాంతయ్య ఆస్తి హరించుకుపోతున్నది. పార్వతి అన్న వెంకటేశ్వర్లు చేసిన కృషి ఫలంగా కొడుకు పేర కొంత ఆస్తి మిగల్చగలుగుతుంది. అన్నల సహాయంతో కొడుక్కు చదువు చెప్పించుకుంది. నారాయణ బియ్యే పాసయిన తరువాత ఉద్యోగంలో చేరడు. కథలు రాస్తాడు. మద్రాసులో ఒక పత్రికలో ఉద్యోగం సంపాదించుకుంటాడు. అంతలో యుద్ధం వస్తుంది. 'నారాయణను ఆఫీసులో మ ప్యాతికమంది రష్యా ఏజెంటుగా కింద జమకట్టేశారు (189 వ పుట. గాంధి హత్య జరిగిన తరువాత నారాయణ ఉద్యోగం మానేసి చిన్న ప్రెస్సొకటి కొన్నాడు. వారపత్రిక పెట్టా లనుకున్నాడు కానీ పెట్టలేదు. నారాయణకొక కూతురు పుట్టింది. నారాయణ భావాలు అతని భార్య సావిత్రికి అంతగా నచ్చవు. జబ్బు చేసిన తల్లిని నారాయణ మద్రాసుకు తీసుకు వెళ్దా లనుకుంటుంటాడు. కానీ, 'ఎందుకురా? నన్ను ఈసారికి చావకుండా బతికిస్తానంటావు. అంతేనా' అంటుంది పార్వతమ్మ. అంతేకాదు. 'నిన్ను ఎట్లా పెంచాలో చాతకాక నిన్ను దూరం చేసుకున్నా...మన అద్దెకున్న వాళ్ల బ్బాయి, ఆ తల్లి ఎంత ప్రేమగా ఉంటారు? వాళ్లను చూస్తే ముచ్చటేస్తుంది' అంటుంది ఆఖరిక్షణాలలో ఇది పార్వతమ్మ అనుభవం.

భూస్వాముల రోజులు అంతరించుతున్నరోజులలో ఇద్దరు తల్లులు తమ కొడుకులను పెంచిన తీరును చిత్రించారు ఈకథలో. చకచకా నడిచింది కథ. గమనించ తగిన అంశం—పార్వతి పాత్రను చిత్రించిన పద్ధతి. తన భర్త వలే కొడుకుకూడా చెడిపోరాదనే పట్టుదల పార్వతమ్మలో ఉన్నది అయితే అది హద్దు మీరిగిన పట్టుదల. కొన్ని విషయాలలో సర్దుకు పోతుంది పార్వతమ్మ. ఆస్తి విషయంలో మాత్రం కాదు. భర్త వద్దనుంచి రాబట్టిన ఆస్తిని ఎక్కువ చేస్తుంది. ఆఖరికి ఆ ఆస్తియే నారాయణకు ఆధారవవుతుంది. అదే విధంగా నారాయణకూడా తల్లి అభిప్రాయాలతో సర్దుకు పోతాడు కొంతవరకూ.

కాంతయ్య తల్లి శ్యామలాంబ ప్రవర్తన పార్వతమ్మ ప్రవర్తనకు విరుద్ధంగా ఉంటుంది.

పోతే కుటుంబరావుగారి స్టైలులో ఇంగ్లీష్ మాటలు విరివిగా దొర్లినయ్. అయినా పార్వతి 'షాక్' కాలేదు (7వ పుట.) పెళ్ళప్పుడు వాళ్ళూ వీళ్ళూ అనుకున్న చూచాయ మాటలన్నీ బాగా 'ఫోకస్'లోకి వచ్చాయి. (19 వ పుట.)

ఆతరువాత కొన్ని వాక్యాలు సందర్భోచితంగానే ఉన్నా కొంత ఎబ్బెట్టుగా ఉన్నాయ్. 'ఎవరో ఒక నెరజాణ అయిన ఒక అమ్మాయి, అనుభవం లేని మొగుణ్ణి గర్భాదానం రాత్రి అతి తేలికగా మోసం చేసింది. విన్నవాళ్లు నోళ్ళు నొక్కుకుని నవ్వుకున్నారు (27వ పుట) ఈ వాక్యంలో మొదటి ఒక అనవసరం. ఆతరువాత అదే పేజీలో 'తరువాత ఆ అబ్బాయికి దారి తెలిసిందిలే నలుగురి పిల్లల్ని కన్నారు' అన్నది మాటపాకారి.

ఈ వాక్యం కథకు అవసరమా?

మరికొన్ని మంచి వాక్యాలున్నాయ్. 'వేటలో చస్తే త్వరగా ప్రాణం పోతుంది. బలిపశువుగా చస్తే ఉత్తమలోకాలు కలుగుతాయి. అంచేత బలి పశువుగా చావటమే మేలు. (29వ పుట.) 'కల్పనకు చరిత్ర హీనంగా బలి అయింది.' (24వ పుట) 'నిజంగా పిరికివాళ్ళెంత సంఘ ద్రోహులు ? తను ఎంత పిరికి వాడు? (143 వ పుట). 'ఏ కళ, సాధనం చేసేవాడైనా ఒకేసారి రెండు ప్రపంచాలలో జీవించాలి. వాస్తవ ప్రపంచాన్ని వదులుకుంటే కళాసాధన నేల విడిచిన సాము అవుతుంది. కళలో నిమగ్నులవుతూ ఉండకపోతే అది స్వాధీనానికి రాదు. ఈరెండు ప్రపంచాలలో ఏ ఒక దానిలోనూ పార్వతికి తగిన స్థానం లేక పోవటం ఆమె ప్రారబ్ధం. (161వ పుట).

—వి. ఎస్. అవధాని



కుమారి సంఘమిత్ర (డాక్టర్ ఎస్. ఎస్. రామచంద్రరావుగారి కుమార్తె ఇటీవల మదరాసులో ఆహూతులైన పెద్దల సముఖంలో నృత్యప్రదర్శన యిచ్చి వారి మెప్పుపొందింది.

సినిమా

జరుగగలదని తెలుస్తుంది.

* * *

ఉత్తమ చిత్రలో చంద్రమోహన్‌కు పాడిన బాలసుబ్రహ్మణ్యం ప్రొడ్యూసర్స్ కంబైన్స్‌వారి కలర్ చిత్రంలో నాగేశ్వరరావుకు ను దాశరథిగారు వ్రాసిన పాటను శ్రీ మహదేవన్ సారథ్యంలో పాడారు. అక్కినేనికి పాడినట్టు 'పిట్టల్ పూచి' (రామకుమార్ పిక్చర్స్) చిత్రంలో శివాజీకి ఒకపాట పాడారు. దీంతో తెలుగు, తమిళ కథానాయకులందరికీ బాలసుబ్రహ్మణ్యం పాడినట్టయింది. తక్కువ కాలంలో ఎక్కువపాటలు పాడిన బాలసుబ్రహ్మణ్యాన్ని అభినందించాల్సిందే. తెలుగు, తమిళ సంగీత దర్శకుల అభిమానాన్ని సంపాదించిన ఈ యువగాయకుడు తెలుగు, తమిళ ప్రజల ఆదరణను కూడా సంపాయించడం ఒక విశేషమే.

—శ్రీనివాస్

ఏప్రిల్ ఫూల్స్

(31 వ పేజీ తరువాయి)

సారీ సార్! ఆ కార్టూన్లు శ్రీ బాపు వేసినవి కావు! ...

మీ. సుబ్బారావ్

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

